vaaradhionline.com

విచ్ఛిన్న సంసారము

ప్రతీకారము

vaaradhionline.com

శ్రీరవీంద్రనాథఠాకూర్

vaaradhionline.com

విచ్ఛిన్న సంసారము

ప్రతీకారము

రవీంద్రనాథ ఠాకూర్

కారుమూరి వైకుంఠరావు
490 తిరువత్తూరు హైరోడ్
మద్రాసు-21

మొదటికూర్పు—1963—1000 ప్రతులు

vaaradhionline.com

వెల ఒకరూపాయి

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్
292, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ రోడ్, చెన్నపురి—1.

విషయసూచిక

			పుట
పిచ్చిన్న సంసారము	...	...	౧
ప్రతీకారము	...	...	౧౧౮

vaaradhionline.com

రచించిన ఇతర గ్రంథములు

నవలలు

ఇంటాబయటా

పడవముంక

దొంగదొంగలు

ప్రాయశ్చిత్తము

చతురంగము (అచ్చులో ఉన్నది.)

నాటకములు

గృహప్రవేశం

ఫోస్టాఫీస్

కథలు

కథాగుచ్ఛము -

6 సంపుటములు

vaanchinthana.com

విచ్ఛిన్న సంసారము.

భూపతికి ఉద్యోగముచేసి ధనమార్జింపవలసిన అవసరము లేదు. అతడు డబ్బుకలవాడు. చేశముకూడ ఆందోళనతో వేడెక్కిపోవున్నది. కాని భూపతి పుట్టిన నక్షత్రమటువంటిది. ఉద్యోగముచేసే తీరవలెను. కనుక అతడొక ఇంగ్లీషు వార్తాపత్రికను స్థాపించుట తటస్థించినది. అప్పటినుండి కాలమెట్లు గడుపుట యనుచింత లేకపోయినది.

ఇంగ్లీషులో వ్రాయుటకు ఉపన్యాసము లిచ్చుటకు అతడు ఉత్సాహపడుచుండెను. ఎట్టిప్రయోజనము లేకున్నను ఇంగ్లీషు పేపర్లకు లేఖలు వ్రాయుచుండెను. చెప్పవలసిన దేమియు లేకపోయినను సభలలో మాటలాడక వచ్చువాడు కాడు.

ధనికుడగు భూపతిని తమ సంఘములలోనికి లాగవలెనని రాజకీయసంఘనాయకు లతనిని స్తోత్రము చేయుచుండుటచే భూపతికి తనకుగల ఇంగ్లీషురచనాశక్తి అసాధారణమైనదను అభిప్రాయ మేర్పడినది.

స్లీడరువృత్తియందు హతాశుడైన బావమరిది ఒకడు భూపతిచగ్గరకువచ్చి ఇట్లు ప్రారంభించెను.—'నీవంటి అసాధారణశక్తికలవాడు ఇంగ్లీషువార్తాపత్రిక పెట్టినయెడల—"

భూపతికి ఉత్సాహము ద్విగుణితమైనది. ఇతరుల పత్రికలలో లేఖలు ప్రచురించుటలో గౌరవము లేదని తోచినది.

సొంతపత్రికలో స్వేచ్ఛానుసారము కలము నడిపించవలెనని ఘోరిక కలిగినది. భావమరిదిని సహకారిగాచేసికొని భూపతి అల్పవయస్సులోనే సంపాదకుని సింహాసన మెక్కెను.

రాజకీయ మదోన్మత్తత, సంపాదకీయ మదోన్మత్తత అల్పవయస్కులపై గట్టిపట్టు పట్టగలవు. భూపతికి మత్తెక్కించు వాకుకూడ అనేకు లుండిరి.

అతడు పత్రికపనిలో మునిగి మైమరచియుండు సమయములోనే భార్య, చారులత, యౌవనమున అడుగు పెట్టినది. వార్తాపత్రిక సంపాదకున కీవార్త సరిగా తెలియలేదు. ఇండియాగవర్న మెంటువారి సీమాంతనీతి మితిమీరఁబట్టి కట్లను త్రెంచుకొనబోవుచుండుటయే అతనిదృష్టిని ముఖ్యముగా ఆకర్షించుచుండెను.

చారులత ధనవంతులయింటి కోడలు-ఆమెకు ఇంటిపనిచేయు అవసరములేదు. ఫలరూపముగ పరిణమింపబోని పుష్పమువలె పనిపాట్లులేక రాత్రింబగళ్లు ప్రయోజనశూన్యమైన పరిపక్వత పొందఁచుండుట ఒక్కటియే చారులత పని. ఆమె కెట్టి కష్టములు లేవు, పనిలేదు, లేమిలేదు.

ఇట్టిపరిస్థితులలో మంచి యవకాశము చిక్కినయెడల వధువు భర్తనే తనసర్వస్వముగా చేసికొని రాత్రింబగళ్లు కూర్చుండును; దాంపత్యలీల సీమల నుల్లంఘించుచుండును. అనియమములే నియమము లౌచుండును. చారులత కట్టి యవకాశములు చిక్కలేదు. ఆవరణవలె భర్తను చుట్టపెట్టియున్న

వార్తాపత్రికను భేదించుకొనిపోయి అతనిపై అధికారము సంపాదించుట ఆమె కసాధ్యమైనపని.

యువతియగు భార్యవైపు అతని మనసు నాకర్షింపచేయ కోరి బంధువు డొకడు భూపతిని చీవాట్లుపెట్టెను. భూపతి తెలివితెచ్చుకొని, "ఔను నిజమే. 'చాకు'కు పనిపాట్లు లేవు. సదా ఒంటరిగా ఉండవలసి వచ్చుచున్నది. జట్టు కెవరైన దొరికినయెడల బాగుండును," అని జబాబు చెప్పెను.

భూపతి బావమరిది, ఉమాపతితో, ఇట్లనెను— "నీభార్యను మాయింటికి తెచ్చి ఇక్కడనే ఉంచినయెడల బాగుండును. ఈడువా రెవ్వరును లేకపోవుటచేత చాకుకు కష్టముగా నుండవచ్చునని నాకు తోచుచున్నది."

తనతోటివా రెవరును దగ్గర లేకపోవుటయే చాకు దుఃఖమునకు కారణమని సంపాదకుని అభిప్రాయము. కనుక బావమరిది భార్య, మందాకిని, వచ్చి తమయింట కాపురము పెట్టినప్పటినుండి అతడు నిశ్చింతగా కూర్చుండెను.

భార్యాభర్తలలో మొదట ప్రేమోదయమయినప్పుడు వారిప్రపంచమును నింపిన అరుణరాగము చిరనూత్నముగా కనబడుచుండును. అట్టి దాంపత్యస్వప్నప్రభాతము ఎప్పుడువచ్చి ఎప్పుడుపోయినదో వీరికి చైతన్యమే కలుగలేదు.

నూతనత్వముయొక్క రుచిచూడకయే, వీరు అన్యోన్య పరిచితులయిపోయిరి. పాతబడిపోయిరి.

చారులతకు చదువు సంధ్యలయెడల ఆసక్తియుండుటచే కాలముగడపుట కష్టముగా తోచలేదు. ఆమె నానాయుక్తులు పన్ని చదువు నేర్చుకొను ప్రయత్నము చేయుచుండెను. భూపతి మేనత్తకొడుకు, అమల్, బి. ఏ. క్లాసులో చదువు చుండెను. ఇతని సహాయమువల్ల చారు చదువు నేర్చుకొను చుండెను, ఆకాస్తసహాయమునకై అమలుని మురిపింపు లెన్నో చారు సహించియుండవలసి వచ్చినది. ఇంగ్లీషు సాహిత్య గ్రంథాలు కొనుక్కొనుటకు, హోటల్‌లో ఫలాహారము చేయుటకు చారు తరుచుగా డబ్బీయవలసివచ్చుచుండెను. అమల్ అప్పుడప్పుడు తనమిత్రులను విందున కాహ్వానించు చుండెను, దానికి అగుఖర్చు గురుదక్షిణరూపముగా చారే భరించుచుండెను. చారుపై భూపతి ఎట్టి యధికారమును చలాయించువాడు కాడు. కాని ఆకాస్త చదువుచెప్పుటవలన అమలుడు సంపాదించిన హక్కులకు మితిలేదు. అమలుని వ్యవహారముచూచి మధ్యమధ్య చారు కోపము నటించు చుండెను. కాని ఇతరుల కేదో కొంత ఉపయోగపడుట, అనురాగముకొలది చేయుఅల్లరి సహించియుండుట, ఆమె సుఖమున కత్యావశ్యకమైనవి.

అమల్ ఒకనాడు చారుతో నిట్లనెను—"వదినా, రాజు గారి అల్లుడు పూలల్లికజోడు తొడుగుకొని మాక్లాసుకు వచ్చుచున్నాడు. రాణి దానిని స్వహస్తములతో అల్లినది.

అదిచూచి నేను సహించలేకున్నాను. నాకుకూడ అటువంటిది కావలెను. లేనిచో నాగౌరవము నిలబెట్టుకొనలేను."

చారు—"ఆహా సందేహా మేమి! నీకొరకు బొళ్లున్లుచు కూర్చొని నేను చావవలెను, కాదా! రూపాయ లిచ్చెదను, బజారుకుపోయి ఒకజోడు కొనితెచ్చుకొనుము."

అమల్—"అట్లు పనికిరాదు."

పూలుఅల్లుట చారుకు చేతకాదు. ఆమాట ఒప్పుకొనుటకు చారు కిష్టములేదు. ఇంకెవరికోర్కె నెరవేర్చుచక పోయినను చారు తనకోర్కెమాత్రము తీర్పక నుండజాల కూడదని అమలుని ఇచ్చ. అమల్ కాలేజిలో నుండుసమయ ములో చారు రహస్యముగా బహుప్రయత్నముచేసి జోడల్లిక నేర్చుకొన్నది. అనేకదినములు గడిచిపోయినవి. అమల్ ఆజోడుమాట పూర్తిగా మరిచిపోయినతరువాత ఒకనాటి సాయంకాలము చారు అతనిని అంతఃపురములోనికి ఫలాహార మునకై పిలిపించినది.

వేసవికాలము డాబామీద ఫలాహారమున కేర్పాటు జరిగినది. ఫలాహారముపై దుమ్ముపడకుండునట్లు కంచముమీద ఇత్తడి మూత బోర్లించబడియున్నది. అమల్ కాలేజినుండి వచ్చి ముఖము కడుకొని, దుస్తులు మార్చుకొని అత్యాదరముగా ఫలాహారమునకు లోపలికి వచ్చెను.

ఆసనముమీద కూర్చొని ఇత్తడిమూత తీయగానే కంచములో చక్కని పూలుజోళ్లజత కనబడినది. ఎదుట నిలిచి యున్న చారు పకపక నవ్వనారంభించినది.

జోళ్లు దొరికినప్పటినుండి అమలుని కోర్కె లధిక మగుచు వచ్చినవి. మెడకుచుట్టుకొనుపూలు కంఫర్ట రొకటి కావలెనట. లతయల్లిన పట్టురుమాలు, బయట కుర్చీవీపుపై డాగుపడకుండునట్లు వేసికొనుటకు అల్లికపనిచేసిన రుమాలు అవసరమైనవి.

అమల్ క్రొత్తవస్తువును కోరినప్పుడెల్ల చారు అతనికి చీవాట్లుపెట్టి కలహించుచుండెను. కాని చిట్టచివరకు శ్రమపడి అతని కోరికలన్నిటిని నెరవేర్చుచుండెను.

మధ్యమధ్య పని ఎంతదూరము నడిచినదని అమల్ అడుగుచుండును. "ప్రారంభము కాలే" దని చారు జబాబు చెప్పుచుండు నొకమారు, "నాకది జ్ఞాపకమేలే," దని చెప్పు చుండును మరియొకమారు.

కాని కోరికను విడచువాడుకాడు అమల్ - మురిపింపు లతో ప్రతిదినమును జ్ఞాపకముచేయుచుండును. అమల్ పట్టిన పట్టు వదలువాడు కాడని ఎరిగి అతడు చేయబోవు అల్లరిని చూచి ఆనందింపకోరి చారు ఔదాసీన్యము నటించుచుండెను. చివరకు అతడు కోరినవస్తువు సిద్ధముకాగానే దాని నతని కిచ్చి ఆతని ఉత్సాహమునుచూచి చారు ఆమోద మొందుచుండెను.

చారు గొప్పయింటికోడలు. ఎవరికొరకైన నెట్టిపనియైన చేయుట కవసరముండునది కాదు. అమల్‌మాత్ర మామెచే నేదో యొకపని చేయించక వదలువాడు కాడు. కాని ఆ చిన్న

చిన్న పనులు చేయుచుండుటవల్లనే ఆమె హృదయవృత్తులు చరితార్థత పొందుచుండెను.

ఇంటి అంతఃపురమునను న్న చిన్నస్థలమును ఉద్యాన మని వర్ణించుట కేవల మతిశయోక్తి - అక్కడనున్న చెట్లలో ముఖ్యమైనది సీమఉసిరికచెట్టొకటి. ఆస్థలమున ఉద్యాన మొకటి నిర్మించ నిశ్చయించి ఒకకమిటీని ఏర్పరచిరి.

చారు, అమల్—వీరిద్దరు ఆకమిటీసభ్యులు ప్రతిదిన మును ఇద్దరును కలసి ప్లాన్లువ్రాసి కొలతలువేసి అత్యుత్సా హముతో వాదించుచు కొన్నాళ్లు గడిపిరి.

అమల్—"ఆకాలపు రాజకన్యకవలె నీవు స్వహస్త ముతో చెట్లకు నీరుపోయుచుండవలెను వదినా."

చారు:—"ఆమూలను చిన్నకుటీర మొకటి వేయ వలెను. దానిలో లేడిపిల్ల నుంచవచ్చును."

అమల్—"చిన్న కొల నొకటికూడ నుండవలెను. హంస లందులో ఈదుచుండును."

"అందులో నీలపద్మములను వేయవలెను. నీలపద్మములు చూడవలెనని నాకెంతో కాలమునుండి మిక్కిలి కోరికగా నున్న" దని చారు అత్యంతోత్సాహముతో నన్నది.

అమల్—"కొలనుపైని చిన్నవంతెన కట్టించినయెడల ఎంతో.అందముగా నుండును. రేవులో చిన్న నావ నుంచుదము."

చారు—"రేవు తెల్ల మార్బిల్‌తో కట్టించవలెను."

అమల్ కాగితము పెన్సిల్ తెచ్చి గీర్లుగీసి అత్యాడంబరముగా మ్యాప్ ఒకటి తయారుచేయ మొదలుపెట్టెను. గీసినది రద్దుచేసి కొత్తప్లానును వ్రాయుచుండిరి, దానిని దిద్ది మరియొకటి—అట్లు గీసిగీసి పాతికముప్పది మ్యాపులు తయారు చేసిరి.

ప్లాను సిద్ధమైన తరువాత ఎస్టిమేటుచేయ ప్రారంభించిరి. స్వంతఖర్చుకై చారుకు నెలనెలకు కొన్నిరూపాయ లిచ్చుచుండుట ఆయింటి పద్ధతి. ఆరూపాయలతోనే కొంచెము కొంచెముగా *బాగాక్ సిద్ధపరచవలెనని వారి ఉద్దేశము. అంతఃపురమున ఎక్క- డేమిజరుగుచున్నదో భూపతి ఎరుగడు. ఎన్నడో కాని అత డింట్లోనికి వచ్చువాఁడుకాడు. బాగాక్ పూర్తియైన తరువాత చారు ఒకనా డతనిని అంతఃపురములోనికి ఆహ్వానించి, ఆ యద్భుతసృష్టిని అతనికి హఠాత్తుగ చూపించి విస్మితునిచేయ దలచినది. దానినిచూచి అది అల్లా-ఉద్-దిక్ ల్యాంపుసహాయమువల్ల జపాన్ దేశముసుండి వచ్చిన ఉద్యానమని భూపతి అనుకొనకమానడని, చారు ఊహించినది!

ఎస్టిమేట్ ఎంతతగ్గించినను తన పైవేటుఖర్చులరూపాయలతో ఆ బాగాక్ తయారుచేయుట అసాధ్యమని చారు పోల్చుకొన్నది.

"అక్కొన ఆకొలను మాని వేద" మని అమలనెను. చారు "కొలను మానుట కెంతమాత్రము వీలులేదు, కొలను లేనియెడల నానీలిపద్మము లెక్క-డుండును?"

---

* ఉద్యానము.

అమల్—"నాన్నగారి లేడిపిల్ల కుటీరము డాబాగాచేయక గడ్డియిల్లుగా ఉంచవలె.

"అన్నగారి నా కాకుటీరమే అవసరములేదు," అని కోపముతో జబాబుచెప్పినది చారు.

మారిషస్‌నుండి లవంగపు అంటు, మైసూరునుండి చందనము, సింహళమునుండి చాల్చిని మొదలైనవి తెప్పించవలెనని మొదట వారిసంకల్పము. వానికి బదులు మానిక్‌తలానుండి దేశిఅంట్లను కొన్ని తెప్పించవలసియుండునని అమల్ అన్నాడు. చారు ముఖముభారముచేసికొని, "నాకటువంటి ఉద్యాన మవసరమే లే"దని యన్నది. ఎట్టి మేటుతోపాటు ఊహనుకూడ తగ్గించుటకు చారు కెంతమాత్ర మిష్టము లేకపోయినది. బయటి కేమిచెప్పినను ఇట్లు తగ్గించుట అమలునకుకూడ రుచికరముగ లేకుండెను.

అమల్—"అన్నగారి సీవు అన్నయ్యతో చెప్పవదినా. అన్నయ్య కావలసిన రూపాయలు తప్పక యిచ్చును."

చారు—"దానిలో ఆనంద మేమున్నది. ఆయనతో చెప్పినయెడల దొరలకంపెనీకి ఆర్డరిచ్చి గొప్ప *"ఇడెక్‌గార్డెన్స్" తయారుచేయించగలడు. అప్పుడు మనప్లాను ఏమైనట్లు?"

చారును అమలుడును—జామచెట్టుక్రింద కూర్చొని నిర్మించబోవు ఉద్యానమును గురించి ఊహించి ఆనందించుచుండు వేళ

---

* కలకత్తాలోనున్న సుందరమైన పెద్దఉద్యానము.

చారుమరదలు, మంద, మేడమీదినుండి, "ఇంతవేళ అయినది, తోటలో కూర్చొని మీరేమిచేయుచున్నా"రని, కేకవేసినది.

"పలుకపారిన కాయలకొరకు వెదుకుచున్నాము," అని చారు జబాబువచ్చినది.

"దొరికినచ్చినా నాకొరకుకూడా నాలుగు తీసుకొనిరా," అని మంద అన్నది.

చారు నవ్వినది, అమల్ నవ్వెను. వీరిసుఖమునకు ప్రధానకారణము తమ రహస్యములు తమ ఇద్దరికేతప్ప మరియెవ్వరికిని తెలియకుండుట. మందాకినికి ఇంకేసుగుణమున్నను లేకున్నను ఊహాశక్తిమాత్రము లేదు. ఆటువంటప్పుడు వీరి ప్రస్తావములయందుండు రసమామె ఎట్లు గ్రహించగలదు? కనుక ఆ కమిటీసభ్యులిద్దరి యాలోచనలలో నామెకు తావు లేదు.

ఆ సాధ్యాతీతమైన ఎట్టిమేటు తగ్గించలేకపోయిరి. ఊహలుకూడ క్రిందికి దిగనన్నవి. కనుక వారి కమిటీ సభలు అదేవిధముగా ఆచెట్టుక్రిందను మరి కొన్నాళ్లు జరిగినవి. బాగాన్‌లో ఎక్కడ కొలను తవ్వించవలెనో, ఎక్కడ కుటీరము వేయించవలెనో, ఎక్కడ మండపము కట్టించవలెనో ఆయా స్థలములలో అమల్ గీట్లుగీసి అంతయు సిద్ధపరచియుంచెను. ఇట్లుండ ఒకనాడు చెట్టుక్రింద కూర్చొని చారు హఠాత్తుగా—"నీకు కవిత్వము చేతనయియుండినయెడల ఎంతబాగుండును!" అని యన్నది.

"ఏమిటి ఆబాగు?"

"మన ఉద్యానవర్ణనతో నీచేత కథ ఒకటి వ్రాయించి యుందును. అందులో మనకొలను, లేడిపిల్లకుటీరము, తెల్ల మార్బుల్ రేవు వర్ణించియుందువు; ఆవర్ణన బోధపరచుకొను వారము మనమిద్దరమే, చాల తమాషాగా ఉండును—ప్రయత్నముచేసిచూడుము అమల్, తప్పక వ్రాయగలిగెదవని నానమ్మకము."

"సరే అయితే, వ్రాయగలిగితే నాకే మిచ్చెదవు?"

"నీ కేమి కావలెను?"

"నా దోమతెర మీదిగుడ్డపైని వెనసలుతో లతలు గీసి ఇచ్చెదను, వానిని పట్టుదారముతో నీవు కుట్టి ఈయవలెను."

"నీకోరికలన్నియు అటువంటివే! దోమతెరమీద పట్టు లత లెక్కడైన చూచితివా?"

దోమతెర ఒకసౌందర్యరహితమగు కారాగృహము కాదని సూచించుచు చాల సంగతులుచెప్పి అమల్ ఇట్లనెను—"లోకములో నూటికి తొంబదితొమ్మండుగురికి సౌందర్య జ్ఞానము లేదు. అందములేని వస్తువులనుచూచినప్పుడు వారికి విసుగు కలుగకుండుటయే నేననుదానికి ప్రమాణము."

అతని వాదములోనుండు సత్యమును చారు తత్తణమే గ్రహించినది. తమ రహస్యసంఘములోని సభ్యులిద్దరును ఆ మూఢులగు తొంబదితొమ్మండుగురిలో చేరనివారని తెలిసి

కొని ఆనందించి, "సరే, దోమ తెరమీద లత అల్లెదను, నీవు కవిత్వము ప్రారంభించు" మని యన్నది.

"నాకు కవిత్వము చేతకాదనుకొనుచున్నావా?" అని అమల్ రహస్యమేదో చెప్పుచున్నట్లుగా చారుతో ననెను.

"అట్లైన నీవేదో వ్రాసేయున్నావు, నాకది చూపించు," అని మిక్కిలి ఉత్తేజముతో చారు తొందర పెట్టుట ప్రారంభించినది.

"నేడు వద్దు వదినా."

"నేడే చూపించవలెను, అమల్ వెళ్లు—తత్ క్షణమే తీసికొని రమ్ము."

తన రచనను చారుకు చూపింపవలెనను కోరికను అమల్ ఎన్నాళ్లనుండియో అణచిపెట్టుకొని యుంచెను. చారుకు తన రచనబోధపడకపోవచ్చును, లేదా ఆమె కది ఉత్తమ రచనగా తోచకపోవచ్చునని అతడు సంకోచించుచుండెను.

నేడు రచనను తీసికొనివచ్చి, ముఖ మెట్టిచేసికొని, కొంచెము దగ్గి, గొంతుక సవరించుకొని చదువుట ప్రారంభించెను. చారు చెట్టు మొదలుపై చేరపడి, కాళ్లుచాచుకొని వినుటకు కూర్చుండెను.

ఉపన్యాస విషయము, "నానోటుబుక్కు"—అమల్ ఈ విధముగా ప్రారంభించెను—"ఓ నా తెల్లని నోటుబుక్కా, నాడాహా నిన్నింకను స్పృశింపలేదు. అదృష్టపురుషుడు సూతికా గృహమందు ప్రవేశించక పూర్వము శిశువుయొక్క లలాట

ఫలకమువలె నీవింతవరకు నిర్మలమై రహస్యమయమైయున్న దానవు. నీ చివర పుటలో కడపటిపంక్తి నేను వ్రాయగల దినమెప్పుడో! నీశుభ్రశిశుపత్రములు ఆమసీచిహ్నిత సమాప్తిమాట ఊహించనైనలేవు." ఇదే ధోరణిని అమల్ ఏమేమో వ్రాసుకు పోయెను.

చారు చెట్టుమొదట నిశ్చలముగ కూర్చుండి విని ఉపన్యాసము ముగిసిన తరువాత కొంతసేపూరుకొని, "అమల్, నీవింకా వ్రాయలేవూ?" అని అడిగినది.

అమల్ సాహిత్యమదిరరసమును రుచిచూచుట ఆనాడే మొదలు, ఆనాడతనికి సఖుగానున్నయామె యువతి. రుచి కొత్త, రసనము నవీనము, అపరాహ్ణ దీర్ఘచ్ఛాయలచే దినమును రహస్యమయము!

"నాలుగు పలకుపారిన జామికాయలు తీసికొని పోదము—లేనియెడల మందకేమి చెప్పగలము?" అని చారు అన్నది.

మందాకిని మూఢురాలు. చదువుసంధ్యలమాట, సాహిత్యచర్చమాట ఆమెతో చెప్పబుద్ధిపుట్టదు—కనుక నాలుగు జామికాయలు కోసితీసుకొనిపోవలసి వచ్చినది.

ఉద్యానము నిర్మించవలెనను సంకల్పము వారి యితర సంకల్పములతోపాటు సీమాహీన ఊహాలోకములో ఏమూలను మాయమైనదో చారుగాని అమల్‌గాని గమనించలేదు.

ఇప్పుడు వాదించుచుండు ప్రధానవిషయము అమలుని రచన—అమల్ మధ్యమధ్యవచ్చి, "అతి చిత్రమైన భావ మొకటి తలలోకి వచ్చినది వదినా," అని అనుచుండును.

ఉత్సాహముతో చారు జవాబుచెప్పుచుండును—"దక్షిణపు వరండామీదికి పోదముపద, ఇప్పుడే మంద ఇక్కడికి తాంబూలము సరుదుటకు వచ్చును."

వరండామీద చింకిబెత్తుకుర్చీవేసుకొని చారు కూర్చుండును. వరండా జాలుదగ్గర ఎత్తైన జాగా ఒకటిచూచి కాళ్లు చాచుకొని అమల్ కూర్చుండును.

రచనా విషయములు స్పష్టమైన ఆకారముగలవికావు. కలగాపులగముగా అమల్ వ్రాసినది ఎవరికిని స్పష్టముగా బోధపడునదికాదు. ఉండియుండి అతడే, "దానిలోనిభావము నీకు స్పష్టముగా బోధపరచలేను వదినా," అనుచుండును.

"లేదు లేదు, చాలావరకు బోధపడినది. అదే ధోరణిని వ్రాసుకొనిపొమ్ము, ఆలస్యముచేయకు" మని చారు ఉత్సాహపరచుచుండును.

చారు కొంతబోధపరచుకొని, కొంతబోధపరచుకొనలేక, కేవలము ఊహించుకొని, అమలుని ఆవేగముచే ఉత్సాహము పొంది తనమనస్సులోని భావములకొక ఆకారము నిచ్చి ఆనందించుచుండెను.

ఆనాటిరెండవపూటనే "ఎంతవరకు వ్రాసినా," వని అడుగుచుండును.

"ఇంతలో నేమి వ్రాయగలను?" అని అతడు జవాబిచ్చుచుండును.

ఆ మర్నాడే కొంచెము పోట్లాటస్వరముతో, "ఏదీ, అది ఇంకా వ్రాయలేదే!" అని చారు అడుగుచుండును.

"మరికొంచె మాలోచించవలె" నని అమల్ ఉత్తర మిచ్చుచుండును.

"అయితే నీవు వ్రాయనవసరము లేదు." అనును చారు.

సాయంకాలమునకు ఆకోపము బలిసి చారు మాటలాడుట మానునప్పటికి, అమల్ జేబురుమాలు తీసి కొనుచున్నట్లు నటించి వ్రాసి జేబులోనుంచుకొని వచ్చిన తనరచన చారు కంటపడు నట్లు చేయుచుండును.

చారు మౌనవ్రతభంగముచేసికొని, ఉత్సాహముతో, "అదిగో వ్రాసి నాదగ్గరదాచుచున్నావు, చూపించు" అని అనుచుండును.

అమల్—"ఇంకా పూర్తికాలే" దనువాడు.

చారు—"పనికిరాదు, ఇప్పుడే చదివి వినిపించవలెను."

అమల్‌కూడ వినిపించవలెనని ఆతురపడుచుండును. కాని లేదులేదని ఆమె ఉత్సాహమును పెరిగించనిదే వినిపించు వాడుకాడు. అటుపిమ్మట కాగితములను చేతితో సాఫ్చుచేసి పెనసలుతీసి రెండుమూడుస్థలములలో దిద్దుచుండును. అంతలో చారుమనస్సు పులకితమై జలభారముచే క్రిందికి వ్రేలాడు మేఘమువలె ఆకాగితములపై వ్రేలాడుచుండును.

ఎప్పటికి ఏరెండుపేరాలు సిద్ధమానో అవి చారుకు వినిపింపకతీరునదికాదు. వ్రాయబోవుదానినిగూర్చికూడ ఇద్దరును కూర్చొని వాదించి ఆనందించుచుండువారు.

ఇప్పటివరకు వారు ఆకాశకుసుమములు కూడబెట్టు ప్రయత్నములో నుండిరి. ఇప్పుడు కావ్యకుసుమమును సృష్టించు ఉద్యమములోనికి దిగి సర్వమును మరచిరి.

ఒకనాటిసాయంకాలము అమల్ కాలేజినుండి ఇంటికి వచ్చునప్పటికి అతని జేబు నిండుగా ఉన్నట్లు కనబడినది. అంతఃపురములో కిటికీదగ్గర నిలుచొనియున్న చారు ఇది కనిపెట్టినది. అమల్ ప్రతిదినము కాలేజినుండిరాగానే ఇంట్లోనికి వచ్చు చుండువాడు. కాని నేడు నిండుజేబుతోవచ్చిన అమల్ తన బయటి గదిలోనుండి అంతఃపురములోనికి ఎంతసేపటికిని రాలేదు.

చారు అంగణమువరకువచ్చి చప్పట్లుకొట్టినది. కాని ఎవరును వినిపించుకొనలేదు. చారు కోపముతో తిరిగివచ్చి కవితాగ్రంథ మొకటి చేతపుచ్చుకొని వెనుకవరండామీద కూర్చొని చదువ ప్రయత్నించుచున్నది.

గ్రంథము మన్మథదత్త అను ఒక నూతనకవిది. అతని రచనాధోరణి చాలవరకు అమల్ రచనమాదిరిదే. కనుక అమల్ ఎన్నడును అతనిని పొగడువాడుకాడు. అతనిరచనను అప్పుడప్పుడు చారు ఎదుట వికృతోచ్చారణతో వేళాకోళముగా చదువుచుండువాడు. చారు చీకాకుపడి పుస్తక మతనిచేతిలోనుండి లాగుకొని దూరముగా పారవేయుచుండును.

నేడు అమలుని అడుగులచప్పుడు వినగానే చారు ఆమన్మథదత్తుని గ్రంథముతీసి అందులో "కలకండ" అనురచన ఏకాగ్రచిత్తముతో చదువుట ప్రారంభించినది.

అమల్ వరండామీదికి వచ్చెను; చారు అటువైపు చూడకుండుట కనిపెట్టి "ఏమి చదువుచున్నావు వదినా?" అని యడిగెను.

చారు జవాబు చెప్పలేదు, అమల్ చారు వెనుకకువచ్చి నిల్చొని "మన్మథదత్తుని †గలగండ!" అని అన్నాడు.

చారు, "అబ్బా! చీకాకుపెట్టకు నన్ను చదువుకొనీ," అని యన్నది; అమల్ వెనుకనుండి వెటకారముగా కొన్ని పంక్తులు ఆపుస్తకములోనుండి చదివి, చివరకు తన సొంత కవిత్వము కొంత ప్రారంభించెను.

కుతూహల మధికమగుటచే చారు కోపము నటించలేక, పుస్తక మటుపారవేసి నవ్వుచు, "నీకు చాల ఈర్ష్య, నీ కవిత్వము తప్ప మరియేదియు నీకు నచ్చదు," అని అన్నది.

"నీది అత్యుదారచిత్తము కాదా?"

చారు—"ఆహా నిజమే, కాని వెటకారము చాలించి జేబులో నున్నదానిని బయటికి తీయుమయ్యా."

అమల్—"ఏమున్నదో చెప్పుకో!"

---

†బంగాళీభాషలో మెడవాపుతో తూడిన ఒక రుగ్మతపేరు.

చారును చాలసేపటివరకు చీకానుపెట్టి చివరకు, అమల్ "సరోరుహాము" అని పేరుగల విఖ్యాతమాసపత్రిక ఒకటి జేబులోనుండి తీసెను."

ఆపత్రికలో అమల్ వ్రాసిన "నానోటుబుక్కు" అను వ్యాసము వెలువడినది. చారు ఏమియు అనలేదు, దానిని చూడగానే చారు మిక్కిలి ఆనందించునని అమల్ ఆశించుచుండెను. కాని చారుముఖమున ఆనందచిహ్నము లేవియు కానరాకుండుట చూచి, "సామాన్య వ్యాసము లేవియు సరోరుహాములో ప్రచురింప" రని అనెను.

అమల్ చెప్పినది నిజముకాదు, ఏమాత్రము చదువదగిన దైన వదలువాడుకాడు దాని సంపాదకుడు. కాని అతడు అతికఠినపరీక్షచేసి నూటిలో ఒక్క-వ్యాసము నెంచుచుండునని అమల్ చారుకు బోధపరచెను.

విని చారు సంతోషింప ప్రయత్నించినది కాని ఆమెకు లేశమైన నానందము కలుగలేదు. దేనివల్ల ఆమె మనస్సుకు కష్టము కలిగినదో తెలిసికొన ప్రయత్నించినదికాని సబబైన కారణము తట్టలేదు.

అమలుని కవిత్వము అమల్ చారు—వీరిద్దరి ధనము మాత్రమే—అమల్ లేఖకుడు, చారు పాఠకురాలు—దానియందుండు ప్రథానరసము ఇది గుప్తధనముగా నుండుటయే. ఆరచన నందరును చదివి అందరును బాగడుదురను తలంపు చారు

మనస్సున కేల అంత బాధకల్గించినదో ఆమెకు స్పష్టముగా బోధపడలేదు.

కాని లేఖకుని కీర్తిముద ఒక్క-పాఠకుడు అనేకదినములు తీర్చుచుండలేదు. అమల్ తనరచనలను అచ్చొత్తించుట ప్రారంభించెను, ప్రశంసకూడ పొందుచుండెను.

పాఠక భక్తులయొద్దనుండి అప్పుడప్పుడు జాబులుకూడ వచ్చుచుండెను, అమల్ వానిని చారుకు చూపించుచుండెను. అవి చదివి చారు ఆనందించుచుండెను. ఆమెమనస్సుకు కష్టము కూడ కలుగుచుండెను. వ్రాయుమని పురికొల్పుటకు ఇప్పుడు చారు అవసరములేదు. అప్పుడప్పుడు పేరుఊరులేని స్త్రీల దగ్గరనుండికూడ అమలుకు జాబులు వచ్చుచుండెను. వాని విషయమై అమలుని చారు ఎగతాళిచేయుచుండెను కాని అవి చూచి చారుకు ఆనందము కలుగునదికాదు. వారి కమిటీ యొక్క రుద్ధద్వారము తెరుచుకొనిపోయినది. దేశమునసుండు పాఠకబృందము వా రిరువురిమధ్యను అడ్డుగ వచ్చి నిలిచిరి.

ఒకనాడు తీరుబడిగా ఉన్నప్పుడు భూపతి ఇంట్లోనికి వచ్చి, "మన అమల్ ఇంత చక్కగా వ్రాయగలడని నే ననుకొన లేదు చారూ!" అని యనెను.

భూపతి పొగడుటచూచి చారుకు సంతోషము కలిగినది. అమల్ భూపతియాశ్రితుడు, కాని ఇతరయాశ్రితులకు ఇత నికి పెద్దభేదమున్నదని భూపతి తెలిసికొనెనని విని చారుకు

కొంచెము గర్వము కలిగినది. చారు అమలునియెడల అంత ఆదరాభిమానములు కలిగియుండుటకు కారణము వారింత కాలమునకు పోల్చుకొన్నారని తెలియుటయే, ఆమెగర్వమునకు కారణము—తా నమలుని విలువ అనేకదినములకు పూర్వమే పోల్చుకొన్నదనియుండుట. అమల్ సామాన్యలేఖకుడు కాడనియు అతడు నిరసన కర్హుడుకాడనియు ఆగర్వమున కర్థము.

చారు—"అతని వ్యాసములు నీవేవైన చదివితివా†?"

భూపతి—"చదివితిని—లేదు లేదు—సమయము చిక్కుటలేదు, మన నిశికాంతుడు చదివి చాలా పొగుడు చున్నాడు - అతడు చక్కగా బోధపరచుకొనగలడు." అమల్ విషయమై భూపతికి మంచి అభిప్రాయము కలుగవలెనని చారుకు తీవ్రమైన కోరికయుండెను.

వార్తాపత్రికకొనువారికి కొన్నిబహుమానము లిచ్చు చుండినయెడల పత్రికప్రచురణవలన లాభము దొరకునని ఉమాపదుడు భూపతికి బోధపరచుచుండెను. బహుమానములు నష్టము నెట్లు తగ్గించగలవో భూపతి ఎంతప్రయత్నించినను బోధపరచుకొనలేకపోయెను.

---

† బంగాళాదేశములో ముఖ్యముగా శిక్షితసంఘములో, భర్త భార్యను 'నీవు' అని సంబోధించునట్లే భార్యకూడ భర్తను సంబోధించును. తెలుగు దేశస్థులవలె భార్య భర్తను 'ఏమండీ' అనుట భర్త భార్యను 'ఏమే' అనుట వారి సంప్రదాయముకాదు.

చారొకమారు గదిలోనికివచ్చి ఉమాపదు డుండుట చూచిబయటికి వెళ్లిపోయినది. కొంతసేపైనతరువాత మరల వచ్చిచూచునప్పటికి ఇద్దరును లెక్కలుచూచుచు వాదించు చున్నారు.

చారు చీకాకుపడుచుండుట చూచి ఉమాపదు డేదో నెపముపై బయటికి వెళ్లిపోయెను. లెక్కలతో భూపతి తల కలతచెందుచున్నది.

చారు గదిలో ప్రవేశించి ఇట్లన్నది—"మీ లెక్కలింకా తేలలేదు కాబోలు, ఆపత్రికతో రాత్రింబగ ళ్లెట్లు గడుపుచున్నారో నాకేమీ బోధపడకున్నది."

భూపతి జమాకర్చులచిఠాల నటుత్రోసి కొంచెము నవ్వి తనలోతా నిట్లనుకొనెను—"చారునుగురించి ఆలోచించుటకైన నాకు సమయము లేదు, చాలా అన్యాయము! పాప మామె కాల మెట్లు గడపగలదు!"

భూపతి ఎంతో ఆప్యాయముగా అడిగెను—"నేడు మీచదువు లేదాయేమి? మాస్టరుగారు పారిపోయినట్టున్నారు—మీపాఠశాలనియమములన్నియు తలక్రిందులుగా ఉన్నవే—శిష్యురాలు పుస్తకములతో తయారు, మాస్టరుగారి పలాయనము! పూర్వముమాదిరి అమలో నీకు నియమాను సారము చదువుచెప్పుచున్నట్లు లేదే!"

చారు—"నాచదువు కొరకు అమలుని సమయము నష్ట పుచ్చుట న్యాయమా? అమల్ ఒకమామూలు * ప్రైవేట్ ట్యూటరనుకొనుచున్నావా?"

భూపతి చారునడుముచుట్టు చేయివేసి దగ్గరకు లాగుకొని, "ఇది సామాన్యమైన ప్రైవేట్ ట్యూషనా? చదువుచెప్పుటకు నీవంటి వడిన నాకు దొరికియుండిన—"

చారు భూపతి మాటవూర్తిచేయనీయక జబాబు చెప్పినది—"చాలించు చాలించు—భర్తవు కనుక సరిపోయినది, లేనిచో నేమైయుండునో ఎరుగుదువా?"

చారు సంభాషణ భూపతికి కొంచెము బాధకల్గించినది. "అక్కైన నేను రేపటినుండి నీకు చదువుచెప్పెదను, నీపుస్తకములు తీసికొనిరమ్ము, నీవేమి చదువుచున్నావో చూచెద" నని అత డనెను.

చారు "చాలు చాలు, నీవు చదువుచెప్పనక్కరలేదు—కాని నీపేపరు జమాఖర్చులలెక్క కొంచెము కట్టిపెట్టి ఇంకే విషయమునుగుఱించియైన మాట్లాడగలవో లేదో చెప్పు."

భూపతి—"ఆహా ఇప్పుడు నామనస్సు నీవెటు త్రిప్పితే అటే తిరుగును."

చారు—"అక్కైన, అమల్ వ్రాసిన ఈవ్యాసము చదివి చూడు—దీనిని చదివి నవగోపాల్ బాబు అమల్‌కు ఇండియా దేశపు †రస్‌కిన్ అనుపేరు పెట్టెనని సంపాదకుడు వ్రాసెనట."

---

* Private Tutor = ఇంటివద్ద చదువుచెప్పే మాష్టరుగారు.

†Ruskin.

విని భూపతి సంకోచించుచు ఆమెచేతిలోనుండి పత్రికను తీసికొనెను. పత్రిక విప్పిచూచెను. వ్యాసశీర్షిక "ఆషాఢ చంద్రుడు." ఇప్పటికి రెండువారములయినది భూపతి సర్కార్ †బజెట్‌తో బుర్ర బాదుకొనుచున్నాడు. ఆ అంకెలన్నియు బహుపదకీటకములమాదిరి అతని తలలో మూల మూలనుదూరి కెలకెలపెట్టుచుండుటచే 'ఆషాఢచంద్రు'ని ఆ మూలాగ్రముచదువు స్థితిలోలేడు. వ్యాసముకూడ చిన్నది కాదు.

వ్యాసము ఈవిధముగా ప్రారంభమైనది—ఆషాఢ చంద్రుడు నేడేల నీవిధముగ మేఘములవెనుక దాగి యున్నాడు—స్వర్గలోకమునుండి ఏదైన దొంగిలించివచ్చి ఆకళంకమును దాచుకొన యత్నించుచున్నాడా? ఏమూలను మేఘచ్ఛాయలేని చైత్రాకాశమున నిర్లజ్జగా తనను ప్రకాశింప చేసికొనుచుండెను—నేడా పకపకమను నవ్వేది, శిశుస్వప్నము వంటి, ప్రియురాలి స్మృతివంటి, సురేశ్వరి శచియొక్క అలక విలంబిత ముక్తమాలవంటి—"

అంతవఁకుచదివి భూపతి తలగోకుకొనుచు ఇట్లనెను—"చక్కనిరచన, కాని దీనితో నాకేమిప్రయోజనము? నాకా కవిత్వము బోధపడునా!"

చారు ఆకాగిత మతనిచేతిలోనుండితీసికొని సంకోచముతో, "అయ్యెన, నీకు బోధపడునది ఏమిటి?" అని అడిగినది.

---

†Budget - సర్కార్‌వారు శాసనసభలో నిర్ణయించబోవు జమా ఖర్చులు.

భూపతి—"నేను సామాన్యమానవుడను నాకు బోధ పడునది సంసారములోనుండు మనుష్యులు."

చారు—"సాహిత్యములో మనుష్యులసంగతి ఉండదు కాబోలు!"

భూపతి—"ఉండును కాని సాహిత్యములో నుండు నవి కల్పితములు, అదికాక సశరీరముగ మనుష్యులుండగా కల్పితరచనలలో వారిని వెదకుచు తిరుగుచేల?"

ఇలాగుననుచు భూపతి చారులతగడ్డమును ముద్దుగా పట్టుకొని, "ఇదిగో, ఇప్పు డేవిధముగా నిన్ను తెలుసుకొన గలుగుచున్నానో ఆలాగున తెలుసుకొనవలెనన్న 'మేఘనాద వధ' కావ్యము మొదటినుండి చివరవరకు చదువవలెనా"? అని యనెను.

కావ్యముల బోధపరచుకొను శక్తిలేదని భూపతి కొంత గర్వపడుచుండెను. అమలుని కవిత్వము బాగుగా చదువలేదు, ఐనను అమలునియెడల లోలోపల కొంత భక్తి గౌరవములు అతనిలో కలిగినవి. చెప్పవలసినవిషయ మేమియు లేకున్నను అనర్గళముగ నన్నిమాటలు చెప్పుట తలపగులకొట్టు కొన్నను నాకు చేతకానిపని యని భూపతి అనుకొనెను. అమల్ కడుపులో నింతసామర్థ్యమున్నదని ఎవ రూహించ గలరు?

తనకు రసజ్ఞానము లేదని భూపతి ఒప్పుకొనుచుండును. కాని సాహిత్యవిషయములలో నెట్టి కృపణతయు అతనిలో

కనపడునది కాదు. డబ్బులేని గ్రంథకర్త ఎవడైనవచ్చి భూపతిని పట్టుకొనినచో గ్రంథమచ్చొత్తించుభారము తానే వహించు చుండును. కాని గ్రంథముమాత్రము తనకంకితముచేయవద్దని కోరుచుండును. బంగాళీభాషలో చిన్న పెద్ద, ఎన్ని వారపత్రికలు, మాసపత్రికలు ఉన్నవో వానికి చందాదారుడుగానుండెను. విఖ్యాతములైనవిగాని అఖ్యాతములైనవిగాని, పాఠ్యములైనవి గాని అపాఠ్యములైనవిగాని, ప్రచురితమైన ప్రతిబంగాళీగ్రంథ మును భూపతి కొనుచుండెను. "చదువుటలేనేలేదు, దానికి తోడు కొనుటకూడ మానినచో, పాపముచేయుచుండుటకు తోడు ప్రాయశ్చితము వద్దనుట కాదా!" బంగాళీగ్రంథముల నతడు చదువువాడుకాడు కనుక పాడుగ్రంథములను ద్వేషించు వాడుకాడు. అతని బంగాళీలైబ్రరీ గ్రంథములతో నిండి యుండెను.

అమల్ ఇంగ్లీషుప్రూఫులుదిద్దుటలో సాయపడుచుండెను. ప్రాతప్రతిలోని కొన్నిమాటలు తెలియలేదు. భూపతిని అడిగి వానిని తెలిసికొనవచ్చునని కాగితములు కొన్నిపట్టుకొని అమల్ హఠాత్తుగా గదిలోనికి నచ్చెను.

భూపతి అతనినిచూచి నవ్వుచు ఇట్లనెను—"అమల్, ఆషాఢ చంద్రునిపైని, భాద్రపదమాసపు తాటిపండుపైని నీకిష్టమువచ్చినంత కవిత్వము వ్రాసుకో, నే నభ్యంతరపెట్టగా— ఎవరిస్వాధీనతపైని నేను చేయివేయను. నాస్వాధీనతకు మీరడ్డు

వచ్చెదరేమి?—మీవదిన నాచేత నీకవిత్వము చదివించనిదే నన్ను విడువనంటున్నది—ఏమి యీ దౌర్జన్యము?"

అమల్ నవ్వుచు జబాబుచెప్పెను—"మంచిదానవే వదినా!—నాకవిత్వము పట్టుకొని అన్నయ్యమీద జులూమ్ చేయబోవుచున్నావని నే నూహించగలిగినచో నే నది వ్రాయు వాడను కాను."

అమల్ తనకవిత్వమును బహు ఆదరముతో చూచుకొనుచుండెను. దానిని సాహిత్యరసవిముఖుడైన భూపతికి చారు చూపించినదని అమల్‌కు కోపమువచ్చినది. చారది కనిపెట్టి దుఃఖించి సంభాషణను వేరొకవైపునకు త్రిప్పగోరి భూపతితో నిట్లన్నది—"మీతమ్మునికి ఒకభార్యను కుదిర్చి పెండ్లిచేయకూడదా? అట్లైన అతని కవితోపద్రవము నీవు సహించియుండుట కవసరముండదు."

భూపతి—"ఇప్పటి కుర్రవాళ్లు నావలె తెలివిమాలిన వారు కారు. వారెంత గొప్పకవిత్వము చెప్పుచున్నను, ఆచరణలో పెట్టవలసివచ్చునప్పుడు అతిసుళువుగా తప్పికొను చుందురు. నీ మరిదిగారిని పెళ్లికి ఒప్పించలేకపోతివే!"

చారు అక్కడనుండి వెళ్లిపోయినతరువాత భూపతి అమల్‌తో ననెను—

"నే నీపత్రికతో రాత్రింబగళ్లు కొట్టుకొనుచుండవలెను అమల్—చారుకేమియు తోచదు, పనిపాట్లులేవు, ఉండి యుండి

నేను వ్రాసుకొనుచుండు గదిలోనికి తొంగిచూచి వెళ్లిపోవు చుండును.—ఏమిచేయవలెనో నాకు తోచకున్నది - నీవామెకు చదువు చెప్పు ఏర్పాటుచేసినయెడల చాల బాగుగనుండును అమల్. మధ్య మధ్య ఇంగ్లీషుకావ్యములలోనుండి తర్జుమా చేసి చెప్పినచో ఆమె ఆనందించును. వానివలన ఆమె కుపకారముకూడ కిలుగ గలదు. సాహిత్యవిషయములలో మంచి రుచిగలదు, చాను."

అమల్—"ఔను మంచిరుచిగలది. వదిన మరికొంచెము చదువుకొనినయెడల చక్కగా వ్రాయగలదనికూడ నానమ్మకము!"

భూపతి—"నాకు అంత ఆశలేదు, కాని చారు బంగాళీ గ్రంథముల విషయమై నాకంటె తెలివిగా వాదించగలదు."

అమల్—"మంచి ఊహాశక్తి ఉన్నది ఆమెకు—స్త్రీలలో అంతశక్తి ఎక్కడోగాని ఉండదు."

భూపతి—"స్త్రీలేమిటి, పురుషులలోకూడ అరుదే—దానికి దృష్టాంతము నేనే. వదినకు సరియైన విద్యనేర్పినచ్చిన నీకు మంచి బహుమానము ఇచ్చెదను, అమల్!"

"ఏమి ఇచ్చెదవు?"

"మీ వదిన కొక జోడీని వెదకితెచ్చి ఇచ్చెదను."

"అగువాత నామెకుకూడ చదువుచెప్పవలసియుండును—జీవితమంతా ఈనిధముగా స్త్రీలను తయారుచేయుచుండుటయే నా పని కాబోలు!"

ఈ అన్నదమ్ము లిద్దరు నేటికాలపువారు—ఎట్టిమాట లాడుటకును వారికి సంకోచము లేదు.

అమల్ పాఠకప్రపంచములో ఖ్యాతిసంపాదించి పెద్ద లేఖకుడై నాడు. ఇప్పటివరకు బడిపిల్లవానివలె ఉండెను. ఇప్పుడు సంఘములో నొక ముఖ్యుడుగా గణింపబడుచున్నాడు. సభలలో సాహిత్యవిషయములనుగురించి అప్పుడప్పుడు ఉపన్యాసము లిచ్చుచున్నాడు. పత్రికాసంపాదకులు సంపాదకులదూతలు తరుచు అతని బసకు వచ్చుచున్నారు. అతనిని విందుల కాహ్వానించుచున్నారు, తమతమ సమాజములలో అతనిని సభ్యునిగా చేరుమని, సభలకు అధ్యక్షునిగా రమ్మని విన్నపములు వచ్చుచున్నవి. ఇంటి దాసదాసీలకంట, బంధుమిత్రులకంట అతడు ఉన్నత పదవిని పొందెను.

ఇప్పటివరకు మందాకిని అతనినొక లెక్కింపదగినవానిగా చూచుచుండలేదు. చారు అమలుల హాస్యసంభాషణలను, వారి వాదనలను కుర్రవ్యవహారములని తలంచి వారిని నిరసనగా చూచి వారికి తాంబూలమిచ్చుట మొదలగు ఇంటిపనులు చేయుచుండెను. వారికంటె తానే యోగ్యురాలనియు, సంసారమునకు తానే వారికంటె ఆవశ్యకమనియు మందాకిని నమ్ముచుండెను.

అమల్ తమలపాకులబీడాలు అపరిమితముగ తినువాడు. బీడాలుకట్టి సిద్ధముగనుంచుభారను మందాకినిది. వానిని ఎడతెరిపిలేక తినుచుండుటచూచి మంద చీకాకు పడు

చుండెను. చారు, అమల్—వీరిద్దరును కుట్రపన్ని మందాకిని కట్టియుంచిన బీడాలు లూటీచేయుచుండుట వారి ఆటలలో ముఖ్యమైనది. ఆ పోకేలా లిద్దరునుచేయు దొంగతనము మందాకినికి మాత్రమామోదకరముగా నుండునదికాదు.

దాని నిజమైన కారణమేమన, ఆశ్రితులలో ఒకనిని చూచి ఒకడు సహించలేడు. అమల్ ఉండుటచే మందాకిని చేయవలసిన ఇంటిపని కొంచెము పెరుగుచుండెను. ఆ పెరిగినది ఎంతస్వల్పమైనను మందాకినికి అది అవమానకరముగ తోచు చుండెను. చారు అమల్‌యెడల పక్షపాతముకలది యని ఎరిగి మంద నోరువిప్పి ఏమియు ననలేకయుండెను. కాని అవకాశము చిక్కినచో ఎగతాళిచేయుటకు సదా సిద్ధముగానుండెను. రహస్యముగ ఇంటినౌకర్ల ఎదుట అమలుని నిందించుచు మాట్లాడుచుండును. నౌకర్లుకూడ ఆమెతో కలియుచుందురు.

అమల్ క్రమక్రమముగ ఉన్నతిపొందుచుండుట చూచి మంద కాశ్చర్యము కల్గినది—పూర్వపు అమలుడు కాడిప్పుడు. మునుపటిసంకోచము ఇప్పుడతనిలో కానరాలేదు. మునుపటి నమ్రతలేదు. ఇతరుల నవమానపరచు అధికార మతని కిప్పుడు దొరకినది. లోకములో ప్రతిష్ఠపొంది, నిర్భయముగా తనను గురించి తాను ప్రచారణచేసికొనగల అధికారము సంపాదించ గల సమర్థుడు తప్పక స్త్రీలదృష్టి నాకర్షించగలడు. అందరును అమలునియెడల భక్తికలిగియుండుట చూచి మందాకినికూడ అమలుని ఉచ్ఛశిరస్సునువైపు తలయెత్తి చూచినది. అమలుని

కోమలముఖమున నవగౌరవదీప్తి చూచి మందాకిని ముగ్ధురాలైనది—అమలు డామెకంటికి క్రొత్తగా కనబడెను.

ఇప్పుడు తాంబూలము దొంగలించుట కిదసరమువీలు పోయినది. అమల్ ఖ్యాతిపొందుటవలన చాటుగ నష్టము కలిగినది. బీడాలుచోరీకై వారు చేయుచుండు కుట్ర వారిరువురిలో ఒక స్నేహబంధము నేర్పరచియుండెను, ఇప్పు డా ముడి విడిపోయినది; బీడాలిప్పుడు తమంతటతామే అమల్ గదిలోనికి వచ్చుచుండెను.

వారిద్దరును నిర్మించుకొన్న సభలోనికి మందాకిని రాకుండునట్లు వారు పన్నుచుండు యుక్తులు బహు వినోదకరముగ నుండెను. ఆ వినోద మిక నుండదని చారుకు తోచినది మందను ఎడముగానుంచుట కిప్పుడు సాధ్యముకాదు. చారొకతెయే ఆమలుని మిత్రురాలనిగాని, ఆమె ఒకతెయే అతనిని బోధపరచుకొనగలదనిగాని ఇప్పుడు మందాకిని ఒప్పుకొనదు ఇప్పటివరకు తాను కనపరచిన అశ్రద్ధను మందాకిని అసలు వడ్డీలతో చెల్లించ నిశ్చయించుకొన్నది. అమలుడును చారును ఒక్కచోట కనబడగానే మంద ఏదో నెపముపైని మధ్యకువచ్చి తనచాయచే గ్రహణము కల్గించుచుండెను. మందాకినిలో కల్గిన ఈ మార్పునుగూర్చి చారు మందలేని సమయముచూచి, అవలునియొద్దకువచ్చి, పరిహాసముచేయకోరుచుండెను. కాని దానికైన వీలుదొరకునది కాదు.

పిలవనిదే మందాకిని ఇట్లు మాటిమాటికి వచ్చు చుండుట చూచి చాపకు కలిగినంత చీకాకు అమలునకు కలుగ లేదని చెప్పుట అనవసరము. విముఖముగానుండిన మందమనస్సు ఇప్పుడు తనవైపు తిరిగినదని కనిపెట్టి అమలుడు లోలోపల సంతోషించెను.

చాపు, మందాకినిని దూరమునుండిచూచి కోపముతో, "అదిగో పరుల వచ్చుచున్న"దని మెల్లగా అనుచుండును. అది విని అమల్‌కూడ—"అదిగో చంపుకు తినుచున్నదే!" అని యనుచుండును. ప్రపంచములో ఇంకే యిద్దరుకలసియుండుట చూచినను ఇష్టపడకుండుట వీరిద్దరికిని అభ్యాసమైపోయినది. ఆ అభ్యాసమును అమల్ హఠాత్తుగ నిప్పుడెట్లు వదలుకొనగలడు! అటుపైన మందాకిని వారిసమీపమునకు వచ్చినతరువాత ఇష్టములేకున్నను మర్యాద కామెతో మాటలాడుచున్నట్టు నటించి, "ఏమి సమాచారము వదినా, నీ కొంబూలము డబ్బా మీద నేడు బందిపోటు లక్షణములేవైన కనపడినవా?" అని అడుగుచుండును.

మందాకిని—"కోరినంతమాత్రన దొరకుచున్నప్పుడు దొంగతన మవసరమేమి?"

అమల్—"అడిగి సంపాదించుటకంటె దానివల్ల సుఖ మధికము."

మంద—"మీరు చదువుచుండినది ఆపివేసితిరేల— చదువండి, నాకు కూడ వినవలెనని యున్నది."

విద్యనభ్యసించుచున్నదను కీర్తిసంపాదించుటకు నే వరకు మందాకిని ఎన్నడును ప్రయత్నించలేదు. అయిననే "కాలోహి బలవత్తరః" కదా!

అరసికురాలైన మందాకినిఎదుట అమల్ తన కవిత మును చదువకూడదని చారు కోరిక. చదివి వినిపించవలెన అమల్ కోరిక.

చారు—"అమల్ 'కమలకాంతుని కార్యాలయము' గురించి విమర్శవ్రాసి చదువుచున్నాడు—నీకది వినవలెన యున్నదా?"

మంద—"నేను మూర్ఖురాలనే కాని కొంచెమై బోధపరచుకోనలేనా?"

వెనుక నొకనాటిమాట అమల్‌కి జ్ఞప్తివచ్చినది. చా మందతోకలసి ఒకనాడు గర్వాలాట ఆడుచుండెను. అమల్ త కవిత్వము చేతపుచ్చుకొని ఆ ఆట సభలోప్రవేశించి, తన పద ములను వినిపింపవలెనని మిక్కిలి ఆత్రత పడెను, కాని వా రా ఆపకుండుటచూచి విసుగుకొనుచు అమల్, "మీ రాడ కొనుచూ ఉండండి వదినా, నేను అఖిల్ బాబుకు నా కవిత్వమ వినిపించివచ్చెద"నని అన్నాడు.

చారు అమల్ కండువాకొన గట్టిగా పట్టుకొని, "ఛా ఎక్కడికి వెళ్లేదవు కూర్చొను"మని యనుచు తొందర తొందరగా తాను వీగి ఆట ముగించినది.

"మీ చదువు ప్రారంభమువును కాబోలు, నేనిక పోయెద"నని మందాకిని యన్నది.

"నీవుకూడ వినుచెల్లీ," అని మర్యాదకన్నది చారు.

"మీ శుష్క సాహిత్యము నాకేమీ బోధపడదు తల్లీ—వినుటకు కూర్చున్నయెడల నాకు నిద్రవచ్చు" నని యనుచు, ఆటకు మధ్యను భంగముకలిగినదని చీకాకుపడి లేచి పోయినది.

ఆ మందాకినికే నేడు కమలాకాంతుని విషయమై విమర్శ వినవలెనని కుతూహలముకలిగినది—ఇదిచూచి అమల్, "మంచిమాట చిన్నవదినా, నీవు వినుట నా సౌభాగ్యమే," అని యనుచు పుటలు వెనుకకు తిరుగవేసి వ్యాసము మొదటినుండి చదువుట ప్రారంభించెను. వ్యాస ప్రారంభము రసవత్తరమైన భాగము—అది వదలి వినిపించుటకు అమల్‌కు ఇష్టము లేక పోయినది.

చారు అమల్‌ను చదువనీయక, "అమల్, జాహ్నవీ లైబ్రరీనుండి నాకు ప్రాత మాసపత్రికలు తెచ్చియిచ్చెదనని అంటివే!" అని యన్నది.

అమల్—"నేడుకాదే!"

చారు "నేడే—మంచివాడవు! మరచిపోతివేమో!"

అమల్—"నేను మరువలేదు—నీవే—"

చారు—"సరే పోనీ—మీరు చదువుకొనుచుండండి, నేను పరేశుని పంపి తెప్పించుకొనెదను." ఇట్లనుచు చారు లేచిపోయినది.

ఆపద వచ్చిపడ్డదని అమల్ పోల్చుకొనెను. మంద అంతయు స్పష్టమైనది—చారుపై నామెకు ద్వేషము కలిగిన చారు వెళ్లిపోయినతరువాత అమల్ ఏమిచేయవలెనో నిశ్చయించుకొనలేక తడబడుచుండుట చూచి కొంచెము నవ్వి ఆమె ఇట్లన్నది—"వెళ్లు బావా, అక్క అలకతీర్చు, ఆమె కోపము వచ్చినది—నాకు వినిపించుచు కూర్చున్న చిచిక్కులో పడవలసి వచ్చును."

అటుపైని లేచిపోవుట అమల్‌కు మిక్కిలి కష్టమైనట్లు అతనికి చారుపై కోపముపచ్చి, "ఏమి, చిక్కెందుకు?" అని యనుచు వ్యాసమును చదువుట ప్రారంభించెను.

మంద రెండుచేతులతో ఆ వ్యాసమును మూసి "అవసరములేదు బావా, చదువవద్దు," అన్నది.

అని కన్నీళ్లు రాపుకొనుచు బయటికి వెళ్లిపోయెను.

చారు మిత్రులయింటికి విందుకు వెళ్లినది. గదిలో కూర్చొని మంద జడత్రాడు వేసుచున్నది. 'వదినా' అని పిలచుచు అమల్ గదిలోకి ప్రవేశించెను. చారువిందుమాట అమల్ ఎరుగక పోలేదని మందాకినికి తెలుసును. "ఎవరి చూచుటకు వచ్చితివి, ఎవరు ప్రాప్తించిరి, అమల్ బాబూ! నేడు నీ అదృష్టము బాగులేదు!" అని మంద అన్నది. "కుడిచేవైపుననున్న గడ్డి ఎంతో ఎడమవైపుననున్న గడ్డికూడ అంతే—గాడిదకు దీనియెడల ఎట్టి అనురాగమో దా

యెడలకూడ అట్టి అనురాగమే!" అని జవాబుచెప్పి అమల్ అచ్చటనే కూర్చుండి పోయెను.

అమల్—"మీ డైరీ కబుర్లు చెప్పవదినా, వినవలెనని యున్నది."

రచన కుపయోగకరముగానుండునని అమల్ అందరి సంగతులు తెలిసికొనుటకు కుతూహల పడుచుండెను. కనుక పూర్వమువలె నుపేక్షించక మందతో నిప్పుడు తరచు సంభాషించుచు ఆమె పూర్వవృత్తాంతమునుగురించి ప్రశ్నించుచుండెను. ఆమె గ్రామమెక్కడో, అది యెట్టి స్థలమో, బాల్యకాల మెట్లు గడపినదో, వివాహ మెప్పుడు జరిగినదో—ఆ విషయములన్నియు అడుగుచుండెను. మందాకినియొక్క అతి సామాన్యజీవితవృత్తాంతము తెలిసికొనుటకు ఇంతకుపూర్వ మెవ్వరును ఇంత కుతూహలము కనపరచలేదు. మంద ఆ ప్రశ్నలకు సవిస్తరముగ జవాబు చెప్పుచుండెను—కాని మధ్యమధ్య తన మాటలకు తానే సిగ్గుపడి, "నేను ఇంత ప్రేల కూడ"దని అనుచుండెను.

"వినుటకు నాకు సరదాగానున్న"దని అమల్ ఆమెను ప్రోత్సహించుచుండెను. మందతండ్రిగారి గుమస్తా తన రెండో భార్యతో తరచు పోట్లాడి భోజనముచేయనని ఒట్టుపెట్టుకొని పనికి వచ్చుచుండెనట. ఆకలిబాధ సహించలేక తమ ఇంటికి భోజనమునకు వచ్చుచుండెనట. ఒకనా డీ విధముగా మందాకినిగారి ఇంట భోజనముచేయుచుండగా భార్యకంట పడి

పోయెనట—మంచ ఆ కథ చెప్పుచుండెను, విని అమల్ పక పక నవ్వుచుండెను—ఆసమయములో చారు గదిలో ప్రవేశించినది.

చారు రాగానే కథనిలిచిపోయినది. అతి ఉత్సాహముతో జరుచున్న సభకు భంగముకలిగినదని చారుకు స్పష్టమైనది.

అమల్—"వదినా, త్వరగా తిరిగి వచ్చితివే!"

చారు—"అదియే పోల్చుకొంటిని—చాలా త్వరగా వచ్చినా"నని అనుచు తిరిగి బయటికి పోబోయినది.

అమల్—"మంచి పని చేసితివి, ఎంతకును రాకుంటివని విసుగుకొనుచుంటిని! నీకు వినిపించవలెనని మన్మథదత్తు కొత్తగా రచించిన 'సంధ్యా విహంగము' తీసుకొని వచ్చితిని."

చారు—"ఇప్పుడు వద్దు—నాకు పని యున్నది."

అమల్—"ఆజ్ఞ ఇమ్ము, నీపని నేను చేసెదను."

అమల్ పుస్తకము కొని చదివి వినిపించుటకు నేటి సాయంకాలము వచ్చునని చారు ఎరుగును. అమల్‌లో ఈర్ష్యపుట్టించుటకు దానిని పొగడవలెనని చారు నిశ్చయించుకొన్నది. అమల్ దానిని మరింత వికృతముగా చదివి ఎగతాళిచేయుచుండును—చారు దీని నూహించుకొని, విందుఇంట చేరియున్న వారందరు ఎంతబ్రతిమాలుచున్నను, ఒంట్లో బాగు లేదని వంకపెట్టి త్వరగా ఇంటికి వచ్చినది—అక్కడనే

యుండిన బాగుండును, వచ్చుట పొరపాటైనది, అని యను కొనుచు ఇప్పుడు విచారింపసాగినది.

మంద సిగ్గుమాలినతనమునకు మాత్రము మితియున్నదా! అమల్‌తో గదిలో ఒంటరిగా కూర్చొని పళ్లు ఇగిలించు కొని నవ్వుచున్నది. ఎవరైన చూచిన నేమందురు? కాని మందాకినిని తానిప్పుడెట్లు చీవాట్లు పెట్టగలదు? నీవు మాత్ర మట్లేల చేయుచుంటివి అని మంద ప్రశ్నింపవచ్చును! కాని మందసంగతి వేరు, తనసంగతి వేరు. తాను అమల్‌కు కవిత్వరచన కుత్సాహము నిచ్చుచుండును. అతనితో సాహిత్యచర్చ చేయు చుండును. మందకట్టి ఉద్దేశ మెన్నడును లేదు. అమాయకు డైన అమల్‌ను ముగ్ధుని చేసి వలలో వేసికొన ప్రయత్నించు చున్నది.—సందేహము లేదు. ఈ భయంకర విపత్తునుండి అమ లుని రక్షించుట తన కర్తవ్యమని చారు స్థిరపరచుకొన్నది. కాని ఆ మాయలాడి చేతులనుండి అతనిని తప్పించుట ఎట్లు—అతనికి బోధపరచి ఆ యాకర్షణనుండి దూరముచేయ యత్నించినయెడల లాభమునకుమారు నష్టము కలుగవచ్చుచు.

పాపము. తనభర్త వార్తాపత్రిక పనితో అన్నయ్య రాత్రింబగ ళ్లుచచ్చుచున్నాడు. ఇవతల మంద ఇంటిమూలను కూర్చొని ఆమలుని మాయపాశములోనికి లాగవలెనని చూచు చున్నది. అన్నయ్య ఎట్టి అనుమానమునులేక హాయిగా ఉన్నాడు. మందాకినియైని అనయ్యకు అగాధ విశ్వాసము. కాని

అంతయు తనకళ్లతో సాక్షాత్తు చూచుచున్న చారు ఈ అన్యాయమునకోర్చి ఎట్లూరక యుండగలదు!

కాని అమల్ మొట్టమొదట బుద్ధిమంతుడే. కవియని పేరుపడిననాటినుండి అనర్థము ప్రారంభమైనది. అతని కవిత్వమునకు కారణము చారే. ఏదోఒక అశుభముహూర్తమున అతనిని వ్రాయుటకు పురికొల్పినది. పూర్వమువలె అమల్ పై నిప్పుడామె యధికారము సాగునా? పదిమందిచేయు ఆదరము యొక్క రుచి ఇప్పు డతనికి తెలిసినది—ఆదరించువారిలో నొకతె తగ్గినను అతనికి లక్ష్యముండదు.

అమల్ తనచేతులలోనుండి తప్పించుకొని పదిమందిచేతులలో పడిపోయెనని చారుకు స్పష్టమైనది. ఇప్పుడు నచ్చిన ఆపద అదియే. చారు తనతో సమానురాలని అమల్ ఇప్పుడను కొనుటలేదు. అతడామెను దాటి చాలమందికి వెళ్లిపోయెను. అత డిప్పుడు లేఖకుడు, చారు పాఠకురాలు. దీనికి ప్రతీకార ముగ నేదైన చేయవలెను.

ఆహా! అమల్ సభ్యుడు! మంద మాయలమారి. అన్నయ్య అభాగ్యుడు!.

శ్రావణమాసము. ఆకాశము మేఘాక్రాంతమై యున్నది. గది చీకటిగా ఉండుటచేత చారు కిటికీతెరచి కూర్చొని ముందుకు వాలి ఏమో అతిశ్రద్ధగా వ్రాయుచున్నది.

అమల్ చప్పుడుచేయక వచ్చి వెనుకను నిలబడియుండుట చారెరుగదు. చక్కని మేఘఘ వెలుతురిలో చారు వాసుకొని

పోవుచుండెను. అమల్ వెనుకనుండి చదువుచుండెను. అమల్ రచించినవి రెండుమూడు వ్యాసములు ప్రక్కనుపడి ఉన్నవి. ఇవియే చారురచన కాదర్శములు.

"వినను రచన చేతకాదనుచున్నా!" హఠాత్తుగా అమలుని కంఠము వినబడగానే చారు ఉలికిపడి తొందరతొందరగా తననోటుబుక్కును చేతులతోమూసి, "తప్పుకాదా!" అన్నది.

అమల్—"ఏమిటి నేనుచేసిన తప్పు?"

చారు—"దొంగతనముగా చూచుచుంటి వేల?"

అమల్—"మరియొకవిధముగా చూచుటకు వీలుచిక్కకున్నది కనుక."

చారు బుక్కును చింపబోయినది. అమల్ చప్పున దానిని చారుచేతిలోనుండి లాగుకొనెను. "నీవు దానిని చదివినయెడల శాశ్వతకాలము నీకు నాకు మాటలుండ" వన్న దిచారు.

అమల్—"చదువనీయనియెడల శాశ్వతకాలము నీకు నాకు మాటలుండవు."

చారు—"నీ పుణ్యముండును బావా మంచివాడవు—చదువకుము."

చివరకు అమల్ మాటే నెగ్గినది. తన కవిత్వమును అమల్‌కు చూపించవలెనని చారు ప్రాణములు కొట్టుకొనిపోవుచుండెను; కాని చూపించువేళకు తనకు అంత సిగ్గువేయునని ఆమె అనుకొనలేదు. ఎంతో బ్రతిమాలి చారుచేత ఒప్పించి

చివరకు అమల్ దానిని చదువ నారంభించునప్పటికి భయము చే ఆమె కాళ్లు చేతులు చల్లపడిపోయినవి. తాంబూలము తీసికొని వచ్చెదనని నెపము పెట్టి ఆమె ప్రక్కగదిలోనికి వెళ్లిపోయినది.

అమల్ అది చదివి చారుదగ్గరకు వచ్చి, "బహుచక్కగా ఉన్నది వదినా!" అన్నాడు.

బీడాలో కాచువేయుట మరచి, "వేళాకోళము చేయ నక్కరలేదు. నాపుస్తకము నాకిమ్మని చారుఅన్నది.

అమల్—"బుక్కు ఇప్పుడీయను, నీవు వ్రాసినది మంచి కాగితము మీద వ్రాసి పత్రికకు పంపెదను."

చారు—"ఆహా! పంపెదవు! సందేహమా?—నా పుస్తకము నాకిమ్ము."

చారు చాలా గొడవచేసినది. అమల్ కూడ పట్టినపట్టు వదలలేదు. అది ప్రచురణయోగ్యమైన దని అతడు చాలసార్లు నొక్కి నొక్కిచెప్పిన తరువాత తాళలేక చారు జవాబుచెప్పినది—"నీతో నెగ్గుట అసాధ్యమైనపని; పట్టినపట్టు వదలవు."

అమల్—"అన్నయ్య కొకమారు చూపించవలెను."

ఆమాట విని సరుదుచున్న తమలపాకుల నక్కడ వదిలిపెట్టి తొందరతొందరగా లేచి అమల్ చేతిలోనుండి నోటుబుక్కు లాగుకొనబోవుచు, "అతనికి ఎంతమాత్రము చూపించకూడదు. అతనికి నా కవిత్వమునుగురించి చెప్పినయెడల నేనిక ఒక పంక్తి యైనను వ్రాయను," అని యన్నది.

అమల్—"నీవు గొప్పపోరపాటు పడుచున్నావు వదినా, అన్నయ్య బయటికి ఏమన్నను నీకచన చూచినయెడల మిక్కిలి ఆనందించును."

చారు–"నాఆనందము మాట ఆలోచించ నక్కరలేదా!"

తాను వ్రాసి అమల్‌కు ఆశ్చర్యము కలిగించవలెనని చారు ప్రతిజ్ఞ చేసి కొన్నది. తనకు మందకు చాలభేదమున్నదని ప్రమాణము చూపించనిదే వదలనని నిశ్చయించు కొన్నది. కొన్నాళ్లు అనేకముగా వ్రాసి చించివేసినది. వ్రాసినది చాల వరకు అమల్ వ్రాతమాదిరినే యుండెను. దానిని దగ్గర పెట్టుకొని చూచునప్పటికి కొన్నికొన్ని చోట్ల పూర్తిగా అమల్ వ్రాసిన దానిలోనుండి ఎత్తివ్రాసినదే అని స్పష్టమైనది. అవియే బాగున్న భాగములు, మిగిలినవి కేవలము పటుత్వము లేనివి. అది చూచిన యెడల అమల్ తప్పక నవ్వునని నమ్మి చారు ఆకాగితములను చిన్న చిన్న ముక్కలుగా చించి చెరువులో పారవేసి వచ్చినది. ఒక్క ముక్కయైన అతనిచేతిలో పడకూడదని ఆమె కోరిక.

మొట్టమొదట "శ్రావణమేఘము" అను వ్యాస మొకటి వ్రాసినది. అది ఒకభావాశ్రుజలభరితమైన క్రొత్తకవిత్వమని అనుకొన్నది. కాని అమల్ రచించిన 'ఆషాఢ చంద్రుడు' అను దానిని మార్చి వ్రాసినదానివలె కనబడుచున్నదని ఆమెకు హఠాత్తుగ తట్టినది. కాగితమున కొకవైపున వ్రాసినది, అతని కవిత్వము ఇది ఆ కాగితమునకే వెనుకప్రక్కను వ్రాసినది. అంతే వీని లోని భేదము. "చంద్రుడా, మిత్రమా, దొంగవలె మేఘముల

వెనుక పరుగెత్తుచున్నావేల?" అని అమల్ వ్రాసియుండెను; చారు వ్రాసినది—"సఖీ, కాదంబినీ, నీ నీలిచీరచెంగుక్రింద చంద్రుని దొంగతనముగ నుంచుకొని ఎక్కడికి పారిపోవుచున్నావు?—"

ఎంత ప్రయత్నించినను అమల్ భావములను తప్పించుకొని పోలేక చారు చివరకు రచనా విషయమే పూర్తిగా మార్చివేసినది. చంద్రుడు, మేఘము, చకోరము, సంపంగిపువ్వు వీని నన్నిటిని విడిచిపెట్టి "కాళీ మండపము" అను ఒక కవిత్వము వ్రాసినది. తమగ్రామములో చెట్లనీడనున్న చెరువుగట్టుమీద కాళీమందిరమొకటి యుండెను. దానితో సంబంధించిన చిన్ననాటి భయము, ఔత్సుక్యము, జ్ఞాపకమున్న బాల్యకాలపు ఊహలు, సదామెలకువ కలిగియున్న ఆకాళినిగురించి ఆ గ్రామస్థులకు గల వింతవింత నమ్మకములు—వీని యన్నిటితో ఒక కథనల్లినది. కథాప్రారంభము కావ్యాడంబరముతోనిండి అమలుని రచన మాదిరి యుండెను, కాని రానురాను గ్రామస్థులు భాషపలె సరళమయినది.

అమల్ చదివెను. మొదటిభాగము సరసముగనున్న, దనియు కవిత్వ ఘటుత్వము చివరవరకు నిలువలేదనియు ఆతనికి తోచినది. ఎట్లైనను ప్రప్రథమమున ఇటువంటిది వ్రాయగలుగుట ప్రశంసనీయమని అతని యభిప్రాయము.

"మనము మాసపత్రిక ఒకటి ప్రచురించవలెనని నాకోరిక బావా, నీ అభిప్రాయమేమి?" అని చారు అన్నది.

అమల్—"చాలా డబ్బులేనిదే సాగించలేము."

చారు—"ఆ పత్రికకు డబ్బవసరము లేదు. దానిని ఆచ్ఛాత్తించము, చేతితోనే వ్రాయుదము. దానిలో నీవు నేను వ్రాసినవి తప్ప మరి ఎవ్వరి రచనలు ఉండవు. ఇతరులు చదువ్వటకు కాదు, రెండు ప్రతులు మాత్రమే వ్రాయుదము, నీ కొరకొకటి నాకొరకొకటి."

కొన్నాళ్ల క్రిందట చారు ఇట్టి ప్రస్తావముచేసి యుండిన యెడల అమల్ సంతోషముతో గంతులువేసి యుండును. రహస్య రచనవలన అతనికి ఇప్పుడు తృప్తికలుగదు. తాను వ్రాయునది అందరు చదువవలెననియే అతనికోరిక. ఐనను తనలో మార్పులేదనునట్లు నటించుచు ఉత్సాహముతో ఒప్పుకొనెను.

చారు—"కాని నీవు వ్రాయునది మన పత్రికకు తప్ప మరియే పత్రికలోను ప్రచురించనని మాట ఈయవలెను."

అమల్—"అట్లైన పత్రికా సంపాదకులు నాప్రాణములు తీసి వేయుదురు."

చారు—"నాచేతిలో చంపు అస్త్రములు లేవ్వు కాబోలు!"

చివర కీవిధముగ స్థిరపరచబడినది: పత్రికాసంపాదకులిద్దరు, లేఖకులిద్దరు, పాఠకులిద్దరు కలసి కమిటీగా ఏర్పడిరి.

"మన పత్రికకు 'చారుపాఠ' మను పేరు పెట్టెద" మని

అమల్ అన్నాడు, "వద్దు, 'అమలా' అనుపేరు మంచి"దని చారు ఆన్నది.

ఈ యేర్పాటు జరిగినప్పటినుండి ఈనడుమ తన మనస్సునను నుండిన దుఃఖము చారు మరచినది. తమ మాసపత్రికలో మందాకిని దూరుటకు దారిలేదు; బయటివారు దూరు ద్వారముకూడ మూయబడినది.

ఒకనాడు భూపతి లోపలికివచ్చి, "చారూ, నీవు లేఖకు రాలవౌదువని ఎవ్వరును అనుకొనలేదే!" అని యనెను.

చారు ఉలికిపడి, ముఖమెర్రచేసికొని, "నేను లేఖకు రాలనా! నే నెట్లుకాగలను, వట్టిమాట!" అని జబాబు చెప్పినది.

భూపతి—"చోరిమాల్‌తో పట్టుపడిపోతివి! దానికి రుజువు ఇదిగో!" అట్లనుచు కట్టెడు, 'సరోరుహా' మాస పత్రికలను చూపించెను. తాము ఇన్నాళ్లనుండి తమచే వ్రాత మాసపత్రికలో ప్రచురించి తమ గుప్తసంపత్తిగా ఉంచుకొనిన వ్యాసములన్నియు లేఖకాలేఖకుల పేర్లతోకూడ సరోరుహాలో వెలువడినవి.

ఎవరో పంజరముయొక్క తలుపు విప్పి, తా నెంతో ముద్దుగా పెంచుచున్న పక్షిని విడిచిపెట్టినట్లు చారుకు బాధ కలిగినది. భూపతికి దొరకిపోతినను సిగ్గుమరచిపోయినది. విశ్వాసఘాతకుడైన అమల్‌పైని ఆమె కమితకోపము వచ్చినది.

"తరువాత, ఇది చూచితివా?" అని యనుచు భూపతి 'విశ్వబంధు' అను వార్తాపత్రికను చారు కళ్లెదుటఁ బట్టుకొనెను. దానిలో 'ఆధునిక లేఖకుల ధోరణి' అను వ్యాసమొకటి వెలువడినది.

"దానితో నాకేమి సంబంధ" మనుచు చారు దానిని చేతితో త్రోసివేసినది. అమల్‌పై కోపముకొలది మరిచేనిపైకి ఆమె మనస్సుపోలేదు. "ఒక్కమారు చదివిచూడు" మని తిరిగి భూపతి బలవంతపరచెను.

చదువక వీలులేకపోయి, చారు తొందర తొందరగా పుటలు తిరగవేసినది. అది భావాడంబరముతో నిండియున్న కొన్ని ఆధునిక రచనలను ఖండించుచు ఘాటుగా వ్రాసిన వ్యాసము. విమర్శకుడు దానిలో మన్మథదత్తు అమలుల రచనా పద్ధతిని తీవ్రముగా ఖండించి, వీనితో ఒక నూతన రచయితయైన చారుబాల భాషయొక్క అకృత్రిమ సరళతను, సునాయాసముగ రసము నొలుకు ఆమె శక్తిని, ఆమె వర్ణనా నైపుణ్యమును పొగడెను. ఇట్టి రచ ననుకరణచేయుట వలన మాత్రమే అమల్‌కంపెనీవారికి విశ్వరము కలుగును, లేసిచో కంపెనీ తప్పక మునిగిపోవునని కూడా వ్యాసలేఖరి వ్రాసెను.

భూపతి నవ్వుచు, †"దీనికే గురువును చంపువిద్య అందు" రని అన్నాఁడు.

---

† బంగాళీ సామెత.

తన రచననుగురించి విమర్శకుని స్తోత్రము జ్ఞాపకమువచ్చి నప్పుడెల్ల చారుకు ఆనందము కలుగుచుండెను. కాని ఆ ఉత్తర క్షణమే బాధకలుగుచుండెను—ఆనందము పొందవలెనను కోరిక ఆమె కున్నట్లులేదు. స్తోత్రసుధాపాత్ర పెదవులవరకు వచ్చినను ఆమె దానిని త్రోసివేయసాగినది.

అమల్ ఆమె రచనలు పత్రికలలోవేయించి హఠాత్తుగ నామె కాశ్చర్యముకలిగింప సంకల్పించుకొనెనని చారుకు తోచి నది. కాని అవి అచ్చుపడిన తరువాత ఆమె రచనను విమర్శించుచువ్రాసిన ప్రశంస ఏదైన వెలువడినయెడల, ఆ రెంటినికలిపి ఆమెకు చూపించి, ఆమెలో పుట్టుఖోపమును శాంతపరచ అతడు నిశ్చయించి యుండవచ్చును. కాని ప్రశంసావ్యాసము వెలు వడిన పిమ్మట ఆమెకు చూపించుటకు రాలేదేమో? ఆ విమర్శ అమల్ మనసుకు బాధకలిగించుటచే, ఆమెకు చూపక దాచి యుండును. హాయిగా జీవించగోరి చారు ఒక చిన్న సాహిత్య కుటీరమును నిర్మించుకొన్నది. దానిపై ప్రశంస శిలావృష్టి కురిసినది. పెద్దశిల ఒకటి తగిలి కుటీరము కూలిపోయినది—చారు మనసుకు సుఖము లేకపోయినది.

భూపతి వెళ్లిపోయిన తరువాత చారు పడకగది మంచముపైని నిశ్చలముగా కూర్చొనియుండెను—ఎదుట సరోరుహా సంచికలు, 'విశ్వబంధు' విప్పిపడియున్నవి.

పుస్తకము చేతపట్టుకొని చారు కాశ్చర్యము కలిగించ గోరి అమల్ నిశ్శబ్దముగ వెనుకనుండి గదిలో ప్రవేశించెను.

విశ్వాబంధులోని విమర్శ ఎదుట తెరచియున్నది, చారు దేదో ఆలోచించుచు కూర్చొనియున్నది. అమల్ అది చూచి చప్పుడుచేయక తిరిగి బయటికి వెళ్లిపోయెను. "విమర్శకుడు నన్ను తిట్టెనని చారు ఆనందములో మునిగి స్వప్నమును మరచిన," దని అమల్ అనుకొనెను—ఆమెపై అతనికి ద్వేషము కలిగినది. ఒక మూర్ఖవిమర్శకుని స్తోత్రము చదివి చారు తన గురువుగారికంటె గొప్పదాననుకొనుచున్నదని అమల్ నిశ్చయించెను—చారుపై అమితకోపము వచ్చినది—చారాపత్రికను చిన్నచిన్న ముక్కలుగాచించి మంటలోవేసి బూడిదచేయవలసియుండెను.

చారుపై కోపగించి, అమల్ మందాకిని గది ద్వారము దగ్గరకు వచ్చి, బిగ్గరగా ఆమెను పిలిచెను.

మంద—"రా అన్నయ్యా, రా, పిలవకుండానే కనపడితివి నేడేమి భాగ్యము నాది!"

అమల్—"నేను క్రొత్తగా వ్రాసినవి ఒకటి రెండున్నవి వినెదవా?"

మంద—"ఎన్నాళ్లనుండియో వినిపించెదనని ఆశపెట్టుటయే కాని వినిపించుటలేదు. ఎందుకు అన్నయ్యా వద్దు, ఎవరికి ఎప్పుడు కోపమువచ్చునో తెలియదు—చివరకు నీవు చిక్కులో పడవలసి వచ్చును—నాకేమియు కాదు!"

అమల్ కొంచెము తీవ్రముగా జవాబుచెప్పెను—"కోపముచేయువా రెవరు? ఎందు కా కోపముచేయుట? సరే, అది చూదము—నీకు వినవలెనని ఉన్నదా—ఆమాట చెప్పు!"

మంద వినుటకు శ్రద్ధతో కూర్చున్నది. అమల్ ఆడంబరముగా రాగమతీయుచు చదువుట ప్రారంభించెను.

అమల్ వ్రాత మందాకినికి విదేశీ వ్రాతవలె తోచుచుండెను. ఆమెకు దానిలో ఎక్కడను దరికానరాలేదు—కనుక మరీ శ్రద్ధతో వినుచున్నట్లు నటించి కూర్చున్నది. రానురాను ఉత్సాహముకొలది అమల్ మరీ కంఠమెత్తి చదువుచుండెను.

వ్యాసములో అప్పుడు చదువుచున్న భాగము—'అభిమన్యుడు తల్లి గర్భములోనున్నప్పుడు వ్యూహములో ప్రవేశించుట మాత్రమే నేర్చుకొనెను, బయటికి వచ్చుట నేర్చుకొనలేదు. నదీస్రోతస్సు పర్వతముయొక్క పాషాణ జఠరములో నున్నప్పుడు ఎడుటకు ప్రవహించుట మాత్రమే నేర్చుకొనుచున్నది, వెనుకకు తిరుగుట నేర్చుకొనదు. ఆహా! ఓ నదీ ప్రవాహమా, ఓ యౌవనమా, ఓ కాలమా, ఓ సంసారమా—మీరు ముందుకు మాత్రమే నడవగలరు. సువర్ణకాంతితో నిండియున్న పూర్వస్మృతులుండు తావులకు మీరు తిరిగి పోలేరే! అనంతజగత్తులో నుండునదేదియు వెనుకకు తిరిగి చూడలేదు, మానవుని మనస్సొక్కటే వెనుకకు తిరిగి చూడగలదు—'

సరిగా ఆసమయములో మంద గదిద్వారము దగ్గర నీడ పడినది—మంద ఆనీడ చూచినది. కాని చూడనట్లు నటించి ఏకాగ్రచిత్తముతో అమల్ చదువుచున్న దానిని వినుచున్నట్లు రెప్పవేయక అతని ముఖము వైపు చూచుచుండెను.

నీడ తత్‌క్షణమే జరిగి పోయినది.

వచ్చినతోడనే అమల్ విశ్వబంధును చూచి దానిని ఘాటుగానిందుంచునని చారు ఊహించినది; అమల్ ప్రతిజ్ఞా భంగముచేసి తమ రచనలను పత్రికలకు పంపినందుకు తాను అమలునకు బాగా చీవాట్లు పెట్టవలెనని నిశ్చయించుకొని అమల్ రాకకెదురు చూచుచుండెను.

అమల్ వచ్చువేళదాటినది కాని నేడతడు రాలేదు. చారొక వ్యాసమువ్రాసి యుంచినది, అమల్ రాగానే చదివివిని పించవలె ననుకొన్నది—అదికూడ అక్కడనే పడియున్నది.

అప్పుడెక్కడనుండియో అమలుని కంఠము వినబడినట్లు చారుకు తోచినది. ఆమాటలు నుందాకిని గదిలోనుండి వచ్చు చున్నట్లు తట్టి శరవిద్ధమైనట్లు హఠాత్తుగ లేచి చప్పుడుచేయక ద్వారము దగ్గరకు వచ్చినిలిచినది. అమల్ మందాకినికి వినిపించు చుండిన వ్యాసము చారు వినియుండలేదు—"అనంత జగత్తులో ఏదియు తిరిగి చూడలేదు, మానవుని మనస్సొక్కటే వెనుకకు తిరిగి చూడగలదు"—అని అమల్ చదువుచుండెను.

చారు నిశ్శబ్దముగా వచ్చినరీతిని తిరిగి వెళ్లిపోలేక పోయినది. నేడు రెండుమూడు దెబ్బలు ఒక దానిపై నొకటి తగులుటచే ఆమె ఓర్మి పోయినది. మందాకినికి ఒక్క అక్షర మైనను బోధపడియుండదనియు, అమల్ మూర్ఖునివలె ఆమెకు వినిపించి తృప్తిపొందు చున్నాడనియు కేకవేసి చెప్ప

వలెనని చారుకు కోరికగల్గినది. కాని దానిని మాటలతో చెప్పక కోపముతో నడుచుచు పాదశబ్దములద్వారా ప్రచారణ చేసివచ్చి, పడకగది తలుపులు పెద్ద ధ్వనిచేయుచు మూసినది.

అమల్ కొంచెమునేపు చదువుట నిలిపెను. చారు వైపు సంజ్ఞచేయుచు మంద నవ్వినది. అమల్ తనలో తానిట్లను కొనెను. "వదిన ఇంత దుర్మార్గురాలేమి? నేనామె బొనిసనా, నన్నామె డబ్బిచ్చి కొని తెచ్చుకొన్నదా? నా కవిత్వము ఆమెకు తప్ప ఇంకెవరికిని వినిపించకూడదా? ఘోరాన్యాయమే!" ఇట్లను కొని మరికొంచెము బిగ్గరగా మందాకినికి వినిపించుట మొదలు పెట్టెను.

చదువుట ముగించి అమల్ చారుగదియెదుటనుండి బయటికి వెళ్లెను. పోవునప్పుడు చారుగదివైపు చూచెను. గదితలుపులు మూసి యుండెను.

ఆడుగుల చప్పుడునుబట్టి అమల్ తనగది ఎడుటగా వెళ్లి పోవుచున్నాడని చారు పోల్చుకొన్నది. ఆమెగది దగ్గర నిలువ నైనలేదే! దుఃఖమువలనను కోపమువలనను ఆమె కేడ్పు రాలేదు. రచనలు వ్రాసియుంచిన నోటుబుక్కు తీసి ఆపుటలను ఒక్కొక్కటిగ చించి, ముక్కలు ముక్కలుచేసి కుప్ప పెట్టినది. పాపము! ఏ అశుభక్షణమున చారా కవిత్వము ప్రారంభినదో కదా!

సంధ్యవేళను వరండామీదనుండి జాజిపువ్వులవాసన వచ్చుచుండెను. అక్కడక్కడ చెదిరియున్న మేఘము

లలోనుండి నక్షత్రములు రమణీయముగ కనపడుచుండెను. చారు నేడు తలదువ్వుకొనలేదు,బట్టమార్చుకొనలేదు, చీకటిలో కిటికీపై కూర్చొనియుండెను. మృదువుగ వీచుచున్న గాలికి ఆమె జుట్టెగురుచుండెను. ఆమె కళ్లవెంబడి నీళ్లెందు కట్లుకారు చున్నవో ఆమెకే తెలియలేదు.

అట్టి సమయమున భూపతి గదిలోనికి వచ్చెను. అతని ముఖము వాడియుండెను. హృదయము భారాక్రాంతము—ప్రతిదినము అత నంతఃపురములోనికి వచ్చుసమయము కాదది. పత్రికను వ్రాసి, పూర్తిపులుపెద్ది లోనికివచ్చునప్పటికి ఆలస్యమగు చుండును. నేడేలనో మనశ్శాంతిని కోరుచు చారువద్దకు సంధ్య కాగానే వచ్చినట్లున్నది.

గదిలో దీపములేదు. భూపతికి చీకటి మసకలో చారు అస్పష్టముగా కిటికీలో కనబడినది. అడుగులచప్పుడు వినబడి కూడ చారు ముఖము త్రిప్పలేదు; బొమ్మవలె నిశ్చలముగ కూర్చొని యుండెను.

భూపతి కొంచె మాశ్చర్యపడి—"చారూ!" అని పిలచెను.

భూపతికంఠము విని చారు ఉలికిపడి లేచినది. వచ్చిన వారు భూపతియని చారనుకొనలేదు. భూపతి మిగుల ఆదరముతో చారుజుట్టులో వ్రేళ్లనుపెట్టి ఆ తలనుమురుచు, ప్రేమార్ద్రకంఠముతో, "చీకటిలో ఒక్కతెవే కూర్చొని యున్నావేమి, చారూ, మంద ఎక్కడికి వెళ్లినది?" అని యడిగెను.

చారనుకొన్నట్లు నేడేమియు జరుగలేదు. అమల్ తప్పకవచ్చి క్షమాపణ కోరుకొనునని ఆమె స్థిరపరచుకొని, అతనికొరకై ఎదురుచూచుచు కూర్చొనియుండెను. అట్టి సమయమున భూపతి రావచ్చునని ఆమె అనుకొనలేదు. హఠాత్తుగ నతని కంఠము వినినతోడనే ఆమె దుఃఖ మాపు కొనలేక వీడ్వసాగినది.

భూపతి మనస్సుకు బాధకలిగినది. "ఏమిజరిగినది చారూ?" అని కలవరపడుచు భూపతి అడిగెను.

ఏమిజరిగినదో చెప్పుట కష్టము. విశేషమేమియు లేదే! అమల్ తాను క్రొత్తగా వ్రాసినదానిని తనకు మొదట వినిపించక మందకు వినిపించెను. ఈవిషయమై భూపతితో ఏమని ఫిర్యాదుచేయగలదు? విని భూపతి నవ్వడా? ఈ స్వల్పవిషయములో గొప్ప అపరాధమును కనిపెట్టుట చారు కసాధ్యమైనది. అకారణముగ తనకంత బాధ ఏల కలుగుచుండెనో తెలియక పోవుటచే ఆమెవేదన మరింత అధికమైనది.

భూపతి—"ఏమయినది చెప్పు చారూ, నేనేమైన తప్పు చేసితినా? పత్రికపనితో సదా నేనెట్లు కలతచెందుచున్నానో నీవెరుగుదువు. నీకేమైన బాధ కలిగించియున్నచో అది నేనిచ్చా పూర్వకముగా చేసినది కాదు."

భూపతి అడిగిన ప్రశ్నకు తానెట్టి జవాబును ఈయ జాలదు. కనుక ఆమె లోలోపల మరింత కలతచెందుచు, అత డామె నెప్పిన పదలిన బతుకుదునని అనుకొనెను.

చారు జబాబుచెప్పకపోవుటచే భూపతి ఎంతో ఆదర ముతోమరలనానెను—"తరచు నీదగ్గరకు రాలేకున్నాను చారూ, అది నాఅపరాధమే, కాని అట్లికముండెన్నడును జరుగదు. రాత్రింబగల్లిక పత్రికతోనే కూర్చుండను. నీకిష్టము వచ్చినంత నేపు నీతోనే కాలముగడుపుచుందును."

"అబ్బే అది కాదు," అని చారు లోలోపున చీకాకుపడి జబాబుచెప్పినది.

"అట్లైన మరిఏమి?" అని అడుగుచు భూపతి మంచము పై కూర్చుండెను.

చారు చీకాకు అణచియుంచుకొనలేక, "ఇప్పుడు కాదు రాత్రి చెప్పెద," నన్నది.

భూపతి కొంచెము నేపేమియు ననక, "సరే, ఇప్పుడు చెప్పనక్కరలేదు," అనుచు లేచి బయటికి వెళ్లిపోయెను. తానేది చెప్పగోరి వచ్చియుండెనో అది చెప్పుట జరగలేదు.

భూపతి మనస్సుకు బాధకలిగినదని చారుకు స్పష్టమయి, తిరిగి అతనిని పిలువవలెననుకొన్నది. కాని పిలిచి అతనితో నేమి మాటలాడగలదు? అనుతాపముకలిగి చాల బాధ పొందినది. కాని ఏమిచేయుటకు తోచలేదు.

రాత్రియైనది. భూపతిభోజనమునకై బహుంచక్కని వేర్పాటుచేసి చేతవిసనకర్రపట్టుకొని తానుప్రక్కనే కూర్చున్నది.

ఆసమయమున, "ప్రజా! ప్రజా!" అని కేకలువేయుచున్న మందాకిని కంఠము వినబడినది. నౌకరు, ప్రజ, పలికినతరువాత అమల్ బాబు భోజనమైనదా యని ఆమె ప్రజను అడిగినది. అయినదని వాడుచెప్పగా, "భోజనమైనప్పటికిని నీవు తాంబూలముతీసుకొని వెళ్లలే దెందుకు?" అని యనుచు ఘాటైన తిట్లు ప్రయోగించి మంద వానిపై నెగిరిపడినది.

నేడు భూపతితో అత్యుల్లాసముగ నెమ్మదిగ నెన్నో మాటలు చెప్పవలెనని చారు తనలో తాను ప్రతిజ్ఞచేసికొన్నది. ఏమేమి మాటలాడవలెనో అవికూడ ముందుగానే నిర్ణయించుకొని కూర్చున్నది. కాని మందాకిని కంఠము వినబడినతోడనే ప్రయత్నమంతయు వృథాయైనది. భోజనసమయములో భూపతితో ఒక్కమాటయైన నాడలేకపోయినది. భూపతికూడ ఎట్టియుత్సాహములేక పరధ్యానముగనుండెను. అతడు భోజనము మనసారచేయలేదు. మధ్యనొక్కమారుమాత్రము చారు భోజనమేమియు చేయుచుండలేదేమియని అడిగినది.

"అట్లడుగుచున్నావేమి? తినుట తగ్గించలేదే!" అని భూపతి జవాబు చెప్పెను.

పడకగదిలోనికి పోయినపిమ్మట, "నాతో నేదో ఇప్పుడు చెప్పెదనంటివి?" అని భూపతి అనెను.

చారు—"కొన్నాళ్లనుండి మాచుచున్నాను. మంద వ్యవహారమేమియు బాగులేదు. ఆమె నిక ఇక్కడ నుంచుటకు నాకు సాహసము చాలదు."

భూపతి—"ఏమి? ఏమిచేసినది.?"

చారు—"అమల్‌తో ఆమెనడపడి చూచినయెడల నాకు సిగ్గువేయుచున్నది."

భూపతి నవ్వుచు జబాబు చెప్పెను—"నీకు పిచ్చెత్తినది! అమల్ కుర్రవాడు, నిన్నలేదు మొన్నటివాడు!"

చారు—"ఇంట్లోని సంగతులేమియు నీకు తెలియదు, బయటివార్తలు కూడపెట్టుకొని తిరుగుచుందువు. పాపము, మా అన్నయ్యమాట ఆలోచించుచున్నాను. అన్నయ్య భోజనము చేసెనో చేయలేదో ఆసంగతికూడ ఆమెకక్కరలేదు. కాని అమల్ బాబు తమలపాకులలోచున్నము తక్కువైనయెడల నౌకర్లమీద మండిపడి గొడవచేయుచుండును."

భూపతి—"స్త్రీలు - మీరు - బహు సందిగ్ధస్వభావములు కలవారు, ఆమాట మరవకూడదు."

"ఔను, మావి సందిగ్ధస్వభావములే. కాని ఇంట్లో ఇటువంటి సిగ్గుమాలినపనులు జరుగుచుండుటచూచి నేనూరుకొనలేను," అని చారు కోపముతో జబాబు చెప్పినది.

ఈవిధముగ చారు కారణములేకయే అనుమానించుచుండుటచూచి భూపతి తనలో తాను నవ్వుకొనెను. అతనికి కొంచెము సంతోషముకూడ కలిగినది. గృహము పవిత్రముగనుండునట్లును, ఊహలోనైన కళంకస్పర్శ తగలకుండునట్లును సాధ్వీమణులగు భార్యలు సదా జాగరూకత కల్గియుందురు.

వారి అనుమానపు చూపులలో ఒకవిధమగు మాధుర్య మున్నది, మహత్త్వమున్నది.

భూపతి భక్తితోను ప్రేమతోను, చారు నొసటను ముద్దు పెట్టికొని ఇట్లనెను—"దీనివిషయమై మరి గొడవ చేయనక్కర లేదు. ఉమాపదుడు మైనింగ్ వెళ్లి అక్కడ ప్రాక్టీస్ పెట్టు కొనబోవుచున్నాడు. మందకూడ అతనితో పోవుచున్నది." చివరకు తనమనసులోనికలత, అప్రీతికరమగువాదనలు మరవ కోరి టేబిల్‌లోనుండి పుస్తకమును బయటికి తీసి పట్టుకొని, నీ వ్యాసము నాకు వినిపించుము చారూ," అని యనెను.

చారు అతనిచేతిలోనుండి పుస్తకము లాగుకొని, "నీకది బాగుండదు, విని వెటకారము చేయుదువు," అని యనెను.

చారుమాట భూపతికి కొంచెము బాధించినది, కాని బయట కది తెలియనీయక ఇట్లు జబాబు చెప్పెను—"లేదు, నేను వేళకోళము చేయను, కదలకమెదలక నోరుతెరవక కూర్చొనియుండెదను; చూచి నేను నిద్రపోవుచున్నానని నీ వనుమానింతువు—అంత నిశ్చలముగ కూర్చుండెదను."

భూపతి కోరిక సఫలము కాలేదు. రచన ఇంటిపెంటలో మాయమైనది.

భూపతి చారుతో అన్నిసంగతులు చెప్పజాలకుండెను. భూపతివార్తాపత్రికకు ఉమాపదుడు మేనేజరు. చందాలు వసూలుచేయుట, అచ్చాఫీసు బాకీలు తీర్చుట, గుమాస్తాలకు

నౌకర్లకు జీతము లిచ్చుట—మొదలగువానిభారమంతయు ఉమాపదమీదనే యుండెను.

ఒకనాడు కాగితము సప్లైచేయుచుండిన వర్తకుని దగ్గర నుండి హఠాత్తుగవచ్చిన ఉత్తరము చూచి భూపతి మిక్కిలి ఆశ్చర్యపడెను. దుకాణదారుడు తనకురావలసిన 2700-రూపాయలు తక్షణము చెల్లించుమని వకీల్‌చేత నోటీసు ఇప్పించెను. భూపతి ఉమాపతిని పిలిపించి, "ఇది ఏమి, కాగిత ములవాని బాకీరూపాయలు నీచేతికి నేనే స్వయముగా ఇచ్చి యుంటిని, వానికి మనమీయవలసినది ఐదారువందల కధిక ముండదే!" అని యనెను.

"దుకాణదారుడు తప్పక పొరపాటు పడుచున్నా"డని ఉమాపదుడనెను. కాని రహస్యము దాగియుండలేదు. కొంత కాలమునుండి ఉమాపదు డీవిధముగానే మోసపుచ్చుచుండెను, కాగితముల వర్తకునివద్దనేకాక బజారులో అనేకులదగ్గర భూపతి పేరను అప్పులు చేసెను. ఉమాపదుడు స్వగ్రామములో పక్కా-భవంతి యొకటి కట్టించుచుండెను; దాని కవసరమైన సామగ్రి భూపతిపేరనేకొని, కాగితముకొరకు భూపతియిచ్చిన రూపాయలతో ఆబాకీలు దిద్దెను.

దొంగతనము పూర్తిగా బయలుపడిపోయినతరువాత ఉమాపదుడు, పౌరుషముతో ఇట్లనెను. "నేనెక్కడికి పారి పోను, పనిచేసి కొంచెముకొంచెముగా నీ అప్పుతీర్చెదను, అణాపైసలతో చెల్లించనియెడల నాపేరు ఉమాపద కాదు."

ఉమాపదుడు వేరు మార్చుకొనుటవలన భూపతికి మన శ్శాంతి కలుగదే! డబ్బుపోయినదని భూపతికి అంతగా బాధించ లేదు, కాని ఈ విశ్వాసఘాతకత తెలియగానే భూతలమువదలి శూన్యములో అడుగు పెట్టినట్లు అతనిలో దిగులుపుట్టినది.

ఆనాడు పెందలకడ అంతఃపురములోనికి అతడు వచ్చు టకు కారణ మిదియే. పృథ్విపై విశ్వాశింపగల తావొకటి ఉన్న దనినమ్మి, లోనికివచ్చి ఒక్కనిమిషముపాటు మనశ్శాంతి ననుభ వింపవలెనని అతనిహృదయ మాకులపడినది. కాని చారు సంధ్యాదీపము నార్పి, దుఃఖముతో కిటికీదగ్గర కూర్చుండి యుండెను.

ఉమాపదుడు మర్నాటియుదయమునసే మైమన్‌సింగ్ పోవలెనని నిశ్చయించుకొనెను. అప్పులవారికి అతని చర్య తెలి యకముందే ఊరువిడిచిపోవలెనని అతని ఉద్దేశము. భూపతికి అసహ్యముకలిగి ఉమాపదతో మాట్లాడుట మానెను. భూపతి తనతో మాటలుమానుట ఉమాపదునకు హాయి యనితోచినది.

అమల్ మందాకినిగదిలోనికి వచ్చి, "సామా నేల సర్దు చున్నావ"ని యడిగెను.

మంద—"ఎప్పుడో వెళ్లవలసినదే కదా! చిరకాల మిక్కడ నుండగలమా?"

అమల్—"ఎక్కడికి వెళ్లుచున్నారు?"

మంద—"మాయూరికి."

అమల్—"ఎందుకు? ఇక్కడ నుండు ఇబ్బందేమి?"

మంద—"నాకేమి ఇబ్బంది, మీనలుగురితో హాయిగా ఉంటిని, కాని ఇతరుల కిబ్బంది కలిగినది." ఇట్లనుచు మంద చారు గదివైపు కళ్లుతిప్పినది.

అమల్ జబాబుచెప్పలేదు. "ఛీ ఛీ, సిగ్గు సిగ్గు, భూపతి బాబు ఏమనుకొనుచున్నారో!" అని మంద అన్నది.

అమల్ దీనినిగురించి మరి వాదించలేదు, చారు తమవిషయమై చెప్పరాని సంగతులేవో చెప్పియుండవచ్చునని అతడు పోల్చుకొనెను.

అమల్ ఇంటిలోనుండి బయటికి వచ్చి రోడ్డువై పచారి చేయుచుండెను. అతనికి ఆ ఇంట్లోనికి తిరిగి వెళ్లకూడదని బుద్ధి పుట్టినది. అన్నయ్య వదినమాటనమ్మి తానపరాధియని నమ్మినప్పుడు మందాకినివలె తానుకూడపోవుట న్యాయమని అమల్‌కు తోచినది. మందాకినిని తిరిమివేయుట తననుకూడ పొమ్మనుటయే—నోటిమాటలతో చెప్పలేదు—అంతేభేదము. అమలునకిప్పుడు తన కర్తవ్యము స్పష్టమైనది. ఇక నొక్కక్షణమైన ఇక్కడ నుండకూడదు. కాని అన్నయ్యకు తన విషయమై ఎట్టి చెడ్డఅభిప్రాయము నుండకూడదనిమాత్ర మతడు కోరుచుండెను. అన్నయ్య ఇన్నాళ్లు తనను పూర్తిగానమ్మి నిండు స్వేచ్ఛనిచ్చి తన యింటిలో నుంచుకొనెను. అన్నయ్య విశ్వా

సము తగ్గింపగల దేమియు తాను చేయలేదని అతనితో చెప్పకుండగ తానెట్లు పోగలడు?

భూపతి తలను చేతిపై నానుకొని బాధమరదియొక్క కృతిఘ్నత, అప్పులవారి తొందర, జమాఖర్చుల తప్పులు, నగదు లేకపోవుట — మొదలగువానిని గురించి ఆలోచించుచుండెను. ఈదుఃఖము భరించుటలో తనకుతోడుగానుండు వారెవ్వరును లేరు—మనోవేదనతో ఒంటరిగా యుద్ధముచేయుటకు సిద్ధపడుచుండెను.

అటువంటి సమయములో అమల్ తుపానువలె గదిలో ప్రవేశించెను. గాఢచింతలో మునిగియున్న భూపతి ఉలికిపడి తలయెత్తిచూచి, "ఏమిసమాచారము అమల్?" అని యడిగెను—అమల్ నేదో మరియొక కొత్త విపత్తునుగురించి చెప్పుటకు వచ్చెనని భూపతికి హఠాత్తుగ తట్టినది.

"నాపై సందేహముకలుగుటకు నీకేదైన కారణము కనబడినదా అన్నయ్యా?" అని అమల్ అడిగెను.

"నీపై నా సందేహమా!" అని భూపతి ఆశ్చర్యపడుచుననెను—అని ప్రపంచమున జరుగుచున్నదానిని పట్టి చూచినయెడల అమల్ని కూడ నేనాడో సందేహింతునేమో యని తనలో తానను కొనెను.

అమల్—"వదిన నా నడవడినిగురించి నీతో ఏమైన అన్నదా?"

భూపతి, "ఇదా సమాచారము! బ్రతికించితివి!" అని తనలో తానసుకొనెను. ఒక ఉపద్రవమ్మపై దానికి మించినది ఇంకొకటి వచ్చిపడ్డదని భూపతి జడిసెను. భూకాపదసమయములోనున్నప్పుడుకూడ తుచ్ఛపు ఫిర్యాదులు వినకతప్పదని జ్ఞాపకము తెచ్చుకొనెను. ఒక ప్రక్కనుండి వంతెనను విరగ కొట్టుచు, వంతెనదాటి అవతలికి మూటముల్లె పట్టుకొని పొమ్మను చుండుటసంసారము మనపై విధించు కర్తవ్యము.

మరియొక నాడిట్టిది జరిగియున్నయెడల భూపతి పరిహాసము చేసియుండును, కాని నే డతనిలో దానికితగిన ప్రఫుల్లత లేక, "అమల్ నీవు పిచ్చివానివలె నున్నా" వని మాత్ర మన్నాడు.

"వచిన నీతో నేమియు ననలేదా?" అని అమల్ మరల నడిగెను.

భూపతి—"నీమీదనుండు అనురాగముకొలది ఏమైన చెప్పియుండినయెడల అది కోపమునకు కారణముకాకూడదు."

అమల్—"ఉద్యోగమేదైన చూచుకొనుటకు నేనిక బయటికి పోవలెను."

"కుర్ర తరహా మాను అమల్! ముందు బాగా చదువు కొనుము, ఉద్యోగముమాట తరువాత ఆలోచించవచ్చును," అని గదుముచు భూపతి కోపముతో జబాబు చెప్పెను.

అమల్ ముఖము వాల్చుకొని బయటికి వచ్చెను. భూపతి చంద్రాదారులపట్టీ తీసి మూడుసంవత్సరములనుండి వారి జమా ఖర్చులు సరిచేసి చూచుచు కూర్చుండెను.

ఎదుటనిలబడి వదినను ప్రశ్నించవలెననియు దీని విషయమై తుదవరకు చూడనిదే విడిచిపెట్టకూడదనియు అమల్ నిశ్చయించుకొనెను. వదినడుగవలసిన కఠిన ప్రశ్నలను తనలో తాను వర్ణించుకొనుచుండెను.

మందాకిని వెళ్లిపోగానే అమల్‌ను తానేపిలిపించి ఒక వ్యాసము వినిపించి అతని మనస్సును శాంతిపరుపవలెనని చారు ఉద్దేశించినది. అమలుని వ్యాసము ననుకరించి "అమావాస్య నాటి కాంతి" అను ఒక వ్యాసము తయారుచేసినది. పూర్తిగా తనసొంత రచనయైనయెడల అమల్ ఇష్టపడడని చారు తెరుగును.

పూర్ణిమ తన కాంతిని పూర్తిగా బయటపెట్టి వేయు చుండునని చారు తన కొత్తరచనలో పూర్ణిమనునిందచేసి సిగ్గు తెప్పించినది. అమావాస్యయొక్క అగాధాంధకారములో పదునారు కళలుగల చంద్రునికాంతి పొరలు పొరలుగ సంపూర్ణముగ కప్పబడియుండుననియు, కనుక పూర్ణిమనాటి కాంతికంటె అమావాస్యనాటి చీకటి అధికపరిపూర్ణతగలది అనియు చారు వ్రాసుకొనిపోయినది. అమల్ తన కవిత్వమును అందరి ఎదుట చాటుచుండును. చారు ఎవరియెదుటను తనరచనను చదువదు—

పూర్ణిమ అమావాస్యలను సరిపోల్చి చెప్పటలో చారు అమలుల మాట సూచించబడినదేమో!

ఋణబాధను తప్పించుకొనగోరి భూపతి తనపరమ మిత్రుడగు మతిలాల్ వద్దకు వెళ్లెను.

మతిలాల్ కష్టములలో నున్నప్పుడు భూపతి అతనికి కొన్ని వేలు బదులిచ్చియుండెను. ఇప్పుడు గొప్పచిక్కులలో ఉండుటచేత భూపతి మతిలాల్ వద్దకు ఆరూపాయలకొరకు వచ్చెను. మతిలాల్ స్నానముముగించి ఒంటిపై బట్టతీసి విసనకర్రతో విసురుకొనుచుండెను, ఎదుట బల్లపై పుస్తకమునుంచి చిన్నచిన్న అక్షరములతో రామకోటి వ్రాయుచుండెను. భూపతి కనబడినతోడనే అత్యాదరముతో, "రా భూపతి, ఇప్పుడు నీదర్శనము దొరకనే దొరకుచుండుటలేదు," అని యనెను.

రూపాయలమాట విని మతిలాల్ ఏమియు తెలియనట్లు క్రిందికి మీదికి చూచుచుండెను. భూపతి సాలు,మాసము తారీకు జ్ఞాపకము లేగా, "ఓ అదియా, అది చాలాకాలము క్రితమే కాలదోషము పుట్టినదే!" అని యనెను.

ఆ జవాబు వినగానే భూపతికి ప్రపంచము హఠాత్తుగ తలక్రిందులై పోయినట్లు తోచినది. ముఖముపై నుండు ముసుగు జారిపడిపోయినది. కుటిలత కంటపడగానే భూపతికి భయము కల్గి శరీరము కంటకితమైనది. హఠాత్తుగ వరదవచ్చిపడునప్పుడు మనుష్యులుభయపడి అంతటిలో ఎక్కైన సాలవై పునకు పరు

గెత్తునట్లు, భూపతి మోసముతోనిండియున్న బయటి సంసారమునుండి అంతఃపురములోనికి పరుగెత్తివచ్చెను; 'ఏదెట్లైనను చారుమాత్రము నన్ను మోసపుచ్చదు కదా!' అని తనలో ఖాయనుకొనెను.

చారప్పుడు మంచముమీద కూర్చొని, ఒడిలో తలగడ నుంచుకొని, దానిపై పుస్తకమునుంచి, ముందుకువాలి తదేకధ్యానముగా ఏదో వ్రాయుచుండెను. భూపతి బాగా దగ్గరకు వచ్చి నిలుచున్నతరువాత చారుకు చైతన్యముకలిగినది; ఆమె తొందరతొందరగ పుస్తకమును కాళ్లక్రింద దాచినది.

మనస్సులో బాధగానున్నప్పుడు ఎంతచిన్న దెబ్బయైనను పెద్దదిగా తోచును. కారణములేకయే చారు అంతతొందర తొందరగ పుస్తకము దాచుట చూడగానే భూపతి మనస్సుకు గాయము తగిలినది.

భూపతి మెల్లగ వచ్చి మంచముపై కూర్చుండెను. తన రచనాస్రోతస్సుకు అనుకొనని అడ్డువచ్చుటచేతను, భూపతి కనబడినతోడనే పుస్తకము తడబడుచు దాచుటవలన మనస్సు వికలమగుటచేతను చారుకు సంభాషణకు సరియైనమాటలు తట్టలేదు.

తాను చెప్పగలిగినది కాని ఈయగలిగినది కాని భూపతి వద్ద ఆనాడేదియులేదు, వట్టిచేతులతో ప్రార్థించవలె చారుదగ్గరకు వచ్చియుండెను. ఆదరముతో చారు ఒక్కమాట అనియుండిన

యెడల అతనిగాయముపై మందుపడి బాధ మాయమై యుండును. భాగ్యహీనులయెడల లక్ష్మి ప్రసన్నురాలుకాదు. ప్రేమభాండాగారము ఒక్కనిమిషముపాటు తెరచుటకైనను తాళముచెవి చారుకు దొరకలేదు. వీరి కఠోరమౌనము ఇంటి నిశ్శబ్దతను మరింత గాఢము చేసినది.

భూపతి కొంతసేపుమాటాడక కూర్చొని, పెద్దనిట్టూర్పు విడిచి మంచముపైనుండిలేచి మెల్లమెల్లగ బయటికి వచ్చెను.

ఆసమయములోనే అమల్ తాను చారుతో అనవలసిన కఠినమైనమాటలు మనస్సులో వర్ణించుకొనుచు తొందర తొందరగా చారు గదివైపు వచ్చుచుండెను. దారిలో భూపతి కనబడెను. వాడి, వివర్ణమైయున్న అతనిముఖము చూడగానే అమల్ దిగులుపడి, "ఏమి అన్నయ్యా, అట్లున్నావేమి?" అని యడిగెను.

ప్రేమతో నిండిఉన్న అమలుని కంఠము వినబడగానే భూపతిహృదయము అశ్రురాశితోనిండి పగిలిపోవుచున్నట్లైనది. కొంతసేపటివరకు నోటివెంబడి మాటలు రాలేదు. కాని చివరకు దుఃఖము నణచుకొని, తాను హాయిగానే ఉన్నానని తెలియ జేసి అమితాదరముతో "ఈసారి పత్రికలో నీవ్యాసమేదైన వెలువడినదా అమల్?" అని అడిగెను.

అమల్ తయారుచేసుకొనివచ్చిన కఠినమైనమాటలన్నీ రెప్పపాటులో అదృశ్యమైనవి. తొందరగా చారు గదిలోనికి వచ్చి, "అన్నయ్య అట్లున్నాడేమి వదినా?" అని యడిగెను.

"ఏమీ ? నాకేమియు కనబడలేదే! ఇంకేపత్రికలోనైన ఈ పత్రికను దూషించి ఎవరైన వ్రాసియుండవచ్చు"నని చారు జబాబు చెప్పినది.

అమల్ అయిఉండదని తల ఆడించెను.

పిలవకయే నేడు అమల్ వచ్చెను. చారు మనస్సుకు ఉల్లాసము కలిగినది తత్ క్షణమే ఆమె తనవ్యాసమును గురించి చెప్పసాగినది. నేడు "అమావాశ్యనాటి కాంతి" అని ఒక వ్యాసము వ్రాయుచుంటిని. దానినతడు చూచుట కొంచెములో తప్పిపోయినది.

అమల్ దానిని చూపించమని తననుతప్పక తొందరపెట్టు ననినమ్మి చారు ఆనోటుబుక్కు-కాగితములను కొంచెమిటు నటు కదుపినది. అమల్ ఆమెవంక నొక్కసారి తీవ్రదృష్టితో చూచి ఏమి అనుకొనెనో, ఏమి బోధపరచుకొనెనో గాని నిర్భ్రాంత పోయెను. పర్వతమార్గమున పథికుడు నడుచుకొని పోవుచున్న ప్పుడు హఠాత్తుగ మేఘముచెదిరి తానొక వేయిమూరలలో తుగహ్వరములో కాలువేయ బోవుచున్నానని తెలిసికొని చకితుడగును. అమల్ అదేవిధముగ చకితుడయి, ఒక్కమాట యైన నాడక బయటికి వెళ్లిపోయెను.

అమల్ ఎన్నడు నిట్లుచేయలేదు! చారుకు దాని తాత్పర్యము బోధపడలేదు.

మర్నాడు భూపతి వేళకానివేళను పడకగదిలోనికి వచ్చి చారును పిలిపించి "చారూ, అమల్‌కు మంచి పెళ్లిసంబంధము వచ్చినది," అని అన్నాడు.

చారు, పరధ్యానముగానుండి "మంచిది ఏమి వచ్చింది," అని అడిగినది.

భూపతి—"పెళ్లి సంబంధము."

చారు—"ఏమి నేను నచ్చలేదా?"

భూపతి బిగ్గరగానవ్వి జబ్బు చెప్పెను—"నీవు నచ్చుట విషయమై అమల్‌ని ఇంతవరకు అడగలేదు. అమల్ ఇష్టపడి నప్పటికిని నా కుండు చిన్నహాఁకు— నేను అంత సులభముగ వదులుకొన దలచుకోలేదే!"

చారు—"ఛా, అటువంటి అసందర్భపు మాటలేమిటి? నీ పెళ్లికి సంబంధము వచ్చినదని చెప్పితివని నేనట్లడిగితి అనుచు చారు ముఖమెర్ర చేసుకొన్నది.

భూపతి—"అట్లైన పరుగెత్తి నీదగ్గరకు వచ్చియుందునా? బహుమతి దొరకునని! ఆశింతునా?

చారు—అమల్‌కు పెళ్లిసంబంధము వచ్చినదా? అట్లైన ఆలస్య మెందుకు?

భూపతి—"బర్థమాక్ వకీలు, రఘునాథబాబు, తన కుమార్తెనిచ్చి పెళ్లిచేసి అమల్‌ని విదేశానికి పంపగోరుచున్నాడు."

"విదేశానికా?" అని ఆశ్చర్యపడుచు చారడిగినది.

"ఔను విదేశానికి."

"అమల్ విదేశానికి వెళ్లునా? మంచిదే చాలామంచి మాట. అతనితో మాటాడి చూడు."

"నేను చెప్పకముందు నీవతనిని పిలిచి బోధపరచినయెడల బాగుండు నేమో!"

"నేను వేయిసార్లు చెప్పితిని—అమల్ నామాట వినడు. నేను చెప్పను."

భూపతి—పెళ్లిచేసుకొనడని నీకు తోచుచున్నదా ?

చారు—చాలసార్లు నేను ప్రయత్నించితిని ఒప్పించ వలెనని—అమల్ ఇష్టపడలేదు.

భూపతి—కాని ఈ సంబంధము వదులుకొనుట మంచిది కాదు. నేను అప్పులలో మునిగిపోయి ఉన్నాను. పూర్వము మాదిరి అమల్‌ని పోషించలేను.

భూపతి అమల్‌ని పిలిపించి అడిగెను—బ్రహ్మాండ వకీలు, రఘునాథబాబుగారు, తన అమ్మాయిని నీకిచ్చి పెళ్లిచేసి, నిన్ను సీమ పంపించవలెనని కోరుచున్నారట—నీకది ఇష్టమేనా ?

అమల్—నీవు సమ్మతించినయెడల నా కభ్యంతరము లేదు.

అమల్ మాట విని ఇద్దరును ఆశ్చర్యపోయిరి. అతను అంత సుళువుగా ఒప్పుకొను నని వారనుకొనలేదు.

చారు ఎగతాళిచేయుచు కంఠమెత్తి ఇట్లన్నది—అన్నయ్య సమ్మతించినయెడల తాను సమ్మతించినట్లే ! అన్నయనిన ఎంత విధేయత తమ్మునికి! ఈభక్తి ఇంతకాలము ఎక్కడ యుండె నబ్బాయి !

అమల్ చిరునవ్వు నవ్వబోయెను, జబాబీయలేదు.

అమల్ జబొబు చెప్పకుండుట చూచి అతనికి మెలకువ తెప్పించగోరి చారు తీక్ష్ణముగ నిట్లన్నది: "స్వతంత్రము—స్వ-ఇచ్ఛ—వదులుకొన్నా ననిచెప్పుట దానికంటె మేలు. ఇన్నాళ్లూ పెళ్లి అక్కరలేదని నటించుట ఎందుకు? కడుపులో ఆకలి, బయటికి సిగ్గు!"

భూపతి హాస్యముగా జబొబు చెప్పెను: "నీమాట ఆలోచించియే ఆకలి అణచిపెట్టి ఉంచుకొన్నాడు, తోటి కోడలి మాట వినగానే ఈసుకలుగునేమో యని!"

చారు ముఖమెఱ్ఱచేసుకొని గొడవచేసినది.—"ఈసా! ఆహా, సందేహమేమి! ఈసట! నాకెందు కీసు—నీవాలాగు అనుట చాల తప్పు!"

భూపతి—ఇదిగో చూచితివా! నాభార్యతో నేనే వేళాకోళమాడ కూడదట!

చారు—అటువంటి వేళాకోళము నాకిష్టములేదు.

భూపతి—సరే! గొప్ప అపరాధముచేసితిని తమిం చుము. కాని ఏదెట్లైనను పెళ్లిమాత్రము స్థిరమేనా?

అమల్—ఆహా.

చారు—పిల్ల మంచిదో కాదో చూచి వచ్చువరకు ఓర్చియుండలేరు కాబోలు; మీకంత దుర్దశపట్టినదని నేనెన్నడు అనుకొనలేదు.

భూపతి—"అమల్, పిల్లను చూడవలెనని నీకున్నయెడల చూచేయేర్పాటు నేను చేయగలను—అమ్మాయి చక్కనిదని విన్నాను."

అమల్—"చూచుట కవసరము కనబడలేదు."

చారు—"అతని మాట వినుటవీల? వధువును చూడ కయే ఎన్నడైన పెళ్లి నిశ్చయించగలమా? అతను చూడ కోరకున్నను మనము చూడవలెను."

అమల్—"వద్దన్నయ్యా, దానికొరకై వృథాగా ఆల స్యముచేయుట నాకిష్టము లేదు.

చారు—"ఔను, ఆలస్యము చేయకూడదు. గుండె బద్దలై పోగలదు—పెళ్లిముస్తాబుతో ఇప్పుడే బయలుదేరు అమల్! నీబంగారు రాణిని, నీమాణిక్యమును ఎవరైన ఎత్తుకొని పోగలరు!"

ఎంత పరిహాసముచేసియైనను చారు అమలుని మనస్సు త్రిప్పలేక పోయినది.

చారు—"సీమ పోవుటకు నీ మనస్సట్లు పరుగెత్తుచున్న దేమి? ఇక్కడ నీకేమి కట్టిపెట్టి ఉంచితిమా లేక నిన్ను కొట్టు చున్నామా? పంట్లాము తొడుగుకొని హ్యాట్ పెట్టుకొనినిచో నేటి యువకులకు తృప్తిలేదు. ఏమి అబ్బాయీ, సీమనుండి తిరిగి వచ్చి మావంటి నల్ల వారిని పోల్చుకొనగలవా?"

అమల్—"పోల్చుకొనగలిగినయెడల సీమవెళ్లి ప్రయో జనమేమి?"

భూపతి నవ్వుచు ననెను—"నల్లనిగూఢ మరచుటకే సప్తసముద్రములు దాటుట. కాని నీవు భయపడనక్కరలేదు. మేమందరము నున్నాము—మేముండగా నలుపును పూజించు భక్తులకు లోటుండదు."

భూపతి మిక్కిలి సంతోషించి, తత్క్షణమే బర్ద్దమాన్ ఉత్తరము వ్రాసి పెళ్లిముహూర్తము నిశ్చయించెను.

ఇంతలో వార్తాపత్రిక నిలపవలసివచ్చినది—భూపతికి మరి డబ్బులేకపోయినది. లోకుల కుపకారమగు పనిచేయ నిశ్చయించుకొని శక్తి వంచనలేక రాంత్రింబగళ్లు ఎన్నాళ్లనుండో చేయబూనిన పనియంతయు ఒకక్షణములో విడిచిపెట్టవలసివచ్చినది. కడచిన పన్నెండేళ్లనుండి విరామములేక తాను చేయుచుండిన ప్రయత్నమంతయు నీటిమధ్యకువచ్చి హఠాత్తుగ ఆగిపోయినది. ఇట్లు జరుగవచ్చునని భూపతి ఎన్నడు ననుకొనలేదు. హఠాత్తుగ నిట్లు నిలపబడిన ప్రయత్నములను ఇప్పుడత డెటువైపునకు త్రిప్పగలడు ? ఆ ఉద్యమములన్నియు తిండికిలేక బాధపడుచుండు అనాథశిశువులవలె భూపతి ముఖమువంక చూచుచున్నట్లుండెను. వానిని తన అంతఃపురములోనికి తీసికొనిపోయి కరుణామయయు శుశ్రూషాపరాయణయు నైనట్టి స్త్రీ ఎదుట నిలబెట్టెను.

ఆస్త్రీ అప్పుడేమి చేయుచుండెను. ఆమె తనలో తానను కొనుచుండెను—"ఏమీ ఆశ్చర్యము! అమల్ పెళ్లిచేసికొనునట! మంచిమాటయే! కాని ఇంతకాలము మాఇంటనుండి, పై

పిల్లను వివాహమాడి హఠాత్తుగ విదేశముపోవ నిశ్చయించు చున్నప్పుడు ఒక్కనిమిషముపాటు లేశమైన సంకోచమతనికి కలుగలేదే! ఇన్నాళ్లు ఎంతశ్రద్ధతో సేవచేసి ఇంటిలో నుంచు కొంటిమి—వెళ్లిపోవుటకవకాశము దొరకగానే, ఎప్పుడు సందు దొరుకునోయని చూచుచున్నవానివలె తత్‌క్షణము నడుము బిగించుకొని వెళ్లిపోయెను. ఐనను మాటలలో నెంతప్రేమ, ఎంత మాధుర్యము చూపుచుండెను! మనుష్యులను పోల్చు కొనుట కష్టము! అంతచక్కగ వ్రాయగలవానికి హృదయ మనునది ఉండదని ఎవ రనుకొనగలరు?

చారు తనహృదయపరిపూర్ణతను అమలుని హృదయ శూన్యతతో సరిపోల్చిచూచి అతని తృణీకరింప ప్రయత్నము చేసినది కాని చేయలేకపోయినది. లోలోపున తీవ్రవేదన యొకటి తప్తశూలమువలె ఆమె అభిమానమును పొడిచి మీదికి ఎత్తుచుండెను.

అమల్ నేడుకాక రేపు వెళ్లిపోవుచున్నాడు, ఐనను ఒక్కమారైన కనబడకున్నాడే!

ఈనడుమను ఇరువురిలో లోలోపల పరస్పర విరోధము కొంత కలిగినది. దానిని సరిచేసుకొనుట కవకాశము చిక్కలేదు. ఇన్నాళ్లనాటి తమ ఆటపాటలు ఈవిధముగా అంత మగునని చారు అనుకొనలేదు. అమల్ అవకాశము కల్పించు కొని తానే వచ్చునని చారు ప్రతినిమిషము ఎదురుచూచు చుండెను—కాని అమల్ రానేలేదు. తుదకు అమల్ వెళ్లి

పోవుదినము బాగా దగ్గరపడుటవల్ల చారు తానే అమల్‌ని పిలిపించినది.

కొంచెముతాళి వచ్చెదనని అమల్ జబాబు చెప్పెను.

చారు ప్రతిదినము తాము కూర్చుండెడి వరండామీదికి వెళ్లి మామూలు కుర్చీమీద కూర్చున్నది. ఉదయమునుండి దట్టమైన మేఘము లాకాశము నావరించియుండుటచే మిక్కిలి ఉక్కగానున్నది. జుట్టు తలమీద కుప్పగాపెట్టి విసనకర్రతో మెల్లగ విసరుకొనుచున్నది.

చాలానేపిట్లు కూర్చున్నది. విసనకర్ర ఆగిపోయినది. దుఃఖము, కోపము, అసహనము ఆమెమనస్సులోపల పరిస్ఫుటమైనవి. "అమల్ రాలేదు—రాకపోయిన మాత్రమేమి?" అని చారు తనలో తాననుకొనుచున్నది. కాని అడుగుల చప్పుడు చెవినిపడినంతమాత్రాన ఆమెమనస్సు ద్వారమువైపు పరుగెత్తుచున్నది.

దూరాన చర్చి - గడియారము పదునొకండు కొట్టినది. భూపతి ఇప్పుడే స్నానముచేసి భోజనమునకై వచ్చును. ఇంకను అరగంట సమయమున్నది. ఈలోగా అమల్ రావచ్చును. వారిరువురిలో జరిగిన నీరవ-కలహము పరిష్కారము చేసికోవలెను—ఇట్టిమనస్సుతో అతనిని సాగనంపకూడదు కదా! వదిన మరదులది ఒకేవయస్సు, అనురాగముకొలదీ ఎన్నోమార్లు పోట్లాడుకొన్నారు, జట్టు విప్పుకొన్నారు, దగ్గరకూర్చొని అతిప్రేమతో పూర్వపుకథలెన్నో చెప్పుకొనుచు ఆనందించు

చుండిరి. అమల్ వానినన్నిటిని మంటిలోకలిపి దూరదేశము పోయి ఎన్నాళ్లవరకో రాకుండగ అక్కడడుండి పోగలడా! కొంచెము పరితాపమైన నుండదా, వదిన మరదుల మెంత అన్యోన్య ప్రీతితో నుంటిమోయని జ్ఞప్తికివచ్చి కొంచెము కన్నీటినైన విడవడా!

సుమారు అరగంట ఐపోయినది. చారు చింపిరిజుట్టును వ్రేళ్లతో వడిగా దువ్వుచున్నది, ముడివేయుచు విప్పుచున్నది. కన్నీరాపుకొనుట ఆమెకు మరి సాధ్యము కాకున్నది. అంతలో నౌకరువచ్చి, "అమ్మగారూ, బాబుగారికొరకు నీటికొబ్బరికాయ ఈయండి," అని యనెను.

చారు పైటచెంగునుండి తాళము చెవులగుత్తిని విప్పి నౌకరు కాలిదగ్గర విసిరినది. నౌక రాశ్చర్యపడి తాళముల గుత్తి తీసికొని పోయెను.

చారుగుండెలోనుండి బరువేదో మీదికివచ్చి గొంతుక కడ్డుపడుచున్నది.

మామూలువేళకు నవ్వుముఖముతో భూపతి భోజనము నకు వచ్చెను. విసనకర్ర చేతపుచ్చుకొని చారు భోజనస్థలము నకు వచ్చినది. అమల్ భూపతితోకలసి లోనికివచ్చెను. చారు అమల్‌ముఖమువైపు చూడనే లేదు.

అమల్—"నన్ను పిలిచితివా వదినా?"

చారు—"ఇప్పుడు మరి అవసరము లేదు."

అమల్—"అక్కైన నన్ను పోనిమ్ము, ప్రయాణమునకు సరుదుకొనవలసినవి అనేకములున్నవి."

చారు కళ్లెర్రచేసి అమల్ముఖమును చూచుచు, "వెళ్లు"మనెను. అమలొకమారు చారువంకచూచి వెళ్ళిపోయెను.

భోజనమైనపిమ్మట చారుతోకలసి కొంచెముసేపు కూర్చుండుట భూపతి కభ్యాసము. కాని నేడు చూడవలసిన జమాఖర్చులు అనేకముగ నుండుటచేత మామూలు ప్రకారము కూర్చుండియుండలేనని తోచి కొంచెము విసుగుకొనుచు, "నేడాట్టేసేపు కూర్చొనలేను చారూ, చాలాచీకాకు పనియున్నది," అని యన్నాడు.

చారు—"అక్కైన వెళ్లు."

చారు అభిమానముకొలది అన్నదని తోచి, భూపతి, "అట్లని ఇప్పుడే పోవలెనని నే ననలేదు—ఆట్టేసేపు కూర్చుండలేను. కొంచెము విశ్రాంతితీసికొని వెళ్లెదనంటి" నని భూపతి యనెను. అని కూర్చుండెను, కాని అతనికి అసంతుష్టిగానే ఉండెను.

ఏదో సంభాషణలోనికి దిగవలెనని భూపతి ప్రయత్నము చేసెను, కాని ధోరణి కుదరలేదు. ప్రయత్నము వృథాయగుట కనిపెట్టి భూపతి చివరకు—"అమల్ రేపు వెళ్ళిపోవుచున్నాడు. ఒంటిరిదానవై పోవుదువు; నీకు మరీ తోచదేమో," అని యనెను.

చారు జబాబుచెప్పలేదు. ఏదో పనియున్నట్లు నటించి ప్రక్కగదిలోనికి వెళ్లిపోయినది. భూపతి కొంచెముసేపు వేచి యుండి బయటికి తనపనిమీద వెళ్లిపోయెను.

చారు అమల్‌వంకచూచి కనిపెట్టినది—అమల్ మిక్కిలి నీరసముగ కనబడుచుండెను. ముఖమున ఆ తరుణకాంతి, ఆ ఉత్సాహము లేనేలేవు. అది చూచి చారుకు దుఃఖము కలిగినది, సుఖముకూడ కలుగకపోలేదు. సమీపించుచున్న ఎడబాటే అమలుని దుఃఖమునకు కారణము—ఎట్టిసందేహమును లేదని చారు నమ్మినది. కాని అమల్ ఇట్లు వ్యవహరించుచున్నాడేమి? అట్లు దూరముగానుండి తప్పించుకొని తిరుగుచున్నాడేమి? వెళ్ళిపోవువేళను విరోధముతో మనసులనిట్లు పంకిలము చేయుచున్నాడేమి?

మంచముపై పరుండి ఏదో ఆలోచించుచు చారుత్రుళ్లిపడి హఠాత్తుగలేచి కూర్చున్నది. హఠాత్తుగ నామెకు మందాకిని మాట జ్ఞప్తి వచ్చినది. 'అమల్ మందాకినిని ప్రేమించుచున్నాడేమో! మందాకిని వెళ్లిపోవుటచే అమల్ ఇట్లు—ఛీ!' అమల్ మనస్సు అటువంటిది కాగలదా! అంతనీచమా? అంత కలుషమా? వివాహిత రమణిచే ఆకర్షింపబడునా? అసంభవము! చారు ఆసందేహమును తన యావచ్ఛక్తిని ప్రయోగించి త్రోక్కివేయ ప్రయత్నించినది, కాని అది ఆమెనే మ్రింగి వేయుచుండెను.

ఇట్లుండగా అమల్ వెళ్లిపోవు సమయము వచ్చినది. మేఘు మింకను వదలలేదు. అమల్ వచ్చి వణకుమాటలతో, "వెళ్లుచున్నాను వదినా, అన్నయ్యను జాగ్రత్తగ చూచుచుండుము. గొప్ప ఆపదసమయము, అతనికి సాంత్వన మీయగల దానవు నీవొకతెవే!" అని యనెను.

భూపతియొక్క నిరుత్సాహము, వాడిన ముఖము చూచి అమల్ అతని దురవస్థనుగురించి తెలుసుకొనెను. అతడు తన దుర్దశతో ఎటువంటి గందరగోళమునుచేయక ఒంటరిగా పోట్లాడుచుండెను. అతనిని ఓదార్చువారుగాని, అతనికి సహాయపడువారుగాని లేకుండిరి. ఐనను తాను పాలించుచున్న బంధువులకుగాని, ఆశ్రితులకుగాని తన ప్రమాదావస్థవలన ఎట్టి తొందర కలుగకుండునట్లు చూచుచుండెను. దీనినిగురించి ఆలోచించుచు అమల్ మాటాడక నిలబడియుండెను. తరువాత చారుమాట, తనమాట అనుకొని ముఖమెర్రచేసికొన్నాడు. కొంతసేపైనతరువాత చటీమని ఈవిధముగా అన్నాడు— 'ఆషాఢచంద్రుడు' 'అమావాశ్యకాంతి' మంటగలసిపోనీ! నేను సీమవెళ్లి బారిష్టరీ పాసయివచ్చి అన్నయ్యకు సాయముచేసినప్పుడే నేనొక పురుషునిక్రింద లెక్క."

గతరాత్రియంతయు నిద్రలేక అమల్ సెలవుతీసికొని వెళ్లిపోవునప్పుడు ఏమేమి అనవలెనో చారు నిశ్చయించుకొనుచుండెను. నిష్కార్యమును, అభిమానమును, ఔదాసీన్యమును ఆమాటలలోపెట్టి వాటిని వాడిచేసి సిద్ధముగా ఉంచినది. కాని

ఆవేళకు చారు నోటివెంబడి వానిలో ఒక్కమాటయైనను రాలేదు — "ఉత్తరము వ్రాయుచుండుము అమల్," అని మాత్ర మనగల్గినది.

అమల్ భూమికి తలను తగిలించి చారుకు ప్రణామము చేసెను. చారు పరుగెత్తి పడకగదిలోనికిపోయి తలుపులు మూసికొన్నది.

భూపతి బర్దమాన్ వెళ్ళి అమల్ వివాహాంతమున అతనిని విదేశమునకు సాగనంపి ఇంటికి తిరిగివచ్చెను.

నాలుగువైపులను దెబ్బలుతినుటవల్ల విశ్వాసపరాయణుడైన భూపతికి ఒకవిధమగు వైరాగ్యముకలిగినది. సభాసమాజములలో, నలుగురితో కలసిమెలసి తిరుగుట కనిష్టతకలిగినది. "ఇంతకాలము వీనితో నన్ను నేను మోసపుచ్చుకొనుచుంటిని. సుఖముగా నుండవలసినదినములు గడచిపోయినవి. జీవనములో అన్నిటికంటె సారమైనభాగమును మురికికుండీలో పార వైచితిని," అని అనుకొనసాగెను.

"పత్రిక పోయింది, మంచిపని యైనది, మోక్షము దొరికినది," అని భూపతి తనలో తా ననుకొనెను. చీకటిపడుచుండుట చూచినతోడనే పశువులు తమతమ గూళ్లకు తిరిగి వచ్చుచుండును. అదేవిధముగ భూపతి దీర్ఘదినమంతయు పనితో తిరుగుచుండెడి తావుల నన్నిటిని విడిచిపెట్టి అంతఃపురములోనికి, చారువద్దకు, వచ్చి చేరుకొనెను. "ఇక మరియొక్కడికిని పోను, ఇదియే నా స్థిరమైనస్థలము. నేను రోజంతయు ఆటాడుచుండిన,

కాగితపుపడవ మునిగిపోయినది, ఇక నే నింటికి వచ్చిచేరితి"నని అనుకొనెను.

భార్యలపై నధికారము మనము ప్రయత్నముచేసి సంపాదించనక్కరలేదని అందరివలె భూపతికూడ నమ్ముచుండెను. భార్య భుగ్నివకారవంటిది—తనలోపలనుండు కాంతివల్లనే వెలుగుచున్నది. గాలికి ఆరదు, వెలుగుచుండుటకు చమురవసరములేదు. బయటిభాగము కూలిపడుట ప్రారంభించగానే భూపతి అంతఃపురములోనికి వెళ్లిపోయెను. కాని లోపల వర్షిలోనైన పగులుండవచ్చునని అత డనుమానించలేదు, పరీక్షచేయవలెనని అతనికి తట్టలేదు.

భూపతి బర్దమాన్‌నుండి తిరిగివచ్చినప్పటికి సాయంకాలమైనది. కాళ్లుచేతులు కడుగుకొని పెందలకడ భోజనము ముగించెను. అమల్ పెళ్లినిగురించి, అతని సీమప్రయాణమునుగురించి, మెదటినుండి చివరవరకు, సవిస్తరముగ, వినుటకు చారు ఆతుర పడుచుండునని భూపతి త్వరగా సిద్ధపడెను. భూపతి పడకగదిలోనికి వచ్చి మంచముపై పరుండి గుడుగుడు పీల్చుటమొదలు పెట్టెను. చారు ఇంకను రాలేదు. ఇంటిపనిచేయుచున్నది కాబోలు. తమాకయిపోయినది. అలసియుండుటచేత భూపతికి నిద్రవచ్చినది. నిద్రలో మధ్యమధ్యను లేచి చారింకను రాకుండుటకు కారణమేమని అనుకొనుచుండెను. తుదకు ఉండలేక చారును పిలిపించి, "నేడింత ఆలస్యమేమి చారూ?" అని అడిగెను.

చారు దానికి జబాబీయక, "ఔను ఆలస్యమైనది," అని అన్నది.

చారు అతి ఆత్రతగా అడుగునని భూపతి తలచెను. ఆమె అడగకుండుట చూచి భూపతి నిరుత్సాహపడి, "అమ్మైన అమల్ యెడల చారుకు అనురాగ మింత స్వల్పమా?" అని యనుకొనెను. అమలుడును ఆమెయుకలసి ఉన్నన్నాళ్లు సదా ఆడుచు పాడుచు కాలక్షేపము చేయుచుండిరి. అతడు వెళ్లిపోయినతోడనే ఇంత ఉదాసీనతా! ఈ ఆసక్తిహీన స్వభావముచూచి భూపతికి కొంత అసంతుష్టి కలిగినది. చారు హృదయము ఇంత గంభీరతలేనిదా? ఆమోద వినోదము లెరుగునుగాని ప్రేమ ఎరుగదా! ఇంత అసక్తి లేని స్వభావము స్త్రీలలో మంచిదికాదని భూపతి నమ్మకము.

చారూ అమలుల మైత్రిచూచి భూపతి ఆనందించుచుండెను. వారి కుర్రతరహా స్నేహము, కలహాములు, ఆట, మొదలైనవి భూపతికి వినోదకరముగాను, కుతూహలకరముగాను ఉండెను. చారు చేయు సంరక్షణలోను, ఆమె కనపరచు ఆదరణలోను ఆమెహృదయములోనున్న కోమలత వ్యక్తమగుట చూచి భూపతి సంతోషించుచుండెను. అదియంతయు పైపైదా? దానికేమియు పునాదిలేదా?అని ఆశ్చర్యపడి ప్రశ్నించసాగెను. చారు అంతహృదయములేనిదైనయెడల అతని కెట్లు ఆశ్రయ మీయగలదు!

నిజము కనుక్కొనగోరి భూపతి చారును, "నీ ఒంట్లో ఏలాగున్నది చారూ, సుస్తిగా లేదుకదా?" అని అడిగెను.

చారు అతిక్లుప్తముగా జబాబు చెప్పినది, ఒంట్లో జబ్బేమియును లేదని.

భూపతి—"అమల్ వెళ్లి అయిపోయినది."

భూపతి ఈమాట లని ఊరకయుండెను. ఎంత ఆలోచించినను మాటలాడుటకు నీవిషయము తట్టలేదు—నోటివెంబడి మాట రాలేదు.

దేనినైన బాగాపరికించి చూచు స్వభావముకాదు భూపతిది. కాని అమల్ వెళ్లినప్పటినుండి అతని మనస్సులో బాధగానుండుటచే, చారు ఉదాసీనత అతని మనస్సుకు కష్టము కలిగించినది—తనవలె విచారించు చారుతో కలసి అమలునిగురించి మాటలాడుచు తన మనోభారము తగ్గించుకొనగోరెను.

భూపతి — "పిల్ల బహు చక్కనిది — నిద్రపోవు చున్నావా చారు?"

చారు—"లేదు."

భూపతి — "అమల్ ఒంటరిగా వెళ్లిపోయినాడు, పాపము. బండిలో ఎక్కునప్పుడు పిల్లవానివలె ఏడ్వసాగెను. అది చూచి పెద్దవాడను నేనుకూడ కన్నీ రాపుకొనలేక పోతిని. బండిలో ఇద్దరు దొరలుండిరి. మగవాళ్లిట్లేడ్చుచుండుట వారికి వింతగా నుండెను."

దీపములేని పడకగదిలో మంచముమీద పరుండియున్న చారు ఒకప్రక్కనుండి మరియొకప్రక్కకు తిరిగి, కొంచెముసే

పైనతరువాత హఠాత్తుగ లేచి బయటికి వెళ్ళిపోవుచుండెఁ భూపతి "ఏమి—బంట్లో ఎట్లున్నది చారూ?" అని కంగా పడుచు అడిగెను.

చారు జబాబుచెప్పలేదు. కొంతసేపైనపిమ్మట బయ నుండి రుద్ధకంఠముతోనుండి వచ్చుచున్న ఏడ్పు వినబడ్డది— భూపతి దిగులుపడి బయటికి వచ్చిచూచెను. చారు వరండ మీద నేలను బోరగిలపడుకొని ఏడ్పు ఆపుకొన ప్రయత్నించ చున్నది.

చారిట్లు ఆపుకొనలేక ఆపుకొనలేక ఏడ్చుచుండుట చూచి భూపతి ఆశ్చర్యపడెను. చారు విషయమై పొరపాట పడితినని అత ననుమానించెను. దుఃఖము నాయెదుటకూడ బయలుపడనీయదు — ఆమెది అంత అణచిపెట్టుకొనియుండు నైజమా!

అట్టి స్వభావముగలవారికి ప్రేమవలె దుఃఖముకూడ గాఢముగనే యుండును. చారు ఇతరస్త్రీలవలె తన హృదయ ములోనున్న ప్రేమను నలుగురియెదుట ప్రదర్శింపవలసినది కాదని భూపతి పోల్చుకొనెను. చారు జీవితములో ప్రేమ బయటికి పొంగిపొరలి వచ్చుచుండుట భూపతి ఎన్నడు చూడ లేదు. అది లోపల బాగుగ విస్తరించియుండుటయే దానికి కారణమని నేడు భూపతికి స్పష్టమైనది. భూపతికికూడ మనో భావములు బయటికి ఎక్కువగా కనపరచుట చేతకాదు. హృదయవేగము లోపల నుంచుకొనుచుండుటయే చారు స్వభావమని నేడు కనిపెట్టుటవలన భూపతికి తృప్తికలిగినది.

అత నామె ప్రక్కను కూర్చుండి మాటలాడక ఆమె దేహమును నిముర సాగెను. ఆమె నెట్లు ఓదార్చవలెనో అతనికి తెలియలేదు. కాని యెవరైన అంధకారములో కూర్చుండి తమ దుఃఖమును అణిచిపెట్టుకొన ప్రయత్నించుచున్నప్పుడు, దగ్గర సాతులుండుట వాళ్లకు ఇష్టముగ నుండదు—ఈ మాట భూపతి యెరగడు.

పత్రికపని మానుకున్నప్పటినుండి భూపతి తీరికగా కూర్చొని తన భవిష్యత్తు నూహించుకొనుచు ఒక దృశ్యమును మనఃఫలకముపై చిత్రించుకొనెను. దురాశ తన కక్కరలేదని నిశ్చయించుకొనెను. అందని పళ్లకాశించక చారును ప్రేమించుచు, ఆమె చదువు సంధ్యలను నడుపుచు, చిన్న చిన్నవైనిక గృహకర్తవ్యములను పాలించుచుందునని నిశ్చయించుకొనెను. గార్హస్థ్య సుఖములు సులభముగా మనకు అందుబడిలోనున్నవి, వినను మనోరంజకమైనవి; గృహకృత్యములు మనము చేయగలవి, వినను పవిత్రమైనవి. సులభముగ మనము పొందగల ఈ సుఖములతో సంధ్యాదీపమును వెలిగించుకొని శాంతితో కాలము గడపవలెనని భూపతి ఆశింపసాగెను; హాసపరిహాసములతోను, సుఖసంభాషణతోను పరస్పరమనోరంజనము చేసుకొనుచుండవలెనికోరుట మొదలుపెట్టెను. ఇంతకు మించిన ప్రయత్నము అనావశ్యకము—కావలసినంత సుఖము దీనివలన ఎడతెరిపిలేక పొందగలనని అతనికి విశ్వాసము కలిగినది.

క్రియలోనికి దిగినప్పుడు 'సులభము' సులభము కాదని ఎట్టకేలకు.

వెలకు దొరకని వస్తువు, తనయంతట తానే మనచేతిలో పడినప్పుడు తప్ప, మనమెంత ప్రయత్నముచేసినను, ఎక్కడ వెదకినను, మనకు దొరకదు.

భూపతి చారుతో కలసి సహజముగా హాయిగా సంభాషణ చేయలేకపోవుచుండెను. ఇది తన తప్పువల్లనని నమ్మి భూపతి తనను తాను నిందించుకొనుచుండెను. పన్నెండు సంవత్సరములు కేవలము వార్తా పత్రికకు వ్రాయుచు కూర్చొని భార్యతో సంభాషించు శక్తి పూర్తిగా పోగొట్టుకొనెను. సంధ్యా దీపము వెలిగించినతోడనే భూపతి ఇప్పుడు ఆత్రతతో ఇంట్లోనికి వచ్చుచున్నాడు. అతడు ఒకటి రెండు ప్రశ్నలు వేయుచుండును. చారు జబాబు చెప్పుచుండును. తరువాత, మాట్లాడుటకు ఏమియుతట్టదు. తన అసమర్థతను చూచి భూపతి భార్య ఎదుట సిగ్గుపడుచుండెను. భార్యతో కబుర్లు చెప్పుకొని కూర్చొనియుండుట వంటి సులభమగు పని మరియొకటి యుండదని అత డనుకొనుచుండెను, కాని తనవంటి మూఢునకు అది బహు కష్టసాధ్యమని యిప్పుడు తెలిసికొన్నాడు—సభలలో ఉపన్యాసము లిచ్చుట ఇంతకంటె మిక్కిలి సులభము!

ఏ సంధ్యాసమయమును హాస్యకౌతుకములతోను ప్రణయాదరములతోను రమణీయముగా చేసికొనగలనని యూహించుచుండెనో ఆసంధ్యాసమయమును గడుపుటనునది ఒక గొప్ప సమస్యరూపము ధరించినది. కొంతసేపు నిశ్శబ్దప్రయత్నముచేసిన పిదప భూపతికి లేచిపోదమని బుద్ధిపుట్టుచుండును. కాని

చారేమైన అనుకొనునేమో యని సందేహించి లేవక కూర్చొనియుండును. "పేకాట ఆడుదమా చారూ?" అని భూపతి అడుగుచుండును. విధిలేక చారు, "ఆడుద"మను చుండును. అనుచు ఇష్టములేకపోయినను పేకదస్తా తెచ్చి ఆట ప్రారంభించుడురు. తప్పాట ఆడి చారు వీగిపోవుచుండును—అట్టి ఆటవల్ల ఎవరికిని ఆనందముండదు.

భూపతి చాలా ఆలోచించి ఆలోచించి చారుతో ఒకనా డన్నాడు— "మందను రమ్మనిన బాగుండునేమో చారూ, నీవు కేవలము ఒంటరిదానవై పోతివి!".

మందాకిని పేరువినగానే చారు మండిపడి, "అక్కరలేదు, మంద నా కవసరము లేదు," అని యన్నది.

భూపతి నవ్వెను—లోలోపల సంతోషించెను. పతివ్రత ధర్మమును పాలించుటలో ఎవరిలో నెట్టిలోటు కనబడినను సాధ్వీమణులు సహించి ఊరుకొనలేరు.

మొదట ద్వేషముకొలది చారు ఆజబొబుచెప్పినది. కాని ఆద్వేషము కొంచెముతగ్గగానే మంద ఉండినయెడల భూపతికి కొంత ఆమోదకరముగ నుండవచ్చునని ఆమెకు తోచినది. తనయొద్దనుండి భూపతి ఏసుఖము నాశించుచున్నాడో ఆసుఖమును తానీయలేదని తెలుసుకొని చారు దుఃఖింపసాగినది. భూపతి బయటిప్రపంచములో సర్వమును విడిచిపెట్టి యావదానందమును కేవలము తనమూలమునను పొందుటకు ఏకాగ్రచిత్తుడై ప్రయత్నించుచున్నాడని తెలియగానే, తన మనో

దైన్యత తానెరుగును గనుక, చారు దిగులుపడ్డది—ఇన్నెన్నాళ్లు జరుగగలదు? ఏదైన మరియొకపని భూపతి ప్రారంభించడేమి? క్రొత్తవార్తాపత్రిక యొకటి మొదలుపెట్టడేలకో! భూపతి చిత్తరంజనకొరకేమియైన చేయుచుండుట చారుకు నేటివరకా వశ్యకముకాలేదు. భూపతి ఆమెనేవ నాశించలేదు. ఎట్టిసుఖము కొరకైన నామెను వేడలేదు. అన్నివిధములను తనకామె ప్రయోజనకరమగునట్లు ఆమెనుచేయుటకు భూపతి నేటివరకు ప్రయత్నించలేదు. ఇప్పుడు హఠాత్తుగ నాకు సర్వమును నీవే యనుట వలన ఏమిచేయవలెనో చారుకు తోచలేదు. భూపతి కోరుచుండినదేమో, దేనితో నతనిని తృప్తిపరుపవచ్చునో, చారుకు బోధపడలేదు. తెలిసినను చారుచేయగలదేమియులేదు, చేయుశక్తి ఆమెలో లేదు.

భూపతి కొంచెము కొంచెముగ ముందుకు నడచినచో చారుకింత కష్టము కలిగియుండదేమో!—కాని ఆతడు ఒక్కరాత్రిలో దివాలాయై వట్టిచేతులు చాచుకొని ఎదుటకు వచ్చి నిలిచెను—చారు కేమియు తోచలేదు.

"సరే రమ్మని మందాకినికి కబురు పంపుము. నీకు సరియైన సంరక్షణ జరుగుటలేదు. ఆమె వచ్చినయెడల కొంత ఉపకారముగనుండు" నని చారు అన్నది.

"నాకొరకా? నాకొర కవసరములేదు," అని భూపతి నవ్వుచు ననెను.

భూపతి సిగ్గుపడి, తనలో రసికతలేదనియు, చారు నెట్లు సుఖపెట్టవలెనో తానెరుగననియు తనలో తాననుకొని దుఃఖించెను.

ఇట్లనుకొని సాహిత్య సాధనలో పడెను. మిత్రులు వచ్చి చూచునప్పుడెల్ల, బైరన్, షెనిసన్, బంకిమ్ మొదలగు కవుల గ్రంథముల మధ్యను కూర్చొనియుండెను. మిత్రు లాశ్చర్యపడి ఈ అకాల కావ్యానురాగమును గురించి పరిహాసము చేసిరి. భూపతి, "వెదురునకూడ పువ్వులు పూయవచ్చును, ఎప్పుడు పూయునో ఎవ్వరును చెప్పలే" రని నవ్వుచు జబాబు చెప్పెను.

ఒకనాడు సాయంకాలము పడకగదిలో పెద్దదీపమొకటి వెలిగించి మొదట సిగ్గుతో తడబడుచు కొంచెమిటునటు తిరిగి, "నీకేదైన చడివి వినిపించెదను చారూ," అని యనెను.

చారు—"వినిపించు."

భూపతి—"ఏమి వినుపించు మనుచున్నావు?"

చారు—"నీకిష్టమైనది."

చారులో నెట్టి ఉత్సాహము లేకపోవుటచే భూపతి చదువుటకు సంకోచించి సంకోచించి, చివరకు, "షెనిసన్‌లోనుండి ఏదైన తర్జుమాచేసి చెప్పెద" నన్నాడు.

చారు చెప్పుమన్నది.

సంకోచమువల్లను, నిరుత్సాహమువల్లను ప్రయత్నము మంటగలసినది. చదువుకేదో అడ్డు పడుచుండెను. సరియైన

మాతృభాషా పదములు తట్టలేదు. చారుశూన్యదృష్టిని చూచి ఆమె మనస్సిచ్చి వినుచుండలేదని భూపతి పోల్చుకొనెను. శాంతితో నిండియున్న ఆసంధ్యయును దీపపుకాంతితోనిండి యున్న ఆగదియు భూపతికి శూన్యముగతోచినవి.

భూపతి మరిరెండు మూడు సార్లు ఇదియేరీతిని ప్రయత్నముచేసి హతాశుడై సాహిత్య సాధన మానెను.

పెద్దదెబ్బ తగిలినతోడనే స్నాయువులు వళిముతప్పుటచే బాధ ఉన్నట్లు మనకు తెలియదు. ఆలాగుననే అమల్ వెళ్లిపోగానే ఆవిచ్ఛేదమువల్ల కలుగవలసినబాధ చారుకు వెంటనే తెలియలేదు. కాని దినములు గడచిన కొలది శూన్యత నలుదిక్కుల వ్యాపింపసాగినది. ఇదిగ్రహించి చారు హతిబుద్ధురాలైనది. కుంజవనమును విడిచి మరుభూమిలోనికి వచ్చిపడినది. రోజులు నడచుచున్నవి. మరుప్రాంతముకూడ నలుదిక్కుల వ్యాపించుచున్నది. ఈ మరుభూమి ఇంతకుపూర్వ మామె ఎరుగదు. నిద్ర లేచినతోడనే ఆమెగుండె గభీమనుచుండును—అమల్ లేడే! వరండామీద కూర్చొని తాంబూలము సరుదుచు, 'వెనుకనుండి అమల్ రాడే,' అని ఉండిఉండి అనుకొనుచుండును. ఒకప్పుడు బీడాలనేకము కట్టినతరువాత అవి తినువారెవ్వరును లేరని జ్ఞప్తికి వచ్చుచుండును. కొట్టుగదిలోనికి వెళ్లినప్పుడెల్ల నే డమల్ ఫలాహారమునకై ఏమియునీయనక్కరలేదని జ్ఞాపకము వచ్చుచుండును. ఓర్చి ఉండలేక మధ్యమధ్య అంతఃపురముదాటి బయటికి రాబోవుచు 'అమల్

నేడు కాలేజినుండి రాడో అని జ్ఞాపకము తెచ్చుకొను చుండును. క్రొత్తపుస్తకములకొరకుగాని క్రొత్తవ్యాసముల కొరకుగాని, క్రొత్తసంగతులకొరకుగాని ఆతించకూడదు. ఎవరి కొరకును క్రొత్తదేదియైన అల్లియుంచ నక్కఱలేదు, క్రొత్త వ్యాసము వ్రాయనక్కరలేదు, క్రొత్తలోకపు వస్తువేదియును కొని యుంచ నవసరములేదు.

భరించరాని తనకష్టమును, కలతను చూచి చారుకే ఆశ్చర్యము కలిగినది. తన మనోవ్యథను చూచి చారు భీతి చెందినది. చారు తనకుతాను ప్రశ్నించుకొన్నది: 'నాకు భరించ రాని బాధ ఇప్పుల కలుగుచున్నది? అమలుకు నాకుగల సంబంధ మేమిటి ఇంత దుఃఖించుటకు? నాకేమి సంభవించినది? నౌకర్లు, దాసీలు, కూలివారు, ముష్టివారు హాయిగా పాడుకొనుచు తిరుగుచున్నారే, నాకేమి సంభవించినది, ఇంతి దుఃఖించుచుండు టకు? నన్నిట్టి విపత్తులో పడవేసితివేల భగవంతుడా!"

చారు మాటిమాటికి తనకుతాను ప్రశ్నించుకొను చుండెను, ఆశ్చర్యపడుచుండెను. కాని సమాధానమేమియును మాత్రము కాకుండెను. అమలుని స్మృతి లోపలను బయటను దుఃఖముతో నింపుచుండుటచే ఎప్పటికైన పాపిపోయినగూడ లాభముండదు.

అమల్ చారుకు స్మరణకురాకుండునట్లు ఏమైన చేయ గలిగినయెడల ఆమె కొంత మరువగలిగియుండునేమో! కాని స్నేహశీలుడైన మూఢభూపతి తానుకూడనా నిచ్ఛేనము

బాధనొందుచుండుటచే మాటమాటకు అమలునే స్మరణకు తెచ్చుచుండెను.

చిట్టచివరకు చారు చుక్కాను వదలుకొని కూర్చున్నది. తనతో తాను పోరాడిపోరాడి అలసి కూలిపడిపోయినది. వీగితినని ఒప్పుకొని తన నిజమైన అవస్థను గ్రహించినది. శ్రద్ధాపూర్వకముగ అమలుని స్మృతిని తనహృదయ మధ్యమున ప్రతిష్ఠితము చేసికొన్నది.

రానురాను ఏకాగ్రచిత్తముతో అమలుని ధ్యానించుచుండుటయే చారు తనలోతాను గర్వపడుచుండుటకు కారణమైనది. ఇట్లు స్మరింపగలుగుటయే ఉత్కృష్టమగు కార్యమని చారుకు తోచినది—దీనివల్లనే తాను గౌరవార్హురాలైనదని ఆమె నమ్మకము.

ఇంటిపనులమధ్య నొకసమయము నేర్పరచుకొన్నది—ఆసమయములో గదితలుపులు మూసుకొని ఏకాంతముగా కూర్చొని అమల్ జీవితములోని ప్రతిచిన్నఘటననుగురించి ధ్యానించుచుండెను. తలగడపై ముఖముక్రిందుగా తలనుంచుకొని 'అమల్' 'అమల్' అని మాటిమాటికి అనుచుండెను. సముద్రముయొక్క అవతలి తీరమునుండి, "ఏమి వదినా?" అని జబాబు వచ్చుచున్నట్లుండెను. తడికళ్లను మూసికొని చారు అడుగుచుండెను—'అమల్, నీవు కోపగించి వెళ్లిపోతివేమి? నేనెట్టి అపరాధమును చేయలేదే. నీవు నవ్వు ముఖముతో సెలవుతీసుకు వెళ్లియుండిన యెడల నాకింత దుఃఖముండకపోను.' అమల్ తన

కళ్లు ఎదుట నిలబడి ఉండినయెడల ఎట్లుమాటాడుచుండునో అట్టి ఉచ్చారణతో మాటలాడుచుండెను—'అమల్ నిన్ను నేనొక్క-నాటికి మరువలేదు. ఒక్క-నాడు మరువలేదు, ఒక నిమిషము మరువలేదు. నాజీవనములోని శ్రేష్ఠ పదార్థము నీమూలమునసే వికాసము పొందినది. నాలోఉండు ఉత్కృష్ట భాగముతో నిన్ను పూజించెదను.'

ఈరీతిని చారు తనఇంటిపనులక్రిందినుండి, తన కర్తవ్యముల క్రిందినుండి, సారంగమొకటి త్రవ్వి, అక్కడి అంధకార నిస్తబ్ధతలో అశ్రుమాలతో అలంకరింపబడ్డ రహస్య మందిరమును నిర్మించి ఉంచుకొన్నది. అక్కడ తనభర్తకుగాని పృథ్వికై నింకెవ్వరికిగాని అధికారములేదు. ఆస్థలము గోపనతమమైనది, గభీరతమమైనది, ప్రియతమమైనది. చారు సంసారములో ధరించిన ఛద్మవేషమును విసర్జించి నిజస్వరూపముతో ఆమందిరమున ప్రవేశించుచుండెను. తిరిగి బయటికివచ్చునప్పుడు మరల వేషమువేసుకొని పృథ్వియను రంగభూమిని ప్రవేశించి అక్కడి హాస పరిహాసములలోను, క్రియాకర్మలలోను పాల్గొనుచుండెను.

చారు ఈవిధముగ తనకు తనమనస్సుతో జరుగుచున్న ద్వంద్వయుద్ధమును ముగించి అంత గొప్పవిషాదమధ్యమున కూడ శాంతిని స్థాపించుకొనెను; భర్తయెడల భక్తిశ్రద్ధలు కలిగి బహునిష్ఠగా గృహకృత్యములను సలుపుచుండెను. భర్త నిద్రించుచున్నప్పుడు అతని పాదములదగ్గరకువచ్చి పాదధూళి

తీసికొని తన నొసటనుంచుకొనుచుండెను. సేవాశుశ్రూషలలోను, గృహకృత్యములలోను భర్తకొరిక లసంపూర్ణముగనుంచునది కాదు. ఆశ్రితుల సంరక్షణలో నెట్టికొరత కల్గినను భర్త దుఃఖించునని యెరిగి ఎట్టిలోటును లేకుండునట్లు చూచుచుండెను. ఇట్లు చేయుచు భర్త ఉచ్ఛిష్ట ప్రసాదమును భుజించుచు ఆమెదినములు గడపుచుండును.

ఈభక్తి సేవల మూలమున భూపతి తిరిగి నవయౌవనమును పొందెను. చారును ఇప్పుడే వివాహమాడినట్లుతనికి తోచుచుండెను. చక్కగ ముస్తాబయి, హాస్యపరిహాసములలో దినమంతయుగడపుచు, దుశ్చింతను మనస్సులో నొకమూలకు త్రోసివేసెను. రోగోపశమనానంతరము ఆకలి వృద్ధియగును, భోగశక్తి వికాసమును అనుభవించగలము. భూపతి మనస్సులో నట్టి ప్రబలమైన అపూర్వ భావావేశము పుట్టినది. స్నేహితులకే కాక చారుకుకూడ తెలియకుండ భూపతి కావ్యగ్రంథములు చదువుట మొదలుపెట్టెను. "వార్తాపత్రిక అంతమైనది, అనేక కష్టములనుభవించితిని—కాని చివరకు నాభార్యను పొందగలిగితిని," అని భూపతి తనలో తానానందించుచుండెను.

"వ్యాసములు మొదలైనవి వ్రాయుట మానివేసితివేమి చారూ?" అని భూపతి చారునొకనా డడిగెను.

చారు—"మహా గొప్పవ్రాత కదూ!"

భూపతి—"నిజము చెప్పుచున్నాను చారూ, నీ అంత చక్కని భాష ఈ నవీనలేఖకులలో ఒక్కరికిని చేతకాదు.

'విశ్వబంధు'లో నీ వ్రాతనుగురించి చేసిన ప్రశంస జ్ఞాపకమున్నదా—నా అభిప్రాయముకూడ నదియే."

చారు—"ఇక చాలించు."

భూపతి, "ఇదిగో చూడు" మనుచు, ఒక 'సరోరుహా' సంచికతీసి చారు అమలుల కవిత్వములను సరిపోల్చసాగెను. చారుముఖ మెర్రచేసికొని పత్రికను భూపతిచేతిలోనుండి లాగుకొని తన చీరచెంగుతో కప్పినది.

జట్టెఱుగని లేనియెడల కవిత్వము బయటికి రాదని భూపతి తనలోతా ననుకొనెను. తానుకూడ వ్రాయుట అభ్యాసము చేసుకొనవలెనని నిశ్చయించెను. అట్లు చేసినయెడల చారులో నుత్సాహము పుట్టునని నమ్మెను.

భూపతి నోటుబుక్కొకటి కొని అతిహాస్యముగ రచనాభ్యాసము చేయుచుండెను. శబ్దకోశము చూచుచు తప్పు పదములను కొట్టి, క్రొత్తపదములను వ్రాసి, వ్రాసినదానిని సాళ్ళు వ్రాయుచుండెను. ఉద్యోగములేని భూపతికి దినములు ఈ విధముగ గడచుచుండెను. ఇంత ప్రయత్నముచేసి కష్టపడి వ్రాయుటచే భూపతికి తన రచనలయెడల ఆదరముకలిగినది, వానిలో నమ్మకము పుట్టినది.

ఒకనాడు తన రచనను వేరొకరి చేతివ్రాతతో వ్రాయించి, చారుచేత పెట్టి ఇట్లనెను—"నామిత్రు డొకడు క్రొత్తగా వ్రాయ నారంభించినాడు, అది నాకేమియు బోధపడదు, నీ వొక్కసారి చదివి చెప్పు, ఆ దెట్లున్నదో."

ఇట్లనుచు ఏదోపనిమిషమైని బయటికి తొందరగ వెళ్లిపోయెను. సరళస్వభావుడైన భూపతి నటన చారు సులభముగ పోల్చుకొన్నది.

చదివినది. వ్రాతథోరణి, విషయము చూచి నవ్వుకొన్నది. ఆహా పాపము! భర్తయెడల భక్తికలిగియుండుటకు చారు ఎంత ప్రయత్నముచేయుచున్నది! అంతకుర్రతరహాగా ఆమె పూజాసామగ్రిని విరచల్లి వేయుచున్నదేమి? చారు వలన మెప్పు పొందవలె నని అతనికి అంత ఆతురత ఎందుకు! చారు మనస్సు నాకర్షించుటకు భూపతి సర్వదా అంతప్రయాస పడకుండినచో చారుకు భర్తను పూజించుట సులభసాధ్యమైయుండును. భూపతి ఏవిషయములోను తనకంటె తక్కువ కాకూడదని చారు మనసార కోరుచుండెను.

చారు పుస్తకమును తలగడక్రిందపెట్టి బాలీసుపై చేరపడి దూరమునకు దృష్టిని ప్రసరించి చాలసేపటివరకు ఆలోచించుచు కూర్చుండెను—అమల్‌కూడ తానువ్రాసిన క్రొత్త వ్యాసములు తెచ్చి ఆమె కిచ్చుచుండెను.

సాయంకాలము భూపతి పడకగది వరండాపైనున్న తొట్టెలలోని మొక్కలను తనికీచేయుచుండెను. ఉత్సుకుడైయున్నను తనవ్రాతనుగురించి చారునుప్రశ్నించుటకు సాహసించలేదు.

"అది నీ స్నేహితుని మొదటి వ్యాసమా?" అని చారు తానే అడిగినది.

"ఔను" అన్నాడు భూపతి.

చారు—"చాల చక్కగానున్నది. ఎవ్వరును ప్రథమ వ్యాస మనుకొనరు."

విని భూపతి మిక్కిలి ఆనందించెను—బినామీ కవిత్వ ముసు తనవ్యాసముగ మార్చుటకుపాయమేమి. యని ఆలో చింపసాగెను.

భూపతి నోటుబుక్కు అతిత్వరగా నిండిపోవ నారం భించినది. వ్యాస లేఖరివేరు బయలుపడుటకుకూడ నాలస్యము కాలేదు.

విదేశమునుండి టపావచ్చుదినము చారు సదా గుర్తు పెట్టుకొనుచుండెను. మొట్టమొదట వీడెక్కనుండి ఉత్తరము వచ్చినది, దానిలో అమల్ వదినకు ప్రణామములు తెలియ చేసెను. సూయెజ్ నుండికూడ జాబువచ్చినది. దానిలోకూడ అమల్ వదినకు ప్రణామము లర్పించెను. మాల్టానుండి తరు వాత జాబువచ్చినది. దానిలోకూడ వదినకు ప్రణామము లుండెను.

చారువేరను ఒకయుత్తరమైన రాలేదు. భూపతివేరను వచ్చిన యుత్తరములు తీసి ఇటునుండి అటు అటునుండి ఇటు త్రిప్పిచూచి రెండుమూడుసార్లు చదివినది—ప్రణామములు తెల్పుటతప్ప తన సంగతి వేమియు లేనేలేదు.

చారు ఈకొద్దిరోజులు దుఃఖముతో కూడిన శాంతినీడను ఆశ్రయముగా చేసికొని యుండెను. అమల్ కనపరచిన ఉపేక్ష

ఆనీడను చెదరగొట్టినది. లోపల హృత్పిండమునెవరో ఇటునటు పీకిచీల్చుచున్నట్టా మెకు తోచుచుండెను. ఆమె సంసార కర్తవ్యములలో మరల భూకంప మారంభమైనది.

ఆరోజులలో ఒకొకనాడు భూపతి అర్ధరాత్రివేళను లేచి చూచునప్పటికి చారు మంచముపై నుండునదికాదు. ఒకనాడు వెదుకగా వెదుకగా దక్షిణపుగది కిటికిలో కనబడ్డది. భూపతి కనబడగానే లేచి, "గదిలో అతిడుక్కగా ఉండెను, కొంచెము గాలితగులునేమోయని వచ్చి కూర్చొంటిని," అనియన్నది.

భూపతి గాబరాపడి గదిలో మిాదనొక పంకాకట్టించి దానిని లాగించు ఏర్పాటుచేయించెను. ఆమె ఆరోగ్యముచెడునేమో అని భయపడి సదా ఆమెపై దృష్టినుంచెను. చారు నవ్వుచు, "నీవెందుకు గాబరాపడుచున్నావు, నేను హాయిగానున్నా" ననుచుండెను.

తనగుండెలోనున్న బలమంతయు ప్రయోగించుటవలన గాని ఆనవ్వు నవ్వలేక పోయినది.

అమల్ వెళ్లి విదేశముచేరెను. దారిలోనున్న న్నాళ్లు తనకు ప్రత్యేకముగా జాబు వ్రాయుటకు అమల్‌కు వీలుండదు కాని విదేశముచేరిన తరువాత తనపేరను పెద్దజాబు తప్పక వ్రాయునని చారు నమ్మినది. కాని ఆపెద్దఉత్తరము రాలేదు.

విదేశిటపారావలసిన దినమున ఆమెచేయుపనులన్నిటి నడుమను అమల్ ఉత్తరమునూట అనుకొనుచు ఆమె ప్రాణములు కొట్టుకొనుచుండెను. భూపతిని అడిగినయెడల నీపేరను

ఉత్తరము లేదని చెప్పనేమో యని జడిసి అతనిని అడుగ లేకుండెను.

ఆమె ఈ యవస్థలోనుండ విదేశపుపోస్టు రావలసియున్న దినమున నొకనాడు భూపతి మెల్లగ చారుయొద్దకు వచ్చి, "మంచివస్తు వొకటియున్నది చూచెదవా ?" అని యడిగెను.

చారు మిక్కిలి ఆత్రతతో "ఏదీ ?" అని యడిగెను.

భూపతి పరిహాసమాడబోయి చూపించుట కిష్టము లేనట్లు నటించెను.

చారు ఓర్చియుండలేక భూపతి కండువాలోనుండి ఆ వస్తువును తీసికొన ప్రయత్నించినది. "నేడు ఉదయమునుండి నాపేరను ఉత్తరము వచ్చునని నామనస్సు చెప్పుచున్నది.— అదెన్నటికి నిష్ఫలము కానేరదు," అని చారు తనలో తానను కొన్నది.

చారుతో పరిహాసము చేయవలెనను ఇచ్ఛ భూపతి మనస్సులో ప్రబలమైనది. అతడు చారుకు దొరకక యుండునట్లు నవ్వుచు మంచముచుట్టు పరుగెత్త సాగెను.

చారు చీకాకుపడుచు మంచముపై కూలబడి కన్నులు తడిచేసుకొనెను.

చారు ఇంత ఆత్రతగానుండుట చూచి భూపతి కొంచె మానందించి, కండువాలోనుండి తనరచనలతో నింపిన నోటు బుక్కును చారు ఒడిలో వేయుచు, "కోపగించకుము, చారూ, ఇదిగో తీసికొనుము," అని యనెను.

చదువు తొందరచే తరచుఉత్తరములు వ్రాయజాలనని అమల్ తెలియచేసినప్పటికిని రెండువారములు అతనిదగ్గరనుండి జాబు రాకపోగానే చారుకు సంసారము కంటకశయ్య యైనది.

ఆనాటి సాయంకాలము నానారకముల మాటల మధ్యను అతినిర్లక్ష్యముగా అనుచున్నట్లు, "ఇదిగో చూడు, సీమకు ఒకటెలిగ్రామ్ పంపించి కనుగొనుట మంచిది కాదా, అమల్ ఎట్లున్నాడో?" అని చారు అనెను.

"రెండువారముల క్రితమే ఉత్తరము వచ్చినది, చదువు తొందరలో ఉన్నాడు," అని భూపతి అనెను.

చారు—"అయితే మరివీల? విదేశములో ఒంటరిగా నున్నాడు, ఏమైన జబ్బుచేసినదేమో అని అన్నాను—జబ్బు చేయవచ్చును కదా!"

భూపతి—"జబ్బుచేసినయెడల మనకు తెలిసియుండును-టెలిగ్రామ్ ఖర్చుకూడ ఈమాత్రమాత్రము కాదు."

చారు—"అట్లాగునా? మహాఅయితే రూపాయి రెండు రూపాయిలకధికము కాదనుకొంటిని."

భూపతి— "అదేమి— నూరురూపాయిలకు తక్కువ కాదు!"

చారు—అట్టిన పంపుట అసంభవము."

మరి నాలుగు రోజులుగడచిన పిమ్మట చారు భూపతితో మాచెల్లిగారి గ్రామమునకు వెళ్లి ఆమె ఎట్లున్నదో చూచి రాగలవా అని యడిగినది.

భూపతి—"ఏమి? చెల్లెలికి ఏమైన జబ్బుచేసినదా?"

చారు—"జబ్బుచేయలేదు, కాని నీవొకమారు వెళ్లిన యెడల నామె ఎంతో సంతోషించును—అది నీవెరుగనే ఎరుగుదువు."

చారు కోరికప్రకారము భూపతి గుర్రపుగాడీ తెప్పించుకొని హౌడాస్టేషన్‌కు బయలుదేరెను. దారిలో ఎడ్లబళ్లవరస అడ్డుగ వచ్చుటచే తనగాడీ నిలిచిపోయినది.

అంతలో భూపతినిఎరిగిన టెలిగ్రాఫ్ బంట్రోతొకడు అతనిచేతిలో నొక టెలిగ్రామును పెట్టెను. విదేశమునుండి వచ్చిన టెలిగ్రామును చూడగానే భూపతికి భయముపుట్టినది—అమల్‌ను జబ్బుచేసినదేమోయని దిగులు పడుచు కవరు విప్పెను—"నేను బాగానే ఉన్నాను," అను మాటలు అందులోనున్నవి—అది అమల్ పంపిన టెలిగ్రామ్.

దీని అర్థమేమి యని భూపతి ఆలోచించెను—పరీక్షచేసి చూడగా, తిరుగుజబాబుకు చార్జీ ముందు కట్టిపంపిన టెలిగ్రామ్‌కు అది జబాబు అని బోధపడ్డది.

హౌడా వెళ్లుట జరగలేదు. ఇంటికి తిరిగివచ్చి చారు చేతిలో ఆటెలిగ్రామ్ పెట్టెను. అతనిచేతిలో టెలిగ్రామ్ కనబడగానే చారు ముఖము తెల్లపారిపోయినది.

"దీని అర్థము తెలియలే"దన్నాడు భూపతి. కాని కొంత చర్చచేయగా అర్థము బోధపడ్డది. చారు నగయొకటి తాకట్టు పెట్టి రూపాయలు అప్పుచేసి టెలిగ్రామ్ పంపినది.

'ఇట్లుచేయుట కవసరమేమి వచ్చినది?' అని భూపతి తనలో తా నాలోచించసాగెను. 'నన్ను అడిగియుండినయెడల నేనే టెలిగ్రామ్ పంపియుందునే—నౌకరును పంపించి రహస్యముగా నగతాకట్టుపెట్టి రూపాయిలు తెప్పించి ఈపని చేయుట మంచిది కాదే!'

'చారిట్లు చేసినదేల?' అను ప్రశ్న భూపతి మనస్సులోనికి మాటి మాటికి వచ్చుచుండెను. ఒక అస్పష్ట సందేహమతనిని బాధించుట మొదలుపెట్టినది. ఆ సందేహమును స్పష్టముగ పరిశీలించిచూచుట కతనికి ఇష్టము లేకపోయినది. దానిని మరువ ప్రయత్నించుచుండెను, కాని ఎంత ప్రయత్నించినను బాధ మనస్సును విడువలేదు.

అమల్ ఒంట్లో బాగున్నది, ఐనను జాబువ్రాయలేదు. ఇంత దారుణమైన విచ్ఛేదము ఎట్లు సంభవించ గలిగినది? అతని కళ్లెదుట నిలుచొని ఆప్రశ్ననోటితో అడగవలెనని చారుకు బుద్ధి పుట్టుచుండెను. కాని మధ్యను సముద్రమున్న దేది—దాటి వెళ్లుటకు ఉపాయములేదే! ఎంత క్రూరమైన దా విచ్ఛేదము! సకలప్రశ్నలకు, అన్నివిధముల ప్రతీకారమునకు అతీతమైన విచ్ఛేదము!

చారు తనమనస్సును అధీనములో మరి ఉంచుకొనలేక పోయినది. ఎక్కడిపను లక్కడనే ఉండిపోవుచుండెను. ఒక్క పనియైన తిన్నగ చేయలేకుండెను. సదా నిర్లక్ష్యముగను, పర

ధ్యానముగను ఉండుటచూచి అందరు గుసగుసలాడుచుండిరి; ఏమి నామెకు చైతన్యమే కలుగలేదు.

ఉండిఉండి ఆమె హఠాత్తుగ ఉలికిపడుచుండెను; మాట లాడుచు మాటలాడుచు లేచి లోనికిపోయి ఏడ్చుచుండెను; అమల్ పేరు వినగానే ఆమె ముఖము విషణ్ణమగు చుండెను.

చివరకు భూపతి సమస్తమును బోధపరచుకొనెను; ఊహించకూడనిది కూడ తుదకూహింప వలసివచ్చెను. సంసారము సారహీనమైన ముసలి వస్తువై పోయినది.

భూపతి ఈనడుమ కొద్దిరోజులు ఆనందమువలన అంధుడై యుండెను. ఆదినములమాట జ్ఞాపకముతెచ్చుకొని ఇప్పుడు సిగ్గుపడసాగెను. వజ్రమెరుగని కోతికి మాయవజ్రమిచ్చి ఇట్లు మోసపుచ్చవచ్చునా? చాపుమాటలు, ఆమె పనులు, ఆమె ప్రేమ—ఏవేవి భూపతిని భ్రమపెట్టుచుండెనో, అవియన్నియు ఇప్పుడతనికి, 'మూఢుడా మూఢుడా మూఢుడా,' అనుచు బెత్తెడెబ్బలు కొట్టుచుండెను.

చివరకు ఈనంత కష్టపడి అంతశ్రద్ధతో రచించిన వ్యాసములు పద్యములమాట జ్ఞప్తికిరాగానే, భూపతి భూదేవిని ప్రార్థించెను—"నీవు కడుపు చీల్చుకొని నన్ను నీలో దాచుకొనుము తల్లీ," అని అంకుళముచే కొట్టబడుచున్న వాని వలె చారుదగ్గరకు పరుగెత్తిపోయి, "నా వ్యాసములేవీ?" అని యడిగెను.

చారు, "అవినా దగ్గరనే ఉన్నవి," అని యన్నది.

భూపతి, వానినిమ్మని యనెను.

చారు, భూపతికొరకు కచోడీలు వేయించుచు, "ఇప్పుడే కావలెనా?" అని యడిగినది.

"ఇప్పుడే కావలెను," అన్నాడు భూపతి.

చారు పొయ్యిమీదినుండి మూకుడును దింపి బీరువా తెరచి నోటుబుక్కును తీసి ఇచ్చినది.

భూపతి దానిని తొందర తొందరగా ఆమెచేతిలోనుండి లాగుకొని పొయ్యిలోనికి విసిరెను.

చారు కంగారుపడి, "అది ఏమిరా!" అనుచు దానిని బయటికి లాగబోయినది.

భూపతి, "వద్దువద్దు," అని గర్జించుచు చారుచేయి పట్టుకొనెను.

చారు నిశ్చాంతపోయి చూచుచు నిలుచుండెను—కాగితములన్నియు కాలి భస్మమైపోయినవి.

చారు బోధపరచుకొన్నది; పెద్దనిట్టూర్పు విడిచినది; కచోడీ వేయించుట పూర్తికాలేదు, ఆమె మెల్లమెల్లగ ఇంకొక చోటికి వెళ్లిపోయినది.

చారు కన్నులయెదుట పుస్తకము కాల్చవలెనని భూపతి యుద్దేశించలేదు. ఐనను తన ఎదుటనే కాలుచుండెను, అది

పెట్టినది. అతడు మనస్సును ఆణచియుంచుకొనలేకపోయెను. వంచింపబడిన మూఢభూపతి వంచకురాలి యెదుటనే తన ప్రయాస ఫలమును మంటలో కలిపెను.

అంతయు బూడిదయైనది. అతనిలో ఆకస్మాత్తుగ పుట్టిన ఉన్మాదము శాంతించగానే, చారు తన అపరాధభారమును మోసుకొని, విచారముతో తలవాల్చుకొని, వెళ్లిపోవుటచూడగానే భూపతికి తెలివివచ్చినది. భూపతి తలయెత్తి చూచెను—తనకు మిక్కిలి ఇష్టమని తలచి చారు స్వహస్తములతో తన కొరకు బహుశ్రద్ధగా ఫలహారము తయారు చేయుచుండెను.

భూపతి వరండాజాలుపై చేయిమోపి నిలుచొని తనలో తా నిట్లనుకొనుచుండెను—"చారు నా కొరకు ఎడతెరిపిలేక శ్రమపడుచున్నది. అతిజాగ్రతగా మోసముచేయ ప్రయత్నించుచున్నది—లోకములో ఇంతకంటె జాలిపడదగిన యవస్థ యేదియు నుండదు. ఈ మోసము కేవలము ఛలనాకారిణి యొక్క నీచకృత్యము మాత్రమే కాదు. ఆ నటన నటనకారిణి విషితహృదయముయొక్క బాధను నాలుగింతలు చేయుచుండును, ఆ అభాగ్యురాలు తన గుండెకాయను పిండిరక్తము నిచ్చుచుండును. ఓ అభాగ్యురాలా, ఓ దుఃఖినీ! ఇదియేమియు నా కవసరములేదే! ఇన్నాళ్లు నీప్రేమ నాకు దొరకక పోయినను దొరకలేదనికూడ నేను పోల్చుకొనలేక పోతిని. వ్యాధులు దిద్దుట, వ్యాసములు వ్రాయుటలోనే నా దినములు గడచి

పోయినవి—నాకొర కివియంతయు చేయుచుండుట కేవల మనవసరము !”

పిమ్మట, డాక్టరు రోగిని ఏవిధముగా, ఎటువంటి సంపర్కమును లేనివానివలె, హృదయసునకు దూరముననుంచి పరీక్ష చేయునో, భూపతి అదేరీతిని చారును పరీక్ష చేసెను. చూశక్తి లేని ఇల్లాలిహృదయము ప్రపంచముచే నలుదిక్కులనుండి ఆక్రమణచేయబడినది. తాను చెప్పకోరినదంతయు చెప్పవలెనన్న మిత్రుడొక్కడైన లేడు. చెప్పగలిగిన మాటలేదు. హృదయమును వంపి బరువు తగ్గించుకొనగల స్థానము లేదు. ఆమె అవ్యక్తదుఃఖము, తప్పించుకొనజాలనిది, నివారింపజాలనిది. రోజురోజుకు పెరుగుచుండు ఆ దుఃఖమును భరించుచు హాయిగా కాలము గడుపుచుండు ఇరుగుపొరుగుల వారివలె తనకును దుఃఖమేమియు లేనట్లు నటించుచు గృహకృత్యములు చేయుచుండవలెను.

భూపతి తన పడకగదిలోనికి వచ్చిచూచెను. కిటికీ కమ్ములు పట్టుకొని చారు బయటికి రెప్పపాటులేక చూచుచున్నది—కంట నీరులేదు. భూపతి మెల్లగ నామె దగ్గరకు వచ్చి నిలబడెను—ఏమియు ననలేదు—ఆమె తలపై చేయి యుంచెను.

“ఏమి సమాచారము ? ఆ సందడి ఏమిటి ?” అని భూపతిని మిత్రులడిగిరి.

"వార్తాపత్రిక—"

"ఇల్లువాకలి వార్తాపత్రికలో చుట్టపెట్టి గంగలో ముంచివేయవలెనా నీ సంకల్పము?"

"ఈసారి పత్రిక నేను పెట్టుటలేదు."

"అట్లైన పెట్టువారెవరు?"

భూపతి—"మైసూరులో ఎవరో ఒక క్రొత్తపత్రికను స్థాపించుచున్నారు, నేను దానికి సంపాదకునిగావెళ్లుచున్నాను."

"ఇల్లు విడిచి మైసూరు వెళ్లిపోవుచున్నావా? చారు కూడ నీతో వచ్చును కదా!"

"చారు ఇక్కడనే ఉండును—మేనమామ వచ్చి ఆమెతో నిక్కడ నుందురు."

"పత్రిక - వ్యసనము నిన్నింకా వదలలేదు!"

"ప్రతివానికి నేదోయొక వ్యసన ముండవలెను—కదా!"

వెళ్లిపోబోవునప్పుడు చారు, "తిరిగి యెప్పుడు వచ్చెద" వని యడిగినది.

భూపతి—"ఒంటరిగా నుండుట నీ కెప్పుడు కష్టముగా తోచునో నాపేరను వ్రాయుము—నీవెప్పుడు రమ్మనెదవో అప్పుడే వచ్చెదను."

భూపతి సెలవుతీసికొని వెళ్లిపోవుచు ద్వారముకడకు వచ్చునప్పటికి చారు వెనుకనుండి పరుగెత్తివచ్చి అతనిచేయి

గట్టిగా పట్టుకొని, "నన్ను నీతో తీసికొని పొమ్ము, నన్నొంటరిగా ఇక్కడ విడిచిపెట్టకుము," అని యన్నది.

భూపతి ఆశ్చర్యపడుచు చారు ముఖముపంక చూచుచు నిలుచుండెను. చారుచేయి వదలించుకొని భూపతి వరండాపైకి వచ్చి నిలిచెను.

అమలుని విచ్ఛేదస్మృతి ఆ యింటిని చుట్టడించి తగుల బెట్టుచుండెననియు, దవానలము మధ్యను చిక్కుకొన్న హరిణివలె చారీ యింట బాధచెందుచుండవచ్చుననియు భూపతికి తట్టినది. 'చారు తనమాటయే ఆలోచించుచుండెను గాని నా మాట ఆలోచించలేదే' అని భూపతి తనలో తా ననుకొనెను. నాకు పారిపోవుటకు తావేది? సదా పరుని ధ్యానించుచున్న భార్యను విదేశమునకు పోయికూడ మరచుటకు నా కవకాశమీయ నక్కరలేదా? బంధుమిత్రహీన నిర్జన విదేశమునకూడ ఈమె నా దగ్గరనే ఉండవలెనా? దినమంతయు కష్టపడి పనిచేసి ఇంటికి తిరిగివచ్చి దుఃఖించుచు నిశ్చలముగ పడియున్న భార్యతో సాయంకాలము గడుపుచుండుట ఎంత బాధకరమగు బ్రతుకు! హృదయములో మృతభారమును మోయుచున్న భార్యను నాగుండెదగ్గర నుంచుకొని నే నెన్నాళ్లుండగలను? ఇంక నెన్నాళ్లీ విధముగ నేను బ్రతికి యుండవలెనో కదా! విరిగి కూలిపడిన ఇంటి కర్రముక్కలను, ఇటుకముక్కలనైనను, విడిచిపెట్టి పోవుటకు వీలులేదా? వానినికూడ భుజముపై నుంచుకొని తిరుగుచుండవలెనా?

భూపతి తిరిగి లోనికి వచ్చి, "నిన్ను తీసికొని పోలే"నని చెప్పెను.

రెప్పపాటులో చారుముఖములోని రక్తము మాయమయి ముఖము తెల్లపారినది. చేతితో మంచముకోడును గట్టిగా పట్టుకొన్నది.

ఆమెసుచూచి భూపతి తత్తఱమే, "నాతో పద, చారూ," అని అన్నాడు.

"వద్దు, అవసరము లేదు," అన్నది చారు.

vaaradhionline.com

ప్రతీకారము

పూర్వము ముకుంద బాబుగారి దివాకాగాసుండిన గౌరీ కాంతుని మనుమరాలు ఇప్పటి మేనేజరుగారి భార్య. జమీం దారుగారి దౌహిత్రివివాహమునకు వారి ఆచారానుసారము 'వధువు-విందు' అను విందుజరిగినది. విందునాడు ఇంద్రాణీ జమీందారుగారి యింటికివచ్చినది. కాని ఆ వచ్చిన ముహూ ర్తము మంచిదికాదు.

వెనుకటి కథ తెలిసినయెడల రాబోవునది స్పష్టముగ బోధపడును, కనుక వెనుకటి కథ కొంచెము వినవలము.

కాలదేవుని ఆజ్ఞయగుటచే ముకుంద బాబు అతని దివాకా గౌరీకాంతులలో ఒక్కడును స్వస్థలమునగాని స్వశరీరమునగాని లేడు, కాని ఉన్నంతకాలము వారు అపరిమితమైత్రి కలిగియుం డిరి. గౌరీకాంతుని తలిదండ్రులు చిన్ననాడే చనిపోయిరి; అతని ముఖముచూచినతోడనే ముకుంద బాబుకు అతనిపై నమ్మకము కలిగి తనకున్న స్వల్పఆస్తికి అతనిని మేనేజరుగా నియమించెను. గౌరీకాంతుని నమ్మటలో ముకుంద బాబు పొరపాటుపడలేదని రానురాను స్పష్టమైనది. చెదపురుగులు మెల్లమెల్లగ కట్టుకొని వచ్చి పెద్దపుట్టను తయారుచేయురీతిని, స్వర్గమునుకోరువాడు పుణ్యమును కూడబెట్టురీతిని, గౌరీకాంతుడు విసుగువిరామము

లేక రాత్రింబగళ్లు శ్రమపడి యజమానుని ఆస్తిపెంపొందించెను. చివరకు తనతెలివితేటలను ప్రయోగించి ప్రక్కనుండు బాక్రా గాడియను పరగణాను చాలతక్కువవెలకు కొని యజమానుని యాస్తిలో కలిపెనప్పటినుండి, ముకుందలాల్ బాబుగారు గొప్ప జమిందారులలో నొకరుగా పరిగణింపబడసాగిరి. ప్రభువుని యున్నతితోపాటు భృత్యునకుకూడ ఉన్నతికలిగినది. గౌరీ కాంతుడు క్రమముగా పెద్దమేడకట్టించుకొనెను. పాడిపంటల తోను, పండుగపర్వములతోను ఇల్లు సదా కలకలలాడుచుండెను. తహసీల్‌దారుగా ప్రవేశించిన గౌరీకాంతుని ఇప్పుడందరును దివాణజీ అని పిలుచుచుండిరి.

ఇది పూర్వపు చరిత్ర.

ఇప్పటి జమిందారు ముకుందబాబుగారి పోష్య పుత్రుడు - వినోదవిహారి. జమిందారుగారికి మేనేజరుగానున్న వాడు గౌరీకాంతుని మనుమరాలిభర్త అంబికాచరణుడు. ఉన్నతవిద్యనభ్యసించి మంచిశిక్షణముపొందినవాడు. దివాణజీకి తనకుమారుడు రామకాంతునిలో నమ్మకముచాలక, ముసలి వయస్సున పనివిడిచిపెట్టవలసివచ్చినప్పుడు తనమనుమరాలిభర్త యగు అంబికకు తనపని అప్పచెప్పెను.

అన్నివిషయములలో జమిందారివ్యవహారములు పూర్వముమాదిరియే జరుగుచున్నను, ఒకచిన్నవిషయములో మాత్రము భేదము కనపడుచుండెను. పూర్వమువలెకాక ఇప్పుడు ప్రభుభృత్యులకుగల సంపర్కము కేవలము జమిం

దారి పనులతోసంబంధించిన సంపర్కముమాత్రమే, హృదయ సంపర్కముకాదు. పూర్వము డబ్బు చొక్కగానుండెను. డబ్బుతోపాటు అనురాగముకూడ సులభసాధ్యముగానుండెను. ఇప్పుడు డబ్బువెల అధికమయిపోయినది. దానితోపాటు హృదయములోపుట్టుఅనురాగముకూడ అరుదైనదని అందరునెరిగినదే. బహుసన్నిహితులయెడలనే అనురాగములేని ఇప్పుడు వారికి పరులయెడల అనురాగమెట్లుండగలదు?

ఇట్టి పరిస్థితులలో జమీందారుగారియింట జరుగబోవు వివాహసంబంధమున నేడు విందుజరుగుచున్నది. జమీందారుగారి మనుమరాలికి పెళ్లి. దివాణిగారి మనుమరాలు, ఇంద్రాణి జమీందారుగారియింటికి విందుకువచ్చినది. మానవప్రపంచమ బహువింతయగుస్థలము, భగవంతుని రసాయనిక పరీక్షశాల వింతవింత చరిత్రలుగల మానవులందరు ఒక్కచోటగుంపుగూ తమతమ చిత్రవిచిత్రజీవితములతో వారుఅక్కడ నిర్మించుచున్న అపూర్వమైన ఇతిహాసములకు అంతులేదు.

ఈ పెళ్లివిందునాటి ఆనందకార్యములో తోడ్పడి వారిలో రెండు తరహాలమనుష్యులు, అవిరామముగ అల్లబడు చున్న మానవజీవితజాలమున, ఒక క్రొత్తగ్రంధిని కల్పించిరి

అందరిభోజనములు ముగిసినకొంతసేపటికి ఇంద్రాణి జమీందారుగారి యింటికివచ్చినది. వినోదునిభార్య, నయనతారా అంత ఆలస్యముగ వచ్చుటకు కారణమేమని ఇంద్రాణినిఅడుగగా, ఇంటిపనులతోందర, దేహాస్వస్థత మొదలగు మూడు

నాలుగు కారణములుచెప్పినది. కాని అవి నిజమైనకారణములు కాకపోవుటచే విని ఎవ్వరును సంతోషించలేదు.

ఇంద్రాణి తననోటితో చెప్పకపోయినను నిజ మందరు నెరిగినదే— ముకుంద బాబుగారు ప్రభువులు, ధనవంతులు— నిజమే. కాని కులగౌరవమునుబట్టిచూచినచో గౌరీకాంతునిది ఉచ్చస్థానము. తమది యున్నతస్థానమని ఇంద్రాణి ఎన్నడును మరువలేదు. వేళకువచ్చినచో ప్రభువులయింట భోజనము చేయవలసి వచ్చునేమోయను భయమే ఇంద్రాణి ఆలస్యముగా వచ్చుటకు కారణము. ఆమెయుద్దేశము పోల్చుకొని జమీందారుగారిభార్య ఆమెను భోజనముచేయుమని బలవంతపరచినది, కాని సులభముగ లొంగవలసినదికాదు ఇంద్రాణి, ఎన్నివిధములప్రయత్నించినను ఆమెచే భోజనముచేయించలేకపోయినది.

ఈ కులగర్వమునుగురించియే ముకుంద బాబుగారికిని గౌరీకాంతునికిని వెనుకనొకమారు ఘోరమైనవాదముజరిగినది- ఆవాదమునుగురించి ఇక్కడకొంచెము చెప్పవలసియున్నది.

ఇంద్రాణి అతిరూపవతి. రూపవతులను చలనములేని మెరుపుతో సరిపోల్చిచూచుట మనదేశసంప్రదాయము. ఆ వర్ణన సాధారణముగా నిజముకాదు, కాని ఇంద్రాణిని మెరుపుతో సరిపోల్చివర్ణించుట అతిశయోక్తికానేరదు. ప్రబలవేగముగను, మహోజ్వలకాంతిని ఇంద్రాణి తన నిశ్చలగాంభీర్యములో అతిసునాయాసముగా కట్టిపెట్టిఉంచినట్లు చూచువారికి

స్పష్టముగుచుండును. మెరుపు ఆమె ముఖములోను, కన్నుల లోను, సర్వాంగములయందును నిశ్చలమయి సదా నిలిచి యుండునవి—దాని సహజ చపలతకు ఇక్కడ తావులేదు.

ఆమెచక్కదనమునుచూచి ముకుందబాబు ఆమెను తన పోష్యపుత్రునికి ఇచ్చి పెండ్లిచేయుమని గౌరికాంతునితో ప్రస్తావించెను. ప్రభుభక్తిలో గౌరికాంతుని మించినవాడులేడు. ప్రభువుకొరకు ప్రాణమునైన నీయగలవాడు. గౌరికాంతు డిప్పుడు ఐశ్వర్యవంతుడు, తానేదికోరినను ప్రభువు నెరవేర్చుచుండెను. ఐనను అతనికి ప్రభువునెడలగలభక్తి లేమాత్రమును తగ్గలేదు. ప్రభువునుగురించి సమక్షమునగాని పరోక్షమునగాని వినయముతో మాటలాడుచుండును. అతనియెడల వాస్తవమైన భక్తికలిగియుండెను. కాని ఈ వివాహమున కెంతమాత్రము సమ్మతింపలేదు. ప్రభుభక్తిని అణాపైసలతో చెల్లించుచుండువాడు. అదేవిధముగా తన కులమునకుగల మర్యాదనుకూడ రాబట్టుకొన కోరుచుండెను. కనుకనే ముకుందబాబుగారి కుమారునకు తన మనుమరాలిని ఈయనన్నాడు.

భృత్యుని ఈ కులగర్వము ముకుందబాబుకు అసంతుష్టి కలిగించినది. ఈ ప్రస్తావముద్వారా తనభక్తునియెడల తనకుగల ప్రసన్నతను వ్యక్తపరుపనాశించెను. గౌరికాంతుడట్లు తలచక పోవుట చూచి ముకుందబాబు గౌరికాంతునితో కొన్నాళ్లు మాటలాడుటమాని అతని మనస్సుకు బాధకల్గించెను. ప్రభువుని విముఖత గౌరికాంతుని హృదయమును మృత్యుశైల్యవలె

పొడుచుచుండెను. ఐనను మనుమరాలిని తలిదండ్రులులేని ఒక దరిద్రకులీనునకిచ్చి పెండ్లిచేసి, కుర్రవానిని తన యింటనేఉంచుకొని అతనికి తనడబ్బుతో చదువుచెప్పించెను.

నేడు ప్రభువులయింటికివచ్చి భోజనముచేయనన్నది. ఈమె ఆ కులగర్వితుడగు తాతగారి మనుమరాలే! ఇదిచూచి ప్రభుపత్నియగు నయనతారహృదయము ప్రేమతో నిండలేదని చెప్పుట అనవసరము. నయనతారహృదయము అసూయతో నిండియుండుటచే ఇంద్రాణి ప్రతివిషయములో తన నవమాన పరచుచున్నదని ఆమెకు తోచుచుండెను.

ఇంద్రాణి మొదటి యపరాధము—ఆమె చక్కగా మస్తాబయి ఒంటినిండ నగలతోవచ్చినది. ఇంత యాడంబర ముగావచ్చి తాను యజమానురాలితో సమానురాలని చాటిం చుటకు అవసరమేమివచ్చినది?

రెండవ అపరాధము—ఇంద్రాణి సౌందర్యగర్వము—ఇంద్రాణి అపురూప రూపవతి, దానికేమియు సందేహములేదు. తక్కువ పదవిలోనుండువారికి అంతరూపు అనవసరము కావచ్చును, వారికా రూపుండుట అన్యాయము కావచ్చును—కాని రూపునుచూచుకొని ఇంద్రాణి గర్వించుచున్నదనుట కేవలము యజమానురాలి భ్రమ. అందమొక అపరాధముకాదు. అందకత్తెయని మన మెవరినైన నిందించవూనుకొనినచో సౌందర్యగర్వదోషము ఆమెపై మోపకమానము.

మూడవది ఆమెడంబము. ఆమెలో ఒకవిధమైన స్వాభావికగాంభీర్యముండెను. ఎంతోపరిచయముండువారితోతప్ప ఒళ్లు రాసుకొని తిరుగునదికాదు. ఇంతేకాక ఏదోపనికల్పించుకొని అందరిదగ్గరకువచ్చి కేకలువేయుచు వారిచేయుపనులలో దూరు స్వభావము కాదామెది.

ఈ విధముగా కొన్ని సమూలకమైనకారణములచేతను, కొన్ని అమూలకకారణములచేతను నయనతార మండిపడు చుండెను. ఇంద్రాణికి సిగ్గుతెప్పించకోరి ఆమెను సూచించుచు, "ఈమె మా మేనేజరుగారిభార్య" అని, "మా దివాకర్‌గారి మనుమరాలు" అని నయనతార అనవసరముగ మాటిమాటికి నలుగురితో ననుచుండెను. యజమానురాలు పురికొల్పగా పేలుపుగాయయగు ప్రియదాసియొకతె అతిచనువుగా ఇంద్రాణి పైపడి, ఆమె నగలను పొగుడుచు, కంఠెను బాజుబందులను చేతితో పట్టుకొని, "అక్కా— ఇది గిల్టువేచా?" అని అడిగినది. ఇంద్రాణి చీకాకుపడక బహుశాంతముతో, "కావమ్మా, ఇత్త డివి," అనియన్నది.

నయనతార ఇంద్రాణిని పిలిచి, "ఇదగో చూడు, అక్కడ ఒక్కతెవే నిలుచొని ఏమిచేయుచున్నావు, ఈ ఫలాహారముల ప్లేటులు ఆ పల్లకీలో పెట్టిరమ్ము," అని అన్నది—ఆ దగ్గరనే ఒకదాసికూడ నిలిచియుండెను. ఇంద్రాణి దట్టమైన కనుబొమ్మల ఛాయలోనుండి తనడుదారదృష్టితో ఒక్కనిమిషముపాటు

నయనతారముఖమును చూచి, ఏమియునడక మిఠాయిపళ్లెము లను పట్టుకొని పల్లకీవైపువెళ్లినది.

ఎంతకొంతకై ఆ మిఠాయి పంపబడుచుండెనో ఆమె దానినిచూచి, "నీవెందుకు శ్రమపడవలెనమ్మా, ఆ దాసిచేతి కిమ్ము," అని యనెను.

ఇంద్రాణి సమ్మతింపక, "అందులో కష్టమేమున్నది?" అని యన్నది.

"అయితే నాచేతికే ఇమ్మమ్మా."

"వద్దు నన్నే తీసుకొనిపోనిమ్ము," అని ఇంద్రాణి యన్నది.

అనుచు అన్నపూర్ణ వివిధముగా అత్యంతప్రేమతో భక్తునికి అన్నదానముచేయపోవునో అదేవిధముగా నిశ్చలానురాగముతో మిఠాయిని పల్లకీలో నుంచి వచ్చినది.

పల్లకీ ఒక ధనీగృహావధువుది, ఆమెకు రెండునిమిషముల పాటే అల్పభాషిణియు మితభాషినియునగు ఇంద్రాణితో సంపర్కముకలిగినది. ఐనను ఆమెతో శాశ్వతమైత్రి నిర్మించుకొనవలెననుకోరిక ఆ అల్పసమయములోనే ఆ వధువులలోపుట్టినది.

స్త్రీలకు సులభమైనది అవమానశరములు వర్షించుట. నయనతార ఇంద్రాణిపై అట్టిశరములు క్రోధముతో వర్షించినది. కాని ఇంద్రాణి వానిని తనకు తాకనీయలేదు. అకళంకతేజస్సుతో నిర్మించబడిన ఆమె దృఢకవచమునకుతగిలి అన్నియు ముక్కలు ముక్కలై నేలపడినవి. ఇదిచూచి నయనతార మరింత మండి

పడుచుండెనని కనిపెట్టి, ఇంద్రాణి ఎవరికంటను పడకుండ నెమ్మదిగ ఇంటికి వెళ్లిపోయినది.

౨

బహుళాంతతతో ఓర్చియుండువారే లోలోపున గొప్ప బాధననుభవించువారు. నయనతార చేసిన అవమానమును ఇంద్రాణి ఆతినిర్లక్ష్యముగా నిరాకరించినది. ఐనను ఆమె మనస్సు లోలోపల గొప్పబాధ పొందుచుండెను.

ఇంద్రాణిని వినోదవిహారికిచ్చి పెండ్లిచేయు ప్రస్తావము జరిగినట్లుగానే నయవతారను ఇంద్రాణిమేన త్తకొమారుడు, నిరుపేదరైన వామాచరణునికిచ్చి పెండ్లిచేయవలెనని ఒకానొకప్పుడు మాటలుజరిగినవి. ఆ వామాచరణుడే ఇప్పుడు వినోద విహారికచేరిలో ఒక మామూలు గుమాస్తాగా నున్నాడు. ఇంద్రాణికి ఇప్పటికిని జ్ఞప్తియున్నది—చిన్నప్పుడొకనాడు నయనతారను ఆమెతండ్రి తమయింటికితీసుకొనివచ్చి వామాచరణుడు నయననెచ్చిన వివాహమాడునట్లుచేయుమని గౌరీకాంతుని అతిదీనముగ వేడుకొనెను. ఆబాలికయొక్క అసామాన్యప్రగల్భతను కనిపెట్టి అంతఃపుర స్త్రీ లాశ్చర్యపడిరి. అమ్మాయి అకాలపక్వత వారికి కుతూహలము కలిగించినది. ఆమె యెదుట నోరుపెగలని ఇంద్రాణికి తానుచేతకానిదని తోచినది. అబాలికధోరణి, ఆమె అనర్గళముగా మాటలాడుచుండుట, చూచి గౌరీకాంతునికి ముచ్చటవేసినది. కాని అతడు శాఖాభేదముండుటచే వివాహమునకు మాత్ర మొప్పుకొన

లేదు. చివరకు నయనతారను అకులీనుడగు వినోదునకిచ్చియే పెండ్లి చేసిరి.

పైనుకటి ఈ సమాచారమంతయు జ్ఞాపకముతెచ్చు కొనుటవలన ఇంద్రాణికి మనఃశాంతి కలుగుటకుమారుగా, అవమానము మరింత బాధించినది. మహాభారతములో వర్ణించ బడిన శుక్రాచార్యుని కన్య, దేవయానిమాటయు, శర్మిష్ఠ మాటయు ఆమెకు జ్ఞప్తికివచ్చినవి. దేవయాని ప్రభుకన్య శర్మిష్ఠదర్పమును చూర్ణముచేసి ఆమెను తనదాసిగాచేసి కొన్నది. నయనతారకుకూడ అట్టిపరాభవము కలిగినచో తగిన శాస్తియగును. దైత్యగురువు శుక్రాచార్యులు దైత్యుల కొకానొకప్పుడు అవసరమయియుండెను. అదేరీతిని తాత గౌరీకాంతుని సహాయము ముకుందబాబుగారి కుటుంబమునకు అత్యం తావశ్యకమైయుండెను. ఆరోజులలో గౌరీకాంతునకు బుద్ధి పుట్టియుండినచో ముకుందబాబును అతిదీనావస్థలో ఉంచి యుండును. కాని అతడు వారియున్నతికొరికై పాటుపడి వారి సంపద పెంపొందింప రాత్రింబగళ్లు ప్రయత్నించి, వారిని పెద్ద వారిగాచేసెను. కనుకనే ప్రభువులకు నేడామాట జ్ఞప్తియుంచు కొనుటకుకాని, గౌరీకాంతునియెడల కృతజ్ఞులైయుండుటకుగాని ఆవశ్యకత కనపడలేదు. 'బాఁకాగాడి' పరగణా చౌకగా అమ్మ కమునకువచ్చినప్పుడు గౌరీకాంతుడు సునాయాసముగా దానిని తానే కొనుకొనియుండవచ్చును. అట్లుచేయక దానిని తన యజమానునిపేరను కొని ఆతని యాస్తిని చేలరెట్లు పెంచెను.

ఇదికేవలము గౌరీకాంతుడు చేసినదానమనేచెప్పవచ్చును. ఐనను ప్రభువులయింట ఈమాట ఎవ్వరికిని జ్ఞప్తియేలేదే! "మాతాత గారుచేసిన దానమువల్లనే మమ్ములనవమానపరచు అధికారము మీకు లభించినది," అని తనలో తానుకొనుచు ఇంద్రాణి దుఃఖించుచుండెను.

ఇంద్రాణి ఇంటికి తిరిగివచ్చిచూచునప్పటికి భర్త, జమీందారుగారియింట పెళ్లివిందారగించి,ఆఫీసుపనులన్నియు ముగించుకొనివచ్చి పడకకుర్చీమీద వాలి వార్తాపత్రిక హాయిగా చదువుకొనుచుండెను.

భార్యాభర్తల స్వభావములు సాధారణముగా ఒకేమాదిరిగా ఉండునని అనేకులభిప్రాయపడుచుందురు. అట్టికలయిక బహుసముచితముగానూ సంగతముగానూ కనబడి మనహృదయములను ప్రీతితోనింపుచుండును, కనుక ఇట్టిదాంపత్యము అరుదైనప్పటికిని, ప్రతియింటను,ఉండుననుభ్రమ మనలోపుట్టుచుండును. కాని కొన్నిముఖ్యవిషయములలో ఇంద్రాణి—అంబికాచరణుల స్వభావములు ఒకేమాదిరివి. అంబిక ఎవరితోను అంతగా కలసిమెలసియుండువాడుకాడు. పనిమీదతప్పబయటికివెళ్లడు. తనపనిపూర్తిగా ముగించి ఇతరులుచేయవలసినపనిని పూర్తిగా వారివల్లరాబట్టుకొనుచుండును; పరులఆక్రమణమునుండి తప్పించుకొని, అత్మరక్షణముచేసికొనగోరుచుదుర్గమదుర్గమున ప్రవేశించునట్లు, ఇంటికితిరిగి వచ్చుచుండును. బయట తానూ, తనయధికారులపని; ఇంటిలో తాను, తన

ఇంద్రాణి—నీనికితప్ప అతని మనస్సులోగాని హృదయములోగాని మరిదేనికిని కావ్యలేదు.

నగలతో గలగల్లాడుచు ఇంద్రాణి గదిలోప్రవేశించగానే అంబికాచరణుడు పరిహాసముచేయుచు నేదో అనబోయెను కాని ఇంద్రాణిముఖము చూచి ఆపుకొని, ఆత్రతతో, "ఏమిజరిగినది!" అని అడిగెను.

ఇంద్రాణి తన మనోభారమును దులిపివేయ ప్రయత్నించి నవ్వుచు, "ఇంకేమి అవును? ప్రస్తుతము నాపతిరత్నదర్శనము లభించినది," అని అన్నది.

అంబికాచరణుడు వార్తాపత్రిక నేలపడవేసి, "అది నాకగోచరముకాదు; నేనుతెలియగోరుచున్నది తత్పూర్వము జరిగినదానినిగూర్చి," అని యనెను.

"తత్పూర్వము ప్రభువుభార్యయొద్దను ఆదరముపొందితిని," అని నెమ్మదిగ ఒక్కొక్కటిగ ఆభరణములనుతీయుచు భార్య జబాబుచెప్పెను.

"ఎటువంటి ఆదరము?" అని భర్త అడిగెను.

"నీవు నాకిచ్చు ఆదరము వంటిదికాదు," అని యనుచు ఇంద్రాణిభర్త పడకకుర్చీచేతిపైని కూర్చుండి అతని భుజములపై చేయివేసి మెడను కౌగలించుకొన్నది.

అటుపిమ్మట ఒక్కొక్కటిగ మెల్లమెల్లగ జమీందారుగారియింట జరిగినసంగతులన్నియు చెప్పినది. భర్తతో నేమియు చెప్పకూడదని నిశ్చయించుకొనియుండెను కాని, ప్రతిజ్ఞనిలు

పుకోలేకపోయినది. ఇంతకుపూర్వముకూడ అనేక తడవలు ఇదే రీతిని జరిగినది. పై వారిచగ్గిర మనస్సువిప్పి మాటలాడుట ఇంద్రాణికి ఎంతకష్టమో భర్తదగ్గర మనస్సులోనిచంతా వెళ్లపుచ్చుక యుండుట అంతకష్టము.

అంతయు వినినపిమ్మట అంబికాచరణునకు గొప్పబాధ కలిగినది. పట్టరాని కోపమువచ్చి, "ఇప్పుడే ఉద్యోగవిడిచి పెట్టెద" ననియన్నాడు. వినోదబాబుకు ఘాటైనఉత్తరము వ్రాయనలె నని లేచినాడు.

ఇంద్రాణి కుర్చీచేతిమీదినుండి లేచి నేల చాపపై కూర్చుండి భర్తఒడిలో చేయిఉంచి మందలించుచు నిట్లు చెప్పినది— "అంత తొందరపడవలసిన అవసరమేమి? ఇప్పు డెందుకు వ్రాయుట, రేపుదయము ఏదో ఆలోచించి నిశ్చయించవచ్చును."

"వద్దు ఒక్కనిమిషమైన జాలముచేయకూడదు," అని అంబికాచరణుడు ఉద్రేకముతో జబాబు చెప్పెను.

ఇంద్రాణి, పితామహుని హృదయమృణాలమున వికశించిన ఏకైకపద్మము. తాతగారి హృదయములోనుండి ప్రేమరసము పీల్చినట్లే ఆమె అతని మనస్సులోనుండి అనేక భావములను, తానెరుగకయే, తీసికొన్నది. ముకుందబాబుగారి వంశముయొడల గౌరీకాంతుని హృదయమునసుండిన నిష్ఠ, భక్తి, పూర్తిగా ఇంద్రాణిమనస్సున అవతరించలేదు. కాని ప్రభువులహితమునకై జీవనమర్పించుట తమకర్తవ్యమను

మాట ఆమెమనస్సున బద్ధమూలమైయుండెను. అంబికా చరణుడు ఉన్నతవిద్యపొందినవాడు. కోరినచో వకీలయి డబ్బార్జించగలిగియుండును. అదికాక గొప్పఉద్యోగమేదైన సంపాదించుకొనగలవాడు. కాని భార్యదృఢసంకల్పముననుసరించి, ఏకాగ్రచిత్తతతో బహు ఆనందముగా వినోదుని ఎస్టేటు మేనేజరుగా ఉండి అతని ఉన్నతికై పాటుపడ నిశ్చయించుకొనెను. అనమానమువల్ల బాధపొందుచున్నను తనభర్త వినోద బాబుగారి ఉద్యోగము విడిచిపెట్టుటకుమాత్రము ఇంద్రాణి మనస్సు ఒప్పుకొనలేదు.

ఇంద్రాణి కొంచెమాలోచించి మృదుస్వరముతో నిట్లన్నది — "ఇందులో వినోదబాబు దోష మేమున్నది? అతడేమియు ఎరుగడు, అతని భార్యమీద కోపమువచ్చి అతనితో పోట్లాకెందుకు?"

ఈమాట విని అంబికాబాబు బిగ్గరగా నవ్వెను. తన సంకల్పము తనకే మిక్కిలి హాస్యకరముగా కనపడి, "ఔను ఆ మాట నిజమే," అన్నాడు. "కాని అతడు నాప్రభువైనప్పటికిని, ఇటుపై నెన్నడును నిన్నువారియింటికి పంపను."

ఈ చిన్నతుపానుతో ఆనాటి మేఘము చెదిరిపోయినది. ఇల్లు యథారీతిని ప్రసన్నతతో కలకల్లాడుట ప్రారంభించినది. భర్తప్రేమలో మునిగి ఇంద్రాణి బయటి అనాదరణను పూర్తిగా మరచినది.

3

అంబికాచరణునిపై సంపూర్ణమగు నమ్మకముండుటచే వినోద విహారి జమీందారీపని తానేమియు చూచువాడుకాదు. ఏవిషయములోనైనను భార్యను సందేహించని భర్త సంపూర్ణవిశ్వాసముకొలది భార్యయెడల ఏవిధముగా బహునిర్లక్ష్యముగా నుండునో తన జమీందారీనిగురించి వినోదుని అశ్రద్ధకూడ రమారమి అదేమాదిరిగా నుండెను. జమీదారీకాబడి వివరము స్థిరపడి, వసూళ్లు నిరాటంకముగా జరుగుచుండెను. సునాయాసముగ ఆదాయము వచ్చుచుండుటచే వినోదునకు దాని ఆకర్షణ పోయి, కుబేరుని భాండాగారమున ప్రవేశించు రహస్యపు సొరంగమార్గమొకటి కనిపెట్టవలెనను పిచ్చికోరికపుట్టినది. అనేకరకముల సలహాలపైని రహస్యముగ నానారకములవ్యక్తకములలోనికి దిగెను. ఒకమారు దేశములోని తుమ్మచెట్లన్నియు కొట్టించి బండ్లకు చక్రములుచేయించ నిశ్చయించెను. సుందరవనములోని తేనెపట్లన్నియు గుత్తపాడి డబ్బుసంపాదించ నిశ్చయించె నొకసారి. మరియొకసారి పశ్చిమప్రాంతములసున్న కర్కాయలు గుత్తపాడి లక్షలుసంపాదించ నిశ్చయించెను. బయటివారెవరైన వినిరచో నవ్వుదురని ఎరిగి ఇట్టివ్యాపారముల సంగతి మిక్కిలి రహస్యముగ నుంచుచుండెను. ముఖ్యముగా అంబికాచరణునకు తెలిసిపోవునేమో యని అతడు సిగ్గుపడుచుండెను. నష్టము వచ్చునని భయపడి అంబిక నిరుత్సాహపరచునని వినోదుని సందేహము. అంబికాచరణుడే జమీందారుడయినట్లును, ఏవిషయములోను దూరక డూరక

కూర్చొనియుండుటకై యే అతనికి జీతము నిర్ణయమైనట్లు వినో దుని నడవడివలన అందరికిని తోచుచుండును.

విందయిన మరునాటినుండి నయనతార భర్తచెవిలో మంత్రోపదేశముచేయ మొదలుపెట్టినది: "నీవేమియు స్వయ ముగా చూచుకొనవు. అంబిక నీకెంత ఇచ్చునో దానినే అందు కొని తృప్తిపొందుచుందువు, లోలోపున ఎంతదోపుడు జరుగు చున్నదో ఎవరికిని తెలియదు," అని ఆమె అన్నది. "ఆ నాడు మీ మేనేజరుభార్య పెట్టుకొనివచ్చిన నగలు ఈ ఇంట నే నొక్కనాడైన చూడలేదు. ఆ నగలు ఆమెకెక్కడివి? అట్లు గర్వముతో విరిగిపడుచుండుటకు ఆమెకు ధైర్యమెట్లుకలిగినది?" ఇట్లనుచు, ఆనాడు ఇంద్రాణిపెట్టుకొనివచ్చిన నగలను ఇంతది అంతచేసి వర్ణించి, ఇంద్రాణి తన దాసితోచెప్పినదని ఎన్నో మాటలు కల్పించి భర్తచెవినివేసినది.

వినోదునిది దుర్బల స్వభావము. ఎవరినైన నమ్మి నిశ్చిం తగా కూర్చొనలేడు, ఎవరేదిచెప్పినను నమ్మి ఇతరులను సందే హించుచుండును. మేనేజరు మోసపుచ్చుచున్నాడని అతని చెవినిపడగానే అతడు దొంగయను నమ్మకము ఒక్కతూణములో దృఢమైపోయినది. ఏ వ్యవహారమునుగురించియు అతనికి ప్రత్య క్షానుభవము లేకపోవుటచేత, మేనేజరు అనేకవిధముల తనను మోసపుచ్చుచున్నాడని ఊహించుకొని భయపడెను. అయినను అంబికుని మోసమును కనిపెట్టుమార్గమేదియు ఊహించలేక

పోయెను. మేనేజరుని ఏమైన అడుగుసాహసముకూడ అతనికి లేదు—ఎట్లు చూచినను చిక్కు గట్టిదే!

అంబికాచరణుని ఏకాధిపత్యము చూచి క్రింది ఉద్యోగస్థులందరికిని ఈర్ష్యకలుగుచుండెను. గౌరీకాంతుడు ఉద్యోగమిచ్చిన దూరపు మేనల్లుడు-వామాచరణునకు.-అంబికాచరణుని పై ఈర్ష్య అందరికంటె తీవ్రముగనుండెను. ఏవిషయములోను తనకు అంబికకు భేదము లేదనియు,బంధువుడైయుండికూడ అంబిక ఈర్ష్యకొలది తనను పైకి లేవనీయకున్నాడనియు వామాచరణుని నమ్మకము. ఉన్నత పదవిరాగానే ఆ పదవికితగిన శక్తిసామర్థ్యములు తమంతట తా మే వచ్చునని వామాచరణుని మతము. ముఖ్యముగా మేనేజరుపని అతిసానూన్యమైనదని వామాచరణుడనేవాడు—పూర్వకాలమున రథమునపై నెక్కుచుండు పతాకమువంటివాడు మేనేజరు—గుర్రములు రథమును చచ్చి చచ్చి లాగుచుండును, పతాకమహోశయుడు మానసు హాయిగా గర్వముతో తలయూడించుచుండును.

ఏపని ఎట్లుజరుగుచున్నదని వినోదుడు ఇప్పటివరకు ఎన్నడును అడుగలేదు. డబ్బు పెద్దమొత్తమెన్నడైన అవసరమయినప్పుడు ఖజాన్‌జీ దగ్గరకు రహస్యముగావచ్చి క్రైజకీలో ఎంత డబ్బు ఉన్నదని అడుగుచుండును. ఎంతమొత్తమున్నదో ఖజాన్‌జీ చెప్పినపిమ్మట పై వారి డబ్బునిమ్మని కోరుచున్నట్లు కొంచెము తత్తరపడుచు తనకు కావలసిన సొమ్మునడుగుచుండును. ఖజాన్‌జీ జమీందారుగారి సంతకముతో రసీదు

పుచ్చుకొని సొమ్మిచ్చుచుండును. అటుపిమ్మట కొన్నాళ్లవరకు వినోదవిహారి అంబికాచరణువి దగ్గర అతిసంకోచముతో సిగ్గు పడుచు మసులుచుండును; అంబికునికంట పడకుండయుండిన సుఖపడెద నన్నట్లు ప్రవర్తించుచుండును.

అంబికాచరణుడు మధ్యమధ్య చిక్కులలో పడుచుండెను. రూపాయిలు వసూలుకాగానే జమీందారుగారికి అతనివంతు పూర్తిగా ఇచ్చుచుండును. సర్కారు వేష్కసు నిమ్మిత్తము, ఉద్యోగస్థులజీతములు మొదలగు అత్యవసరమగు ఖర్చులనిమిత్తము కావలసినది మాత్రమే మిగిలియుండును. ఈ సొమ్ములోనుండి ఖర్చుపెట్టుటవలన అనేకవిధముల కష్టపడవలసి వచ్చుచుండెను. ఈవిషయమై వినోదునితో మాటలాడుట కైనను అంబిక కవకాశముచిక్కునదికాదు. వినోదుడు దొంగవలె మేనేజరును తప్పించుకొని తిరుగుచుండుచాడు. అంబిక జాబుమూలమున తన అభిప్రాయమును తెలియచేసినను ప్రయోజనము లేకుండెను. ముఖస్థముగా జబాబుచెప్పుట అవసరము లేనంతసేపు దేనికిని సిగ్గుపడువాడుకాడు వినోదుడు.

వినోదుని వ్యవహారము క్రమేణ మితిమీరుచుండుట చూచి అంబిక ఇనుపపెట్టెతాళముచెవిని తనయొద్దనుంచుకొనెను. అప్పటినుండి రహస్యముగ రూపాయిలు తీసుకొనుటకు వీలు లేకపోయినది. వినోదుడు ప్రభువైనను దుర్బలుడగుటచే మేనేజరుతో ఈవిషయమై ఏమియు ననలేకపోయెను. కాని అంబికాచరణుని ప్రయత్నములన్నియు వృథాయైనవి. 'అ-లక్ష్మి'

సహాయపడుచున్నప్పుడు తాళము చెప్పులు దొరకకుండ చేసినంత మాత్రాన రూపాయిలు దొరకకుండ చేయలేము. తాళము చెప్పులు దాచియుంచుటవలన మేలునకుబదులు కీడుసంభవించినది. ఆకథ యథాసమయములో తెలిసికొనగలము.

అంబికుని ఘాతైవ కాయిదావల్ల వినోదునికి క్రోధము కలిగినది. సరిగా ఆరోజులలోనే నయనతార అతనిలో సందేహమును పుట్టించుటవల్ల అతనిమనస్సుకు కొంతహాయి కలిగినది. క్రింది గుమాస్తాల నొక్కొక్కనిని పిలిచి మేనేజరునుగురించి ప్రశ్నింపసాగెను. ఈ కార్యములో వామాచరణుడు ముఖ్యగుప్తచరుడు.

గౌరీకాంతుడు దివాన్‌గా నున్నప్పుడు ఇరుగుపొరుగు జమీందారులతో బహుకఠినముగా వ్యవహరించి వారి జమీందారీలలోనుండి ఆస్తిని అనేకముగ తమ జమీందారీలో కలుపుకొనెను. కాని అంబికాచరణుడు అట్టిపని చేయ పూనుకొనలేదు. పైగా ఇతరులపై దావాలువేసిన తరువాతకూడ వారితో రాజీపడి తగాదాలు సాధ్యమైనంతవరకు ఫైసలుచేసికొన ప్రయత్నించుచుండెను. వామాచరణుడిటువంటి వానిని నిదర్శనముగా చూపించి, అంబికాచరణుడు శత్రుపక్షము వారి వద్దను లంచముపుచ్చుకొని వారితో రాజీపడి ప్రభుపుకు నష్టము కలుగించుచున్నాడని చెప్పెను. వామాచరణుడు అదే నిజమని నమ్మసాగెను. చేతకానివాడు తప్ప లంచము దొరకునప్పుడు పుచ్చుకొననివాడుండడని అతని మతము.

అనేకులనోట రహస్యముగ నిట్టి వదంతులు వినుట వలన వినోదుని సందేహము బలపడినది, కాని అతడు బహిరంగముగ నేమియుచేయ లేకపోయెను. దానికి మొదటి కారణము అతనికి సాహసము లేకపోవుట—ముఖమునెదుట ఎవ్వరిని ఏమియు నడుగ లేడు. రెండవకారణము భయము—అంబికా చరణుడు జమీందారీనిగురించి సమస్తమును ఎరిగినవాడు, అతడు పగపట్టినచో ఎట్టి అనిష్టమునైన చేయగలడు.

చివర కొకనాడు నయనతార భర్త పిరికితనమునుచూచి మండిపడి, అతనికి తెలియకుండ అంబికాచరణునకు కబురుపంపి పరదా వెనుకనుండి ఈ విధముగా అన్నది—"నిన్నిక ఉద్యోగములో ఉంచము, వామాచరణునకంతయు అప్పచెప్పి నీవు వెళ్లిపోవచ్చును."

తనపై వినోదునితో నానారకముల పోటీలందరును చెప్పుచున్నారని అంబికుడు ఇంతకుపూర్వమే సూచాపాచా తెలుసుకొన్నాడు. కనుక నయనతారమాటలు విని అతడంతగా ఆశ్చర్యపడక, వినోదునియొద్దకు తత్‌క్షణమే పోయి, "నన్ను ఉద్యోగము విడచిపొమ్మని నీకోరికయా?" అని అడిగెను.

"అబ్బే ఎంతమాత్రముకాదు," అని తడబడుచు వినోదుడు జవాబు చెప్పెను,

"నామీద మీకేమైన సందేహమున్నదా?" అని అంబిక మరల నడిగెను.

వినోదుడు సిగ్గుపడి, "ఎట్టిసంచేహామునులేదు," అని తడబడుచు జబాబుచెప్పెను.

అంబి కాచరణుడు నయనతారతో తనకు జరిగిన సంభాషణను గురించి ఎవరితో నేమియుననక, మామూలు ప్రకారము ఆఫీసుకువచ్చి తనపనిచేసుకొనెను. ఇంటికివచ్చి భార్యతోకూడ నేమియుచెప్పలేదు. కొన్నిదినము లిట్లు గడచినవి.

ఈ పరిస్థితులలో అంబి కాచరణునకు ఇక్కట్లు ఎక్కువచ్చుట తటస్థించినది. తీవ్రరోగము కాకపోయినను అతడు దుర్బలావస్థలో నుండుటచే చాలారోజులవరకు ఆఫీసుకు వెళ్లలేకపోయినాడు.

ఆరోజులలోనే వేమ్కసుచెల్లించుట మొదలగు ముఖ్యకార్యముల ఒత్తిడి అధికముగా నుండుటచే అంబి కాచరణుడు ఒకనాడు హఠాత్తుగా రోగశయ్యవిడిచి ఆఫీసుకు వచ్చెను.

ఆనాడతడు ఆఫీసుకువచ్చునని ఎవ్వరు ననుకొనలేదు. అందరును, "మీ రింటికి వెళ్లండి, ఇంతజబ్బుతో పనిచేయకూడదు," అని యనిరి.

వారిసలహా వినిపించుకొనక అంబికుడు తన టేబులు యొద్దకు వచ్చికూర్చుండెను. గుమాస్తాలు గడబడపడి బహుశ్రద్ధతో తమతమ పనులలో మునిగియున్నట్లు నటించిరి.

అంబి కాచరణుడు సొరుగుతీయగా అందులో ఒకకాగిత మైన కనపడలేదు; నిశ్చింతపోయి కాగితములేమైనవి అతడంద

రిని అడిగెను. ఆకాశమునుండి అప్పుడే ఊడిపడినట్లు అతిఅమాయకముగ అందరు చూచుచుండిరి. దొంగవచ్చి ఎత్తుకొనిపోయెనో లేక భూతమువచ్చి తీసుకొనిపోయెనో ఎవ్వరును స్థిరపరచలేకపోయిరి.

అప్పుడు వామాచరణుడువచ్చి, "అనవసరముగా గొడవ చేయుదురేల? కాగితములన్నియు జమీందారుగారే స్వయముగా తీసికొనిపోయిరి— ఈ సంగతి అందరునెరిగినదే!" అని చెప్పెను.

అంబికుడు కోపమాపుకొని తెల్లపోయి, కారణమేమి అని అడిగెను.

"మేమెట్లు చెప్పగలము?" అని వామాచరణుడు, ఏదో వ్రాయుచున్నట్లు నటించుచు జవాబుచెప్పెను.

అంబికాచరణుడులేని శుభసమయమున వామాచరణుని ఉపదేశానుసారము వినోదుడు మారుతాళముచేయించి మేనే జరుగారిడ్రాయరును తెరచి అతని దొంగతనము కనిపెట్టి కోరి అంబికుని ప్రైవేటుకాగితములన్నియు తీసికొనిపోయెను.

కపటబుద్ధిగల వామాచరణుడు ఈరహస్యము దాచియుంచలేదు.

ఇట్టి యవమానము జరిగినతరువాత ఉద్యోగములో ఉండుట ఉచితముకాదని అంబికుడు స్థిరపరచుకొనెను.

తాళము చెవినైనను తీయక అంబికుడు తత్క్షణమే లేచి వినోదుని కలుసుకోవలెనని బయలుదేరెను. వినోదుడు బయ

టికి రాలేదు, తలనొప్పిచే బాధపడుచున్నానని కబురుపంపెను. అంబికుడు తిన్నగ నింటికి వచ్చి మంచముపై కూలపడెను. ఇంద్రాణి తొందర తొందరగా భర్తదగ్గరకు పరుగెత్తివచ్చి అతని నోదార్చ మొదలుపెట్టినది. క్రమక్రమముగ ఇంద్రాణికి అంతయు తెలిసినది.

సౌదామినియొక్క సహజనిశ్చలత నే డామెలో కనబడ లేదు. నీలిమేఘమువంటి కళ్లలో తీక్ష్ణమగు వజ్రశిఖ పుట్టి నది—"అట్టి భర్త కిట్టి అవమానమా! అంత విశ్వాసమున బహుమానమా!"

ఆమె నిశ్శబ్దక్రోధ జ్వాలచూడగానే అంబికుని కోపము చల్లారిపోయినది. దేవి క్రోధమునుండి పాపిని తప్పించుకోరుచు అతడు ఇంద్రాణిచేయిని పట్టుకొని మృదువుగా నిట్లనెను—"వినోదుడు కుర్రవాడు, అతనిది దుర్బల స్వభావము. నలుగురు చెప్పిన మాటలవల్ల మనస్సు చెడిపోయినది."

ఇంద్రాణి భర్తభుజములపై రెండుచేతులను వేసి అత నిని తనగుండెపై గట్టిగా నొక్కుకొన్నది. ఆమె నేత్రము లలోనుండు కోపజ్వాలలారి బొటబొట నీళ్లు కారసాగినవి. ఎట్టి అన్యాయముగాని అవమానముగాని అతనిని అంటకుండు నట్లు బాహుపాశములో అతనిని బంధించి హృదయదేవత యైన అతనిని తన హృదయమందిరములో దాచుకొనినది.

ఉద్యోగము మానివేయవలెననియే అంబికాచరణుడు స్థిరపరచుకొనెను—నేడు దీని కెవ్వరును అడ్డుచెప్పలేదు. కాని

నమ్మకములేక ప్రభువే అతనిని ఉద్యోగములోనుండి తొలగించ కోరుచున్నప్పుడు తా నుద్యోగమును విడిచిపెట్టినచో ప్రభువుపై శాస్తి విధించుట ఎట్లగును? ఉద్యోగము విడిచిపెట్ట నిశ్చయించుకోగానే అంబికుని కోపము చల్లారిపోయినది; కాని పనిపాట్ల మధ్యను, సుఖశాంతుల మధ్యను ఇంద్రాణిహృదయములో కోపాగ్ని రవులుచునే యుండెను.

ఆ సమయమున జమీందారుగారి యింటినుండి ఖజాంజీ వచ్చియున్నాడని నౌకరు కబురు తెచ్చెను. ఎదుట మాటలాడు సాహసములేని వినోదుడు మేనేజరును ఉద్యోగము మాను కొమ్మని ఖజాంజీద్వారా! కబురుపంపెనని అంబికు డనుకొనెను. కనుక తానే ఉద్యోగము విడుచుచున్నట్లు తెలియపరచుచు ఉత్తరమొకటి వ్రాసి ఖజాన్‌జీచేతిలో పెట్టెను.

దీనివిషయమై ఏమియుననక, "ఘోర విపత్తు సంభవించినది," అని ఖజాంజీ అనెను.

"ఏమి జరిగినది?"

అంబికాచరణుడు వినోదుని మంచికోరి అనవసర ఖర్చుల కతనికి సొమ్ము దొరకకుండునట్లు అంబికుడు చేసినప్పటినుండి, వినోదుడు దొరకినచోటెల్ల అప్పుచేయుట ప్రారంభించెను. ఒకటైనతరువాత నొకటి క్రొత్తక్రొత్త వ్యాపారములు రహస్యముగ ప్రారంభించుచుండెను. నష్టపోవుచున్న కొలది పౌరుషమధికమగుచుండెను. ఒక వర్తకములో వచ్చిన నష్టమును దిద్దుకొనగోరి మరి ఒక క్రొత్తవర్తకము ప్రారంభించుచుండెను. ఇట్లు

పోనుపోను కొంచెము కొంచెముగా ఆ ధనము ఋణములో మునిగిపోయెను. అంబికుడు జబ్బుతో పడియున్నప్పుడు వినోదుడు ఖజానాలోని డబ్బంతయు తీసికొనెను. చివరవరకు బాకీగాడి పరగణాకూడ పొరుగు జమీందారుకు తనఖాగా ఈయబడినది. ఆ జమీందారు వడ్డీ బాగా పెరగనిచ్చి దావాచేసి డిక్రీ పొందుటకు సిద్ధముగానున్నాడు. ఇప్పుడు నెత్తిమీద పడబోవుచున్న విపత్తిదియే!

విని అంబికుడు నిర్ఘాంతపోయి ఏమియు నన లేక, కొంత సేపటికి జబాబుచెప్పెను. "ఏమిచేయుటకు తోచకున్నది, ఆలోచించి రేపు చెప్పెదను." ఇట్లని ఖజాన్‌జీకిచ్చిన రిజగ్నేషన్ కాగితము తిరిగి తీసుకొనెను.

అంబికాచరణు డంతఃపురములోనికివచ్చి ఇంద్రాణికి సమాచారమంతయు సవిస్తరముగ తెలియచేసి, "ఈ పరిస్థితులలో నేను ఉద్యోగము మానలేను," అని చెప్పెను.

ఇంద్రాణి చాలసేపటివరకు రాతి విగ్రహమువలె నిశ్చలముగ నిలబడిపోయినది; తనలోపల రేగుతున్న విరోధమును కాళ్లక్రింద పూర్తిగా క్రుమ్మి చివరకు, "ఔను ఇప్పుడెట్లు మానగలవు?" అని యన్నది.

తరువాత రూపాయిలకొరకు అనేక ప్రయత్నములు జరిగినవి. కాని అవసరమున్నంత డబ్బు జతపడలేదు. అంతఃపురములోనికిపోయి భార్య యాభరణములు తెమ్మని అంబికుడు వినోదునకు సలహా ఇచ్చెను. ఇంతకుపూర్వము వర్తకమున

కనసరకైనప్పుడు వినోదుడా ప్రయత్నము చేసియుండెను—కాని కృతార్థుడు కాలేదు. ఇప్పుడు తిరిగి లోనికివెళ్లి మంచి మాటలాడి, ఎంతో దీనముగ వేడుకొనెను. కళ్ల నీరుపెట్టుకొని దుఃఖించుచు ఆభరణభిక్షకై ప్రార్థించెను. నయనతార హృదయము కరగలేదు. ఎటువైపుచూచినను అప్పులే. తమ యాస్తి అంతయు ఇతరులపాలై పోవుచున్నది. నయనతారకు చివరకు మిగులునది ఈ నగలుమాత్రమే. కనుక ఏదెట్లు జరిగినను నగలనుమాత్రము విడువకూడదని నిశ్చయించుకొని ఆఖరి పట్టు పట్టుకొని కూర్చున్నది.

ఎంతప్రయత్నించినను ఎక్కడను రూపాయలు దొరకలేదు. పగతో మాడియున్న ఇంద్రాణిముఖమున ఆనందరేఖ యొకటి కనిపించినది; భర్తచేయిని పట్టుకొని "నీవు చేయగల దంతయు చేసితివి. మరి నీకర్తవ్యమేమియులేదు, నిశ్చింతగా కూర్చుండుము. జరుగవలసినది జరుగక తప్పదు కాదా?" అని యన్నది.

భర్త యవమానమువలన సతిహృదయమున పుట్టిన రోషానలము ఇప్పటికి ఆరలేదని కనిపెట్టి అంబికాచరణుడు తనలో తాను నవ్వుకొనెను. ఆపదసమయములో దిక్కుమాలిన బాలకు డేరీతిచేయునో ఆరీతిని కేవలము తనమీదనే ఆధారపడియున్న వినోదునిచూచి అంబికునకు జాలికల్గినది. తానతనిని ఇప్పు డెంతమాత్రము పరిత్యజించలేడు. తన యాస్తిని

తనకాపెట్టి వినోదుని రక్షించవలెనని చూచెను. కాని "మన ఆస్తిమీద చేయివేయకూడదు, వట్టు!" అని అన్నది ఇంద్రాణి.

అంబికాచరణుడు అమిత కలవరపడెను. ఇంద్రాణికి మంచిమాటలతో బోధపరచవలెనని ఎంతో ప్రయత్నముచేసెను, కాని ఇంద్రాణి అతనిని మాటాడనీయలేదు. చివరకు అంబికుడు ఆశీవదలుకొని కూర్చుండెను.

ఇంద్రాణి ఇనపపెట్టె తెరచి తన నగలను ఒక్కొక్కటిగ తీసి పెద్దపళ్లెములో కుప్పపెట్టినది. ఆ భారీ పళ్లెమును రెండు చేతులతో పట్టుకొని భర్తయొద్దకి వచ్చి అతని పాదముల దగ్గర ఉంచినది.

పితామహుని ఏకమాత్ర ప్రేమధనమైన ఇంద్రాణి పుట్టిన నాటినుండి ఏటేట తాతగారిచ్చిన విలువైన కానుకలు కూడబెట్టి యుంచినది. భర్త మితవ్యయము చేయువాడు, అతడు మిగల్చగల రూపాయన్నియుకూడ, ఈ సంతాన హీన రమణియొక్క భాండాగారమున ఆభరణరూపముగ రూపాంతరము పొందుచుండెను. ఆ సువర్ణమణి మాణిక్యములను భర్తయొద్దుట నుంచి ఇంద్రాణి ఇట్లనెను: "మాతాతగారు తన ప్రభువుకు దానముచేసిన బొకాగాడి పరగణా ఈ నగలతో కొనితిరిగి ప్రభువంశమునకు దానముచేసెదను."

ఇట్లనుచు ఇంద్రాణి తన తడి కన్నులనుమూసి తలవాల్చి ఊహించుకొన్నది. వృద్ధ పితామహుడామె ఊహానేత్రము

నకు ఆ ముహూర్తమున ప్రత్యక్షమాయెను. శుభ్ర కేశ రాశి, ప్రేమమయహాసము, ధీ-ప్రదీప్తమైన ఉజ్జ్వల గౌరవర్ణ ము-పితామహుడు అక్కడ ఆసనమందు నిలుచొని అత్యాదర ముతో తన చేతులను ఇంద్రాణి తలపైనుంచి ఆమెను దీవించ సాగెను. బొకాగాడి తిరిగి వేలాములో కొనబడినది. పతిజ్ఞా భంగముచేసి ఇంద్రాణి తిరిగి ప్రభువుల యింటికి విందుకు వచ్చి నది. ఆమె ఒంటిని ఒక్క నగలేదు. ఎవరికిని అవమానము కలుగలేదు. ఎవరిమనస్సుకు బాధకలుగలేదు.

స్వామిశాస్త్రులు అండ్ సన్స్వారి
ముద్రితము.—10-2-1955.

విశ్వభారతి గ్రంథమాల

రవీంద్రనాథ ఠాకూర్ రచన:

యోగవియోగములు (నవల-510 పుటలు)			4	8	0
పడవమునుక (నవల 560 పుటలు)			5	0	0
,,	1-భాగం	280 ,,	2	8	0
,,	2-భాగం	280 ,,	2	8	0
ఇంటాబయట	నవల	...	4	0	0
ప్రాయశ్చిత్తము	,,	...	3	0	0
గృహప్రవేశం	నాటకం	...	1	4	0
పోస్టాఫీస్	,,	...	0	12	0
కథాగుచ్ఛము	మొదటిభాగం	...	2	8	0
కథాగుచ్ఛము	రెండవభాగం	...	2	8	0
కథాగుచ్ఛము	మూడవభాగం	...	2	8	0
,,	,,	ప్రథమఖండం	1	4	0
,,	,,	ద్వితీయఖండం	1	4	0
కథాగుచ్ఛము	నాల్గవభాగం	అచ్చులోనున్నది	2	0	0
కథాగుచ్ఛము	ఐదవభాగం	,,	2	8	0
కథాగుచ్ఛము	ఆరవభాగం	,,	2	8	0
చతురంగము		,,	1	8	0

నిరుపమాదేవి రచన: అన్నపూర్ణమందిరము నవల 3 0 0

మారిస్ మేతర్‌లింక్:

(నోబెల్ ప్రైజుపొందిన బెలిజియం దేశపు కవి)

స్టిల్‌మాండ్ మాజిస్టేట్—నాటకం ...	1	0	0
శరత్‌చంద్ర చట్టోపాధ్యాయ—చిన్నకథ	0	8	0
వదిన; దొడ్డమ్మ	1	8	0

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
292, ఎస్‌ప్లనేడ్. చిన్నపురి.

పోస్టుబాకు 3372

vaaradhionline.com